epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

4-6-2025 బుధవారం సంపుటి: 31
సంచిక: 123 పేజీలు: 10+4 వెల: 6.50

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

'గాంధీ'లో అవయవ మార్పిడి ఆపరేషన్ థియేటర్లు 3

జి-7 సమావేశాలకు ఆహ్వానం లేదా? 5



# విజేత ఆర్సీబీ

## ఫలించిన 18 యేళ్ల నిరీక్షణ

ఐపిఎల్-2025 కప్పును ముద్దాడిన రాయల్ ఛాలెంజర్స్

6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్ ఓటమి



**అమ్మాదాబాద్,జూన్ 3:** ఐపిఎల్ 18వ సీజన్ విజేతగా రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలిచింది. పంజాబ్ కింగ్స్‌పై జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్సీబీ ఆల్‌రౌండ్ ట్యాలెంట్‌ను చూపించి విజయంసాధించింది. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆర్సీబీకి ఐపిఎల్ ఛాంపియన్‌ట్రోఫీ దక్కింది. గతంలో మూడుసార్లు ఫైనల్‌వరకూ వెళ్లినా ట్రోఫీ చేజిక్కించుకోలేదు. నాలుగో ప్రయత్నంలో సాధించింది. పంజాబ్‌కింగ్స్‌పై ఆరు >>2


## కాళేశ్వరం విచారణపై అధికారుల్లో టెన్షన్.. టెన్షన్

గందరగోళంలో పలువురు మాజీ ఇఎన్‌సిలు, ప్రస్తుత సిఇ, ఎస్ఇలు

ఒకవైపు విజిలెన్స్ రిపోర్టు, మరోవైపు ఎన్‌డిఎస్ఎ నివేదిక

ఘోష్ విచారణ కీలకం.. చర్యలకు సిద్ధమైన సర్కార్

# మునుగుడో.. తేలుడో!




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్3:** కాళేశ్వరం విచారణపై అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ఒకవైపు విజిలెన్స్ రిపోర్టు.. మరోవైపు ఎన్‌డిఎస్‌ఏ నివేదిక, ఇంకోవైపు పీసీ ఘోష్ కమిషన్ విచారణతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ బ్యారేజ్ కుంగుబాటుకు కారణమైన ప్రాజెక్ట్ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 17 మంది ఇరిగేషన్ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణమైన నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నుంచి బ్లాక్7 నిర్మాణ ఖర్చును వసూలు చేయాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సంచలన సిఫారసు చేసింది. బ్యారేజ్ కుంగుబాటుకు మొత్తం 57 మంది అధికారులను బాధ్యులుగా తేల్చింది. 33 మంది ఇంజనీర్లపై పెనాల్టీ వేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. చర్యలకు ఆదేశించిన అధికారుల లిస్టులో పలువురు మాజీ ఈఎన్సీలు,ప్రస్తుత సీఈ,ఎస్ఈల పేర్లు ఉన్నాయి. మార్చి 5వ తేదీన విజిలెన్స్ తన నివేదికను కమిషన్‌కు అందించింది. తర్వాత అదే నెల 18వ తేదీన నివేదికను కమిషన్ యథాతథంగా ఆమోదించి, మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్అండ్ టీ నుంచి బ్లాక్7కు అయిన ఖర్చును తిరిగి రాబట్టాలని సిఫారసు చేసింది. కమిషన్ నివేదిక పూర్తి పాఠం తాజాగా వెలుగులోకి వచ్చింది. మేడిగడ్డ బ్యారేజీని 8 బ్లాకులుగా, 85 పిల్లర్లతో నిర్మించారు. అంచనా వ్యయం రూ.4613 కోట్లు. ఇక ఏడో బ్లాకులో మొత్తం 11 పిల్లర్లు ఉండగా వాటి పునర్నిర్మాణానికి అయ్యే మొత్తాన్ని ఎల్ అండ్ టీ నుంచి వసూలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ గత మార్చి 18వ తేదీన ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు సిఫారసు చేశారు. ఇప్పటిదాకా మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ పునర్నిర్మాణ బాధ్యతను, ఖర్చును ఎల్అండ్‌టీ భరించాలని నీటి పారుదల శాఖ కోరుతూ వచ్చింది. తాజాగా రికవరీ చేయాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి >>2

# నిరంతరం అప్రమత్తం

ఎమర్జెన్సీ టీమ్‌లు 24 గంటలూ అందుబాటులో ఉండాలి

కమాండ్ కంట్రోల్ నుంచి మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు

వర్షాకాల సన్నద్ధతపై సిఎం రేవంత్ సమీక్ష

రాజీవ్ యువశక్తి వికాసం, భూభారతిపై రేపు కేబినెట్ సమావేశంలో నిర్ణయాలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్3:** మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు.ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు.హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపులతో బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళ వారం సమీక్షించారు. వాతావరణ శాఖ సూచనలను అనుగుణంగా ముంద స్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకు నేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించిన ముఖ్యమంత్రి కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి >>2

## కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బిఆర్ఎస్ నేతలదే హవా!

మీనాక్షికి మొరపెటుకున్న పలు జిల్లాల కాంగ్రెస్‌నేతలు

పార్టీని బలోపేతం చేసే దిశగా కదులుతున్న అధిష్ఠానం 7

మీరేమైనా చరిత్రకారులా?

## క్షమాపణ చెప్పండి..

కమల్‌హాసన్‌ను మందలించిన కర్ణాటక హైకోర్టు





5 చెప్పను..

నా సినిమాను కర్ణాటకలో విడుదల చేయను.. మొండికేసిన కమల్

## నాలుగువేలు దాటిన కరోనా కేసులు

మరో ఐదుగురు మృతి 2

# ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా

నాలుగు రోజుల్లో 3556 మంది గ్రామ రెవెన్యూ అధికారుల నియామకం

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాల్సిన బాధ్యత అధికారులదే

అసైన్మెంట్ కమిటీలు తిరిగి అమలు

భూభారతి సర్వే, రెవెన్యూ సదస్సుల ప్రారంభ వేడుకలో డి.సిఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి



మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలంలో మంగళవారం జరిగిన భూభారతి సర్వే, రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

**ఎర్రుపాలెం జూన్3 ప్రభాతవార్త:** రైతులకు వ్యవసాయరంగానికి మేలు కలిగించే అత్యంత పారదర్శక చారిత్రాత్మక చట్టం భూ భారతి!! 2025 అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామంలో భూభారతి సర్వే రెవిన్యూ సదస్సుల కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ప్రారంభించారు. సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో కనీసం నక్ష లేని 413 గ్రామాలలో రైతాంగం ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఇటువంటి గ్రామాలను సర్వే చేయించి రైతుల భూములకు హద్దులను నిర్ణయించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రికార్డులను తయారుచేస్నేదుకు గాను భూభారతి సర్వే ప్రాజెక్టు కింద ములుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. 1950, 1971, 1973 >>2

ఎడతెరిపిలేని వర్షాలతో ఈశాన్యంలో స్తంభించిన జనజీవనం

సిక్కిం, అసోం, మణిపూర్, అరుణాచల్, మేఘాలయలో కుంభవృష్టి

భారీగా విరిగిపడుతున్న కొండచరియలు

# నీళ్లల్లో ఊళ్లు



## నాలుగురోజుల్లో 34 మంది మృత్యువాత



అసోంలో పడవల్లో ప్రజలను తరలిస్తున్న భద్రతా సిబ్బంది

**ఇటానగర్, జూన్ 3:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కిం, అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాల్యాండ్, మేఘాలయలో కుంభవృష్టి కురుస్తోంది. ఈ కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ వర్ష బీభత్సానికి ఈశాన్య రాష్ట్రాల్లో దాదాపు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోనే పదిమంది చనిపోయారు. మణిపూర్‌లో 20వేల మంది నిరాశ్రయులు కాగా మూడువేల ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. అస్సాంలో 11 మందిచనిపోయారు. 5.35 లక్షలమందివరకూ ప్రభావితులు కాగా సిక్కింలో కూడా బీభత్సం సృష్టిస్తున్నాయి. త్రిపురలో పరిస్థితి పదివేలమంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. సుమారు ఐదు లక్షలమందికిపైగా నిరాశ్రయులయ్యారు. వీరంతా ఆప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. గత 10 రోజుల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మిజోరాంలో ఐదుగురు మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు మంగళవారం తెలిపారు. చంపాయి జిల్లాలో ముగ్గురు, ఐజ్వాల్, >>2

# బనకచర్లను అడ్డుకొంటాం

-మంత్రి ఉత్తమ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్3:** గోదావరి నదిపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నా మని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేం దుకు తాము ప్రయత్నాలు చేస్తున్నా మని తెలిపారు. మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సముద్రంలోకి వృథాగా పోయే జలాలనే వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ నేతలు పేర్కొనడం విస్మయం కలిగిస్తోందన్నారు.ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకువెళ్లి.. మాట్లాడా మన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయన్ని కోరామని చెప్పారు. అలాగే ఈ >>2



అసోంలో మోరిగావ్ జిల్లాలోని మాయాంగ్ గ్రామంలో మంగళవారం వరదనీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

# నీళ్లల్లో ఊళ్లు

>> సెర్చిప్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా ఇళ్లు, గోడలు కూలిపోవడం వల్ల ఈ మరణాలు సంభవించినట్లు తెలిపారు. ఇక రాష్ట్రంలోని 552 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. 152 ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పగుళ్ల కారణంగా 198 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయినట్లు చెప్పారు. మొత్తం 11 జిల్లాల్లో మయన్మార్‌తో సరిహద్దును పంచుకునే తూర్పు మిజోరాంలోని చంపాయి జిల్లాపై తీవ్ర ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. ఇక్కడ 209 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు వివరించారు. తొమ్మిది ఇళ్లు దెబ్బతినగా.. 14 కుటుంబాలను ఖాళీ చేయించినట్లు చెప్పారు. ఇక సెర్చిప్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా.. 27 ఇళ్లు దెబ్బతిన్నాయని, కొండచరియలు విరిగిపడటం, పగుళ్లు, వరదల కారణంగా 132 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి వెళ్లిపోయినట్లు అధికారులు చెప్పారు. ఐజ్వాల్ జిల్లాలో 18 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 13 ఇళ్లు కూలిపోయాయి. ఖాజ్వాల్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా, లుంగ్లే జిల్లాలో 60, దక్షిణ మిజోరాంలోని సియాహా జిల్లాలో 53 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో సైతువల్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఇక దక్షిణ జిల్లాలకు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే వందకు పైగా ట్రక్కులు సెర్చిప్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. గత మూడు రోజుల్లో ఐజ్వాల్ జిల్లాలో 253.7 మి.మీ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఖాజ్వాల్ జిల్లాలో 248.33 మి.మీ వర్షపాతం, సియాహా జిల్లాలో 241.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ తన నివేదికలో వెల్లడించింది. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఐఎండీ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# నిరంతరం అప్రమత్తం

>> సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రెండు రోజుల పాటు రాష్ట్రానికి వర్ష సూచన**

రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది. రాబోయే రెండు రోజులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమురభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

**రేపు సచివాలయంలో కేబినెట్ సమావేశం**

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈనెల 5వ తేదీన జరుగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ భేటీ కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు దీనికి సంబంధించి మంగళవారం అధికారిక ప్రకటనను విడుదల చేశారు. రాజీవ్ యువవికాసం, వానాకాలంలో పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై, బనకచర్లను అడ్డుకోవడం, విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ధాన్యం కొనుగోళ్లతో పాటు కాళేశ్వరం అవకతవకలకు సంబంధించి విజిలెన్స్ ఇచ్చిన రిపోర్టుపై ఈ భేటీలో చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. లోపాల పరిశీలన, బాధ్యుల నిర్ధారణ, తదుపరి చర్యలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముందని సమాచారం. యువత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలు అంశంపై కూడా కేబినెట్ చర్చించనుందని, ఇందులో భాగంగా యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఈ సమావేశంలో చర్చకు రానున్నట్టుగా తెలిసింది. అలాగే ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన ఉన్నతాధికారుల కమిటీ తన నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి అందజేసింది. ఈ నివేదిక గురించి సిఎం రేవంత్ రెడ్డికి మంత్రులకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు.

## 85%ఉద్యోగాలు లడక్ స్థానికులకే!

### కేంద్రం తాజా ఉత్తర్వులు

**లేహ్(లడక్), జూన్ 3:** కేంద్రపాలిత ప్రాంతమైన లఢక్‌లో నివసిస్తున్న ప్రజల భాష, సంస్కృతి, రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానికత, రిజర్వేషన్ల అంశంపై అధికారిక ప్రకటన చేసింది. అక్కడ 85 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని నిర్ణయించింది. 15 ఏళ్లకు మించి ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారు, కనీసం 7 ఏళ్లపాటు అక్కడ చదువుకొని, 10 లేదా 12వ తరగతి పరీక్షలకు హాజరై ఉంటే స్థానికులుగా గుర్తించాలని నిర్ణయించింది. అంతేకాకుండా లఢక్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో మూడులో ఒక వంతు సీట్లు మహిళలకే కేటాయించనున్నారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వ అధికారులు, అఖిల భారత సేవల అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ స్వయంప్రతిపత్తి సంస్థ అధికారులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, చట్టబద్ధమైన సంస్థల అధికారులు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థల అధికారులు, మొత్తం 10 సంవత్సరాల పాటు యుటిలో పనిచేసిన పిల్లలు కూడా నివాసానికి అర్హులు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్370ని 2019లో రద్దు చేసిన తర్వాత..ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు.

## ఒకే రోజు 141 లారీలు..

### రాష్ట్రంలోకి భారీగా ఉల్లిగడ్డ దిగుమతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్3:** రాష్ట్రంలో మునెప్పుడూ లేనివిధంగా భారీగా ఉల్లి దిగుమతి అయ్యింది. ఉల్లిగడ్డ పంట దిగుబడి సీజన్ అయిన ఏప్రిల్, మే నెలల్లో పొరుగు రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దిగుమతి కావడం సహజమే. అయితే ఈసారి జూన్ నెలలో కూడా భారీగా ఉల్లి దిగుమతులు జరుగుతున్నాయి. సోమవారం ఒక్కరోజే హైదరాబాద్‌లో ప్రధాన మార్కెట్ అయిన మలక్‌పేట గంజ్‌కు 141 లారీల ఉల్లిగడ్డ దిగుమతి జరిగినట్టు అధికారులు తెలిపారు. అయితే అందులో 105 లారీల ఉల్లిఒక్క మహారాష్ట్ర నుంచి దిగుమతి కావడం గమనార్హం. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 43 వేల ఉల్లి బస్తాలు నగరానికి చేరాయి.

## నేడు ఇందిరా పార్క్ దగ్గర తెలంగాణ జాగృతి మహాధర్నా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్ 3:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మహాధర్నా నిర్వహించనున్నారు. గోదావరి నీళ్లను ఒడిసి పట్టి నెర్రెలు బారిన తెలంగాణ నేలను సస్యశ్యామలం చేసిన కెసిఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇవ్వడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మహాధర్నాకు పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి తలపెట్టిన మహా ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కెసిఆర్ అభిమానులు, జాగృతి శ్రేణులు తరలిరానున్నారు. కాళేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తోన్న క్షుద్ర రాజకీయాలపై ధర్నాలో వక్తలు మాట్లాడనున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 04-06-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
నవమి రా.11.56
ఉత్తరఫల్గుణి రా.3.36
వర్జ్యం ఉ.11.02-2.50
దు.ఉ.11.41-మ.12.33
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయంసాధిస్తారు. ఆర్థిక లావాదేవీలు అనుకూలంగా ఉంటుంది.

**మిథునం:** వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో ఆర్థిక లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** సన్నిహితుల నుండి వచ్చిన వార్తవల్ల కొంత ఆనందం కలుగుతుంది. వస్తువులు కొనుగోలు.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు వద్దు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.

**కన్య :** ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**తుల :** దూర ప్రయాణాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. రుణాలు తీరి ఊరటచెందుతారు. వాహన సౌఖ్యం.

**ధనుస్సు:** ఆకస్మికంగా ప్రయాణాలలో నూతన పరిచయాలు. సంతానం నుండి ధనలాభం పొందుతారు.

**మకరం:** గృహనిర్మాణ ఆలోచనలు కలసివస్తాయి. బంధువుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**కుంభం:** దీర్ఘకాలిక సమస్యలనుండి బయటపడతారు. వాహనాల విషయాలలో జాగ్రత్త అవసరం.

**మీనం :** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురై చికాకులుపెడతాయి. కోప తాపాలకు దూరంగావుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మునుగుడో.. తేలుడో!

>> సిఫారసు చేయడం గమనార్హం. అదీగాక నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ పీఈఎస్ జాయింట్ వెంచర్‌పై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు ఉపక్రమించాలని కమిషన్ కోరింది. బ్యారేజీ నిర్మాణం పూర్తి కాకముందే పని పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడం కూడా సరైంది కాదని గుర్తు చేసింది. సాగునీటి శాఖకు చెందిన 17 మంది అధికారులకు ఐపీసీలోని సెక్షన్120(బీ), 336, 409, 418, 423, 426తోపాటు పీసీ యాక్ట్1988, ఆనకట్టల భద్రత చట్టం2021, పీడీపీపీ చట్టం1984ప్రకారం క్రిమినల్ కేసులు పెట్టాలని చెప్పింది. వీరిలో పదవీ విరమణ చేసిన ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్, మాజీ ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) భూపతి రాజు నాగేంద్రరావు, రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఆర్థిక శాఖకు చెందిన డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణి భూషణ్‌శర్మ, మాజీ ఈఎన్‌సీ(సీడీవో) ఎ.నరేందర్‌రెడ్డి, మాజీ సీఈ కె.ఎస.ఎస.చంద్రశేఖర్, ప్రస్తుత ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) టి.శ్రీనివాస్ సహా 17 మంది ఉన్నారు. సి.మురళీధర్ పద వీ విరమణ చేసినప్పటికీ పదేళ్ల పాటు ఈఎన్‌సీగా పని చేయడం గమనార్హం. ప్రాణహితచేవెళ్ల రీడిజైన్ సమయం(2015 ఏప్రిల్) నుంచి 2023 అక్టోబరు 21న మేడిగడ్డ ఏడో బ్లాక్ కుంగిపోయే దాకా పనిచేసిన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని కమిషన్ కోరింది. సహేతుక కారణాల్లేకుండా ప్రాజెక్టు రీడిజైన్ ప్రతిపాదనలు ఆమోదించిన నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శులతో పాటు ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులపై చర్యలకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. డిజైన్ల ప్రకారం బ్యారేజీ పునాదుల్లో షీట్ పైల్స్ వాడాల్సి ఉండగా, సీకెంట్ పైల్స్ వినియోగించిన విషయం కమిషన్ ప్రస్తావించింది. అందులోనూ తీవ్రమైన లోపం జరిగిందని, ప్రైమరీ పైల్స్ వేసిన ఒకటి రెండు రోజుల్లో ఆర్‌సీసీ సీకెంట్ పైల్స్ వేయాల్సి ఉండగా జాప్యం చేయడంతోనే బ్యారేజీ వైఫల్యం చెందిందని తెలిపింది. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ క్షేత్ర స్థాయి ఇంజనీర్లు/క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించారని తెలిపింది. పాలనా అనుమతి ఇచ్చిన మొత్తానికి మించి 15శాతం అదనానికి అనుమతి ఇవ్వడానికి చీఫ్ ఇంజనీర్‌కు అనుమతి ఇచ్చినప్పటికీ, తను ప్రభుత్వానికి ముందుగా సమాచారం ఇచ్చి చేయాలని నిబంధన ఉందని, చీఫ్ ఇంజనీర్ సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారని పేర్కొంది. మొదట్లో సవరించిన అంచనాల్లో కొన్ని పనులు చేయలేదని, అంచనాల్లో లేని పనులు చేసి బిల్లులు పొందారని, కొన్ని మంజూరు చేసిన పరిమాణం కన్నా ఎక్కువ చేసి బిల్లులు తీసుకున్నారని, రూ.1,343 కోట్ల డీవియేషన్‌కు చీఫ్ ఇంజనీర్ ఆమోదం తెలిపారని విజిలెన్స్ కమిషన్ వెల్లడించింది. 2018 జూన్ 23న రూ.3,260 కోట్ల సవరించిన అంచనాలకు ఆమోదం రాగా, అంతకు ముందే 2018 జూన్ 14న రూ.1,343 కోట్ల డీవియేషన్‌కు ఆమోదం తెలిపారని గుర్తు చేసింది. నాణ్యత పరీక్షల విషయంలో 1,88,257 క్యూబిక్ మీటర్ల టెస్ట్ రిజిస్టర్లు లేవని, భారీగా అవకతవకలు జరిగాయని పేర్కొంది. బ్యారేజీలో నీటి నిల్వకు ముందు కాఫర్ డ్యామ్ తొలగించలేదని ప్రస్తావించింది. ఈ పనిపూర్తికాకముందే పూర్తయినట్లు 2021 మార్చి 15న ఈఈ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ క్లెయిమ్ చేసుకోవడం కుదరదని స్పష్టం చేసింది. టీసీఎస్1991 రూల్24 ప్రకారం పదవీ విరమణ చేసిన వారితో పాటు సర్వీసులో ఉన్న 33 మందిపై అభియోగాలు నమోదు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. వీరిలో మాజీ ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, ప్రస్తుత ఈఎన్‌సీ టి.శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణి భూషణ్‌శర్మతో కలిపి 33మందిపై అభియోగాలు నమోదు చేయాలని చెప్పింది. మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గజ్జెల హరిహరచారి, మాజీ చీఫ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వర్లు, మాజీ ఎస్ఈ గంగాధర్, మాజీ సీఈ అజయకుమార్, మాజీ ఈఎన్‌సీ నరేందర్‌రెడ్డిలు ఉన్నారు. వీరిపై అభియోగాల నమోదు తర్వాత మారిన పెన్షన్ నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని చెప్పింది. అప్పటి ఆర్థిక, నీటిపారుదల శాఖల అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మేడిగడ్డ సహా కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించి తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్‌డిఎస్ఏ నిపుణుల కమిటీ సహా విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికలు, వాటి ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలపై జూన్ 5న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతోంది. బ్యారేజీల్లోని లోపాలు, చేయాల్సిన పరీక్షలు, తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి తుది నివేదిక ఇచ్చింది. అందులో పలు అంశాలను పేర్కొన్నారు. మూడు బ్యారేజీలకు వివిధ పరీక్షలు చేయాలని సూచించారు. ఆ పరీక్షలు చేసి లోపాలు, కారణాలపై ఒక అవగాహనకు వచ్చిన తర్వాత, అందుకు అనుగుణంగా మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. ఎన్‌డిఎస్ఏ నివేదికపై కార్యాచరణ కోసం సంబంధిత ఇంజినీర్ల నుంచి అభిప్రాయాలు కూడా కోరారు. ఆనకట్టల నిర్మాణ సంస్థల నుంచి కూడా పరీక్షలు, వాటికి సంబంధించి వివరాలు కోరింది. ఎన్‌డిఎస్ఏ నివేదికపై అభిప్రాయాలు తెలుపుతూ నీటి పారుదల శాఖకు లేఖలు రాసిన ఎల్ అండ్ టీ, ఆఫ్కాన్స్ సంస్థలు తమ అభ్యంతరాలను తెలిపాయి. నివేదికలోని కొన్ని అంశాలకు పొంతన లేదని, నాణ్యతకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు అందించినట్లు పేర్కొన్నాయి. వాటిని పరిగణలోకి తీసుకోవాలని నీటి పారుదల శాఖను కోరడంతో పాటు ఎన్‌డిఎస్ఏ నివేదికను అప్‌డేట్ చేయాలని కోరాయి. బ్యారేజీలకు ఎన్‌డిఎస్ఏ సూచించిన పరీక్షలు, వాటికి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ ఏబీ పాండ్యన్ నేతృత్వంలో ఒక కమిటీని వేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది.

సంబంధిత ఉత్తర్వులు ఇంకా వెలువడలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై ఆదివారం సిఎం, మంత్రుల సమక్షంలో విస్తృత చర్చ జరిగింది. తదుపరి ఎలా ముందుకెళ్లాలన్న విషయమై గురువారం జరగనున్న కేబినెట్ భేటీలో చర్చకు రానుంది. ఇందుకోసం సంపూర్ణ నివేదిక సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖను ఆదేశించారు. ఇందుకు సంబంధించి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత ఇంజనీర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అన్ని అంశాల ఆధారంగా మంత్రివర్గ సమావేశం కోసం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేస్తున్నారు. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ తుది విచారణలో భాగంగా ఈనెల 4న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ దఫా విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి.




న్యూఢిల్లీలో మంగళవారం డిఆర్ఐ నూతన కార్యాలయ భవనం ప్రారంభోత్సవం అనంతరం అధికారులకు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

# ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా

>> కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనే చేసిన, తెలంగాణ టెనెన్సీ ఆక్ట్, ఆర్ ఓ ఆర్ భూ సంస్కరణల చట్టాలతో నిరుపేదలకు రైతంగానికి మేలు జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేటి పాలకులు తీసుకువచ్చిన ధరణి చట్టంతో అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని భూపరిమితికి మించి అనర్హులకు పట్టాలను మంజూరు చేసి తిరిగి సవరించేందుకు వీలు లేకుండా చట్టాన్ని చేశారని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ధరణి చట్టాన్ని రద్దుచేసి కొత్త చట్టాన్ని తీసుకు వస్తామన్న ఆలోచనలకు పూర్తి పారదర్శకమైన రీతిలో చరిత్రలో మణి మాణిక్యంగా నిలిచేలా భూభారతి 2025 చట్టాన్ని తీసుకువచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా క్షేత్రస్థాయిలో పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో రైతుల భూములను సర్వే చేయడం ద్వారా సరిహద్దులను నిర్ణయించి ఓ భరోసాను కల్పించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజల సంక్షేమానికి ప్రజలకు అవసరమైన చట్టాలను మాత్రమే ప్రజా ప్రభుత్వం చేస్తుందని, ఇటువంటి చట్టాలలో భూభారతి అత్యంత ప్రాధాన్యమైందని అన్నారు.

ప్రతి రెవెన్యూ సమస్యకు అధికారుల పరిధిలోనే పరిష్కారం లభించేలా ఈ చట్టం రూపకల్పన చేయబడిందన్నారు. అలాగే గతంలో ఉన్న విధంగా ప్రతి నియోజకవర్గ పరిధిలో అసైన్మెంట్ కమిటీలను తిరిగి పునరుద్ధరించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ గ్రామంలో ఉన్న భూమి కంటే అదనపు భూమికి పట్టాలు ఇవ్వడం జరిగిందని దీనివల్ల ప్రభుత్వం పై ఆర్థిక భారం పెరిగిందన్నారు. భూభారతి చట్టం అమలు వలన ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, పారదర్శకమైన నికార్సైన రికార్డులు తయారు చేయడం వలన రైతాంగానికి మేలు జరగనున్నదని తుమ్మల పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను పరిశీలించి పారదర్శకమైన భూభారతి చట్టాన్ని తయారుచేసి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని 413 గ్రామాలలో సరైన భూ రికార్డులు నక్షాలు లేవని వీటిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రముఖ కంపెనీలతో సర్వే చేస్తున్నామని, ఆ గ్రామాలలో ములుగుమాడు ఒకటి అని పొంగులేటి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం 25 లక్షల ఎకరాలను పేద వర్గాలకు అసైన్ చేసిందని, అటువంటి భూములను గత పాలకులు ధరణి పేరుతో లక్షల ఎకరాలను అక్రమార్కులకు కట్టపెట్టారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ సదస్సుల ద్వారా దరఖాస్తులను పరిశీలిస్తామని అర్హులైన హక్కుదారులకు హక్కులను కల్పించే దిశగా చర్యలు చేపడతామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, ఎటువంటి ఖర్చు లేకుండా క్షేత్రస్థాయిలో గ్రామాలలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు పేదల పక్షాన భూ భారతి చట్టం చుట్టంగా పనిచేస్తుందని అన్నారు.

# విజేత ఆర్సీబీ

>> పరుగుల తేడాతో ఆర్సీబీ కప్పును గెలుచుకుంది. ఆర్సీబీ కెప్టెన్‌రజత్‌పటీదార్‌జట్టు అభిమానుల్లో తన స్థానం సుస్థిరంచేసుకున్నాడు. ఇక విరాట్‌కోహ్లీ ఐపిఎల్‌లోనూ కింగే అని నిరూపించాడు. మొన్నటివరకూ తన కెరీర్‌లో వెలితిగా ఉన్న ఐపిఎల్‌ట్రోఫీని కూడా తాను టీమ్‌లో ఉండగానే తన జట్టు సొంంచేసుకుంది. 191 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కింగ్స్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 184 పరుగుల మాత్రమేచేసింది. శశాంక్‌సింగ్ 30 బంతుల్లో 61 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. రెండుఫోర్లు, మూడు సిక్సర్లుకూడా చేసి బ్యాట్‌ఝుళిపించాడు. జాష్ ఇంగ్లీష్ 23 బంతుల్లో ఒకఫోర్, నాలుగు సిక్స్‌లతో 39 పరుగులుచేసాడు. ఇక ఇతరత్రా మిగిలినప్లేయర్లందరూ కూడా నిరాశపరిచారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్‌పాండ్యా రెండు, భువనేశ్వర్‌కుమార్ రెండు వికెట్లు సాధించారు. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఆర్సీబీ తొమ్మిది వికెట్ల నష్టానికి 190 పరుగులుచేసి ప్రత్యర్థి పంజాబ్‌కింగ్స్‌కు 191 లక్ష్యం విధించింది. ఫిల్‌సాల్ట్ 16, విరాట్‌కోహ్లీ 35 బంతుల్లో 43 పరుగులుచేసారు. మయాంక్ అగర్వాల్ 18 బంతుల్లో 24 పరుగులుచేస్తే రజత్‌పటీదార్ 16 బంతుల్లో 26 పరుగులుచేసాడు. లియామ్ లివింగ్‌స్టోన్ 15 బంతుల్లో 25 పరుగులు, జితేశ్‌శర్మ 10 బంతుల్లో 24పరుగులు, రొమారియో షెపర్డ్ 9 బంతుల్లో 17 పరుగులుచేసి తలా ఒక చేయి వేసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. ఒకదశలో ఆర్సీబీకి నిరాశతప్పదేమోననిపించింది. కానీ టైటిల్‌ను ఒడిసి పట్టుకుంది. సమిష్టిప్రదర్శనతో తొలి ఐపిఎల్ టైటిల్ ముద్దాడింది. 2009, 2011, 2016ల్లో తుదిపోరుకు అర్హత సాధించినా డక్కన్ ఛార్జర్స్, చెన్నై సూపర్‌కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌జట్లచేతిలో ఓటమి చవిచూసి రన్నరప్‌గా నిలిచింది. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఫైనల్‌కు చేరిన ఆర్సీబీ ఎట్టకేలకు అనుకున్నది సాధించింది. అటు 11 ఏళ్ల తర్వాత ఐపిఎల్‌ఫైనల్‌కు చేరిన పంజాబ్‌కింగ్స్‌కు నిరాశ తప్పలేదు. టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనచేసిన ఆజట్టు ఫైనల్‌లో మాత్రం ఓటమిని అంగీకరించింది.

# బనకచర్లను అడ్డుకొంటాం

>> ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఆ క్రమంలో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జల్‌శక్తి మంత్రికి లేఖలు రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో అవన్నీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి నదికి వరద పోటెత్తే క్రమంలో నీరు సముద్రం పాలవుతుంది. ఈ నేపథ్యంలో ఆ నీటిని ప్రజా ప్రయోజనాల కోసం మళ్లించాలని ఏపీలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా ఆ వరద నీటిని రాయలసీమతోపాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మళ్లించాలని భావించింది. తద్వారా తాగు, సాగు నీటి అవసరాలు తీర్చవచ్చని చెప్పింది. ఆ క్రమంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై కేంద్రంతో ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు. అలాగే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను సైతం కేంద్రానికి లేఖ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో జూన్ 2వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో ఏపీ జలవనరులు శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీ ప్రభుత్వ నీటి సలహాదారు వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గురించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు సోదాహరణగా వివరించారు. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు ఏమైనా నష్టం జరిగే అవకాశముందా అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు.. ఏపీ అధికారులను ప్రశ్నించగా.. వాటికి సైతం రాష్ట్ర అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం రూ. 81 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన సంగతి తెలిసిందే.

## నాలుగువేలు దాటిన కరోనా కేసులు

### మరో ఐదుగురు మృతి

**న్యూఢిల్లీ, జూన్ 3:** దేశంలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టిస్తోంది. యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో పాటు మరణాలు కూడా నమోదవుతున్నాయి. మంగళవారం నాటికి దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్19 కేసుల సంఖ్య 4 వేల మార్కును దాటింది. గడిచిన 24 గంటల్లో ఐదుగురు ఈ మహమ్మారికి బలయ్యారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశంలో మొత్తం 4,026 యాక్టివ్ కొవిడ్ కేసులు ఉన్నాయి. దేశంలో నమోదవుతున్న కేసుల్లో కేరళ అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంగళవారం ఒక్కరోజే కేరళలో 171 కొత్త కేసులు వెలుగుచూడగా, రాష్ట్రంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,416కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ కొవిడ్ కేసుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. కొత్తగా 124 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో, ఢిల్లీలో యాక్టివ్ కేసుల సంఖ్య 393కు పెరిగింది. మహారాష్ట్రలో తాజాగా 69 కొత్త కేసులు నమోదవగా, అక్కడ యాక్టివ్ కేసుల సంఖ్య 494కు చేరింది. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా 11 కేసులు నమోదు కాగా, ఆ రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 372గా ఉంది. దేశంలో, ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాల్లో కొవిడ్ కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్ సబ్ వేరియంట్లే కారణమని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ ధృవీకరించారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఈ సబ్ వేరియంట్లు తీవ్రమైనవిగా వర్గీకరించబడలేదని ఆయన స్పష్టం చేశారు. మేం ప్రస్తుతపరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాము. ప్రజలు తాజా పరిస్థితిని గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలి కానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజీవ్ బెహల్ తెలిపారు. నిపుణుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, కొవిడ్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## 'బిరుదురాజు' తెలంగాణలో జన్మించడం అదృష్టం

### పునాస పత్రికను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,జూన్3 ,ప్రభాతవార్త :** తెలంగాణ సాహిత్య అకాడమీ చేస్తున్న కార్యక్రమాల్లో పునాస పత్రికను ప్రచురించడం గొప్ప విషయమని అందులో తెలంగాణ ప్రముఖులైన కొందరి శతజయంతి సందర్భంగా ప్రత్యేక సంచికలు తీసుకురావడం చాలా బాగుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రత్యేక సంచిక పునాసను మంగళవారం ఆవిష్కరించారు. రామరాజు లాంటి గొప్ప పండితుడు, పరిశోధకుడు తెలంగాణలో జన్మించడం ఈ నేల చేసుకున్న అదృష్టమన్నారు. గత సంవత్సరం దాశరథి కృష్ణమా చార్య పై ఓ ప్రత్యేక సంచికను ముద్రించినట్లుగానే ఇప్పుడు బిరుదురాజు రామరాజుపైన ఈ ప్రత్యేక సంచికను ప్రచురించినందుకు అభినందించారు. ఇలాంటి సాహిత్యపరమైన అనేక కార్యక్రమాలు చేయడంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కవి యాకుబ్, దినకర్, సాహిత్య అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.



## మా పిల్లలతో భారత ప్రధాని మోడీ తాతయ్యలా మెలిగారు..

### అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి ఉషావాన్స్

**వాషింగ్టన్, జూన్ 3:** అమెరికా, భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ప్రస్తుతం గొప్ప అవకాశాల దశలో ఉన్నాయని అమెరికా సెకండ్ లేడీ ఉషా వాన్స్ పేర్కొన్నారు. వాషింగ్టన్ డీసీలో యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, అరుదుగా ఇచ్చే పబ్లిక్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ అమెరికా సంబంధాల విషయంలో ఇది గొప్ప అవకాశాల సమయం. ఒకవేళ నా భర్త జేడీ వాన్స్ ఇక్కడ ఉండి ఉంటే, ఆయన కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు అని ఉషా వాన్స్ తెలిపారు. ఇటీవల తమ కుటుంబం భారత్‌లో అధికారికంగా పర్యటించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆ పర్యటనలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. తమ భారత పర్యటన పిల్లలపై గొప్ప ప్రభావం చూపిందని, ముఖ్యంగా ముగ్గురు పిల్లలకు అది తొలి భారత యాత్ర అని ఉషా వాన్స్ గుర్తుచేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తమ పిల్లలతో ఒక తాతయ్యలా ఆప్యాయంగా మెలగడం, వారితో బలమైన అనుబంధం ఏర్పరచుకోవడం తమకు మరిచిపోలేని అనుభూతినిచ్చింద ని ఆమె వివరించారు. ఆ పర్యటన మొత్తంగా పిల్లలకు మైండ్‌బ్లోయింగ్ అనుభవంగా నిలిచిపోయిందని ఆమె చెప్పారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన ఈ పర్యటన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తొలి అధికారిక భారత పర్యటన కావడం విశేషం. హిందూ మతాన్ని ఆచరించే ఉషా వాన్స్ దక్షిణ భారతదేశం నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందినవారు కావడంతో ఈ పర్యటన వారి కుటుంబానికి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఏప్రిల్ 21 నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు వాన్స్ కుటుంబం ఢిల్లీ, జైపూర్, ఆగ్రా నగరాలను సందర్శించింది. ఉపాధ్యక్షుడు వాన్స్, ప్రధాని మోదీ మధ్య జరిగిన దౌత్యపరమైన చర్చల్లో అమెరికాభారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంకు సంబంధించిన సంప్రదింపుల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిసింది. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు కంటే ఎక్కువగా, అంటే 500 బిలియన్ డాలర్లకు పెంచాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యంలో ఈ ఒప్పందం ఒక భాగం. ఇది ఇరు దేశాలకు కీలక ఆర్థిక అవకాశంగా భావిస్తున్నారు. ఇరు దేశాల జాతీయ అవసరాలు, లక్ష్యాల కారణంగా అమెరికాభారత్ సంబంధాలు గతంలో కొన్నిసార్లు ఒడిదుడుకులకు లోనయ్యాయని ఉషా వాన్స్ అంగీకరించారు. అయితే, ప్రస్తుత తరుణం విలక్షణమైన అవకాశాలను అందిస్తోందని ఆమె నొక్కిచెప్పారు. అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులు, ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలే ఈ అవకాశాలకు పునాది అని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా, భారత ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఫిబ్రవరిలో అమెరికాలో పర్యటించినప్పుడు సాధించిన ఫలితాలకు కొనసాగింపుగా, ఉపాధ్యక్షుడు వాన్స్ ఏప్రిల్ పర్యటన సాగింది.

# 'గాంధీ'లో పేదలకు ప్రాణదానం..

### సిద్ధమవుతున్న ఆరు అవయవ మార్పిడి ఆపరేషన్ థియేటర్లు

### రూ. 35 కోట్ల వ్యయంతో ఏర్పాటు

### గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తుల మార్పిడి ఇక మరింత సులభం

### అత్యాధునిక వైద్యసౌకర్యాలతో విస్తరిస్తున్న గాంధీ ఆస్పత్రి

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూన్ 3, ప్రభాతవార్త:** ఎట్టకేలకు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో అవయవాల మార్పిడి జరుపడం కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఏర్పాట్లు పూర్తికావస్తున్నాయి. పేద రోగులకు ఉచితంగా అవయవ మార్పిడి చేసేందుకు గాంధీ ఆస్పత్రి సిద్ధమవుతోంది. మరికొన్ని రోజులలో ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటు పనులు పూర్తై రోగులకు అందుబాటులోకి రానుంది. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో నిర్మించిన ఆరు థియేటర్లు సిద్ధమవుతున్నాయి. కాలేయం, మూత్ర పిండాలు, గుండె, ఊపిరితి త్తుల వంటి అవయవ మార్పిడి కోసం రూ. లక్షల్లో అప్పులు చేసి కార్పొరేట్ ఆసు పత్రుల్లో అవయవమార్పిడిలు చేయిం చుకోవడం పేద వాడికి సాధ్యం కాదు కనుక ప్రభుత్వం ఉచితంగానే ఆవయవ మార్పిడి జరిపి పేదలకు ప్రాణదానం చేయాలని నిర్ణయించింది. అధునిక సదుపాయాలు కల్పించి రోగులకు మరింత మెరుగైన వైద్యం అందజేయడానికి ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఒకేసారి మూడు వివిధ రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు.




సికిందరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి భవనం

**రూ. 35 కోట్లతో సిద్ధమవుతున్న ఆపరేషన్ థియేటర్లు**

వైద్యరంగంలో అందుబాటులో ఉన్న అత్యాధునిక సౌకర్యాలు, సదు పాయాలతో కూడిన హైఎండ్ మాడ్యులర్ శస్త్రచికిత్సల కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో ఉపయోగకరంగా మార నుంది. రూ. 35 కోట్ల వ్యయంతో ప్రస్తుత మున్న ఆస్పత్రి ప్రధాన బిల్డింగ్‌లోని ఎనిమిదో అంతస్తులో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అవయవాల మార్పిడి కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లను సికింద రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని 2017లోనే పత్రిపాదించారు. కాని అనుకున్న సమయానికి ప్రతిపాదనలు కార్య రూపం దాల్చలేక పోయింది. 2022లో ఇందుకు సంబంధించిన ఫైల్‌లలో కదలిక వచ్చింది. గాంధీ ఆసుపత్రిలో మూత్ర పిండాల మార్పిడి విజయవంతంగా పూర్త వుతుండడంతో మరిన్ని సదుపాయాలు కల్పిస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని అప్పట్లో ప్రతిపాదించారు. ఇందుకోసం అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని భావించారు. అప్పటికే అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రిని నోడల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**కలిగే ఉపయోగాలు..**

రూ. 35 కోట్ల వ్యాయంతో ఆరు ఆపరేషన్ థియేటర్లను అందు బాటులోకి తేనున్నారు. ఈ ఆపరేషన్ థియేటర్‌ల వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఈ థియేటర్‌ల వల్ల గుండె, మూత్రపిండం, ఊపిరితిత్తులు, లివర్‌లను మార్పిడి చేయవచ్చు. ఈఎన్‌టీ విభాగంలో కాక్లియర్ ఇంప్లాంట్‌లు జరుపవచ్చు. ఇప్పుడున్న ఆసుపత్రిలోని ఆపరేషన్ కేంద్రాలను విభాగాల వారీగా ఉపయో గిస్తున్నారు. అవయవాల మార్పిడి చేసేందుకు ఆయా అవ యవాల వైద్యనిపుణులు పాల్గొంటారు. ఒకవేళ గుండెమార్పిడి జరిపిన అనం తరమే లివర్ మార్పిడి చేయాలంటే కొని విధి విధానాలు అడ్డువస్తున్నాయి. అందుకని దేనికదే వేరువేరు ఆపరేషన్ థియేటర్‌లు ఉంటే మెరుగైన సత్వర వైద్యసేవలు అందించే వెసులు బాటు ఉంటుంది. అన్ని అవయవాల వైద్య నిపుణులు అందుబాటులో ఉండి ఆపరేషన్‌లు జరుపడం తేలికవు తుంది. అందుకని ఆయా విభాగాలకు చెందిన అత్యా ధునిక వైద్య పరికరాలను కూడా ఏర్పాటు జరుపు తున్నారు. హైఎండ్ తరహాలో రూపొందుతున్న ఈ నూతన కేంద్రాలన్ని స్టీల్‌కోట్‌తో ఉండడం వల్ల వాటిల్లోకి బ్యాక్టీరియా ప్రవేశించే అవకాశం ఎంతమత్రం ఉండదు. అవయవ మార్పిడి ఆపరేషన్ థియేటర్‌లలో విధులు నిర్వహించే వైద్యులతో పాటు ఇతర సిబ్బంది కూడా అనుభవజ్ఞులై ఉంటారు. వీటి ఏర్పాటు పూర్తయితే నిమ్స్ తరహా వైద్యసేవలు అందజేసే అవకాశం ఉంటుంది.

**త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం: సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమారి**



ఇప్పటికే గాంధీ ఆస్పత్రి లో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని, రూ. 35కోట్ల వ్యయంతో మాడ్యూల్ తరహా ఆరు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నా మని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్‌కుమారి తెలిపారు. మరికొన్ని రోజుల్లో వాటి ఏర్పాటు పూర్తవుతుందన్నారు. అత్యాధునిక మాడ్యూల్ ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకివస్తే అవయవాల మార్చాల్సిన రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని అలాగే పిజి విద్యార్థులకు వైద్యవిద్యలో భాగంగా ఆపరేషన్ థియే టర్‌లో నిర్వహించే అవయవ మార్పిడి చికిత్సను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## 16న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

### మే 29, 31 రెండు విడతల్లో ప్రారంభమైన మూల్యాంకనం

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మే 22 నుంచి ప్రారంభమై మంగళవారం(జూన్ 3)తో ముగిసిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగుతోంది. జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 10తో ముగిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మూల్యాంకనం ప్రక్రియ ముగిసిన అనంతరం ఇతర పనులను పూర్తి చేసుకొని ఈ నెల 16న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అయితే మూల్యాంకన అనంతరం పనులు త్వరగా పూర్తయితే ఈ నెల 13 లేదా 14న సైతం ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మే 29 నుంచే ప్రారంభం కాగా.. రెండో విడత మూల్యాంకనం మే 31న ప్రారంభమైంది. మొదటి విడతలో మే 29 నుంచి సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనాన్ని ప్రారంభించగా.. రెండో విడతలో మే 31 నుంచి బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, హిస్టరీ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించారు.

ఇప్పటికే లాంగ్వేజెస్‌కి సంబంధించిన మూల్యాంకనం పూర్తి కాగా.. మరికొన్ని సబ్జెక్టుల మూల్యాంకనం కూడా ముగిసినట్టు తెలుస్తోంది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి జూన్ 3 వరకు కొనసాగాయి.

ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు .. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. మార్చిలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో 2,89,907 మంది ఫీజు చెల్లించినట్టు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు చేసుకున్నారు.

పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 90 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

## హారీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 3:** బిఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయనకు పార్టీలకు అతీతంగా నేతలు బర్త్‌డే విషెస్ తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హరీశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో హరీశ్‌రావుకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.


## ఎసిబి వలలో ఇన్‌చార్జి తహసీల్దార్

### రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

### ఇద్దరిపై కేసు నమోదు

### కరీంనగర్ ఎసిబి డిఎస్పీ విజయకుమార్

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** భూమి రిజిస్ట్రేషన్ విషయమై తాహసిల్దార్, ప్రైవేట్ డాక్యుమెంటరీ రైటర్ డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు లంచం ఇస్తుండగా కరీంనగర్ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న సంఘటన జగిత్యాల జిల్లా రాయికల్ తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. కరీంనగర్ ఎసిబి డిఎస్పీ విజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల రాయికల్ మండలంలోని సింగరావుపేట గ్రామ శివారులోని ఒక ఎకరం రెండున్నర గుంటల వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన గజ్జార్ల రవి గౌడ్ అనే రైతు ఇతరులకువిక్రయించాడు. అట్టి భూమిలో కొంత భూమి కెనాలు వెళ్లుతుందని రిజిస్ట్రేషన్ చేయడం చాలా కష్టంగా ఉంటుందని చెప్పి ఇంచార్జ్ తహసీల్దార్ జటంగుల గణేష్,ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ ఎండి ముజాఫర్ ద్వారా రూ.15వేల డిమాండ్ చేశారని పేర్కొన్నారు ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ ద్వారా. 10వేలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. దీంతో బాధితుడు రవి గౌడ్ మంగళవారం రిజేష్టషన్ కు వచ్చి. రూ.10వేలు మధ్యవర్తి ముజఫర్ ద్వార తీసుకుంటుండగా రెడ్ హైండెడ్గా ఇంచార్జి తహసీల్దార్ గణేషను పట్టుకున్నట్లుతెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్కు పంపుతున్నట్లు ఎసిబి డిఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే ఎసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వాట్సాప్ నెంబర్9440446106 ద్వార ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.




## గోరక్ష చట్టాలు కఠినంగా అమలుకు చర్యలు చేపట్టండి

### విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర బృందం విజ్ఞప్తి

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలసి వినతిపత్రం అందచేసిన విహెచ్‌పి నేతలు



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిపత్రం అందచేస్తున్న విహెచ్‌పి నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గోరక్ష చట్టాలు కఠినంగా అమల య్యేందుకు చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలసి వారు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గోవులకు రక్షణ కరువయిందని, గోరక్ష చట్టాలు ఉన్నప్పటికీ వాటిన సరిగా అమలు చేయటం లేదని ఆరోపించారు. గోవు పవిత్రమైన సాధు జంతువని, వ్యవసాయానికి మూలాధారమని, ఆవు సుభిక్షంగా ఉంటే గ్రామ సీమలు కళకళలాడ తాయని, పాడి పరిశ్రమ అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఆవు పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, గోమయం, గోమూత్రం ఔషధాలతో సమానమని, ఆవు అనేది కదిలి వచ్చే ఆయుర్వేద శాలగా వారు అభివర్ణించారు. గోరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమయిందని, గోరక్షణ కోసం చెక్‌పోస్టులు పెట్టినా అవి నామమాత్రంగానే ఉన్నాయని అన్నారు. వేములవాడ దేవాలయ గోశాలలో నిత్యం కోడెదూడలు మరణిస్తున్నాయని, అయినప్పటికీ దేవాదాయశాఖ మంత్రివర్యులు, ముఖ్య కార్యదర్శి, కమీషనర్ ఇతర అధికారులు ఎవరూ కూడా సరైన రీతిలో స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోరక్షణ విషయంలో విఫలమయిన పోలీసులు ఎదురు హిందువులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. గోరక్షణ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గవర్నర్ గోరక్షణ కోసం అమలయ్యే చట్టాలను పరిశీలిస్తానని, దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి, గోరక్షణ కోసం ఏవిధమైన చర్యలు తీసుకోవాలో తీసుకుంటామని హామీ ఇచ్చారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఆర్ఎస్ఎస్ నాయకులు ఆకుతోట రామారావు, వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు రామరాజు, యాదగిరిరావు, డాక్టర్ రామ్‌సింగ్, రమేష్, పగుడాకుల బాలస్వామి ఉన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు విచారణకు ఏర్పాట్లు పూర్తి

### తాజా విచారణలో రాజకీయ నేతల పాత్ర వెలుగు చూసేనా?

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును విచారించేందుకు సిటీ పోలీసు విభాగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల ఐదవ తేదీన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన విచారణకు తాను హాజరవుతున్న ట్లు అమెరికాలో వున్న ప్రభాకర్ రావు సమాచారం అందించడం తెలిసిందే. ఇందుకోసం ఆయనకు అమెరికా నుంచి భారత్ వచ్చేందుకు సుప్రీం కోర్టు తాత్కాలిక పాస్‌పోర్టును మంజూరు చేయడం విదితమే. దీనిపై అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో సమాచారం ఇచ్చిన ప్రభాకర్‌రావు సుప్రీం కోర్టు మంజూరు చేసిన తాత్కాలిక పాస్‌పోర్టుతో భారత్‌కు వస్తున్నారు. ఆయన బుధవారం లేదా గురువారం నాడు అమెరికా నుంచి నేరుగా హైదరాబాద్‌కు రానున్నట్లు తెలిసింది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు విచారణ తరువా తైనా ఇందులో రాజకీయ నేతల పాత్రపై వాస్తవాలు వెలుగు చూస్తాయా...? అనేది చూడాల్సి వుంది.

రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో ఇప్పటి వరకు ముగ్గురు పోలీసు అధికారులు మ రో మాజీ అధికారి అరెస్టవగా మీడియా అధినేత శ్రవణ్ రావును మూడుసార్లు విచారించారు. అయితే అసలు నిందితుడైన ప్రభాకర్ రావు 15 నెలలుగా అమెరికాలో వుండడంతో ఈ కేసు విచారణ ముందుకు సాగడం లేదు. దీంతో ఆయనను భారత్‌కు రప్పించేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు కొంతమేర ఫలించా యి. సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర బెయిల్ లభించడంతో ప్రభాకర్ రావు అమెరికా నుంచి భారత్‌కు వచ్చేందుకు అంగీకరించడంతో పాటు ఫోన్ ట్యాపింగ్ కే సులో పోలీసుల విచారణకు సహకరిస్తానని సమాచారం ఇచ్చారు. ఈ నెల ఐదవ తేదీన తాను విచారణకు వస్తానని ఆయన పోలీసులకు సమాచారం అందించా రు. దీంతో ప్రభాకర్ రావును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేబట్టింది. పశ్చిమ మండల డిసి పి విజయ్ కుమార్ నేతృత్వంలో బంజారాహిల్స్, జుబ్లీహిల్స్ ఎసిపిలతో పాటు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతో కూడిన బృందం ప్రభాకర్ రావును విచారించనుందని స మాచారం. మీడియా అధినేత శ్రవణ్ రావును ఇదే బృందం విచారించడంతో ప్రభాకర్ రావును కూడా ఈ బృందం తోనే విచారణ చేయించాలని ఉన్నతాధికారు లు నిర్ణయించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ప్రభాకర్ రావు శనివారం లేదా ఆదివారం నాడు హైదరాబాద్‌కు రావాల్సి వున్నా అమెరికాలోని భా రత రాయబార కార్యాలయంలో పత్రాల మంజూరు ఆలస్యం కావడం వల్ల ప్రయాణం ఆలస్యమ య్యిందని తెలిసింది. సోమవారం ఉదయం ప్రభాకర్ రావు హైదరాబాద్ వచ్చారని ప్రచారం అయినా వీటిని పోలీసులతో పాటు శంషాబాద్ విమానాశ్రయ ఇమ్మిగ్రేషన్ అధికారులు ఖండించారు. తాజా సమాచారం ప్రకారం ప్రభాకర్ రావు బుధవారం లేదా గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. అనంతరం ఆయన గురువారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కానున్నారు.

**రాజకీయ నేతల పాత్ర వెలుగుచూసేనా?**

ఇదిలా వుండగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులు, మరో మాజీ పోలీసు అధికారి ఇచ్చిన వాంగ్మూలంలో ప్రభాకర్‌రావు పేరుతో పాటు మీడియా అధినేత శ్రవణ్‌రావు పాత్ర వుంది. ఇదే సమయంలో నాటి బిఆర్ఎస్ మంత్రుల పేర్లు కూడా వున్నట్లు పోలీసులు కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్లలో వుంది. అయితే దీనిపై మీడియా అధినేత శ్రవణ్ రావును విచారించిన పోలీసులు ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నేతల పాత్రపై ఎలాంటి వివరాలు చెప్పలేదని, ఆయనను కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. పోలీసుల విచారణలో ప్రభాకర్ రావు ఏం చెబుతాడనేది కూడా ఉత్కంఠగా మారింది. ఒకవేళ సంఘ విద్రోహకులు, మావోయిస్టులు కానీ వారి ఫోన్‌లను పోలీసులు ట్యాపింగ్ చేసివుంటే దానికి బాస్‌గా పనిచేసిన ప్రభాకర్ రావు ఇబ్బందుల పాలవడం ఖాయమని వారంటున్నారు.

## ఉగ్ర లింకులున్న ముగ్గురు ఉద్యోగులు తొలగింపు

### జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు

**శ్రీనగర్, జూన్ 3:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులతో సంబంధాలున్న ప్రభుత్వ ఉద్యోగులపై యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు తేలిన ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తొలగించిన వారిలో పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ ఇష్ఫాక్ నసీర్, పాఠశాల ఉపాధ్యాయుడు అజాజ్ అహ్మద్, ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వసీం అహ్మద్ ఖాన్ ఉన్నారు. ఈ ముగ్గురూ ఉగ్రవాద సంస్థలకు సరుకులు చేరవేయడం, ఆయుధాల అక్రమ రవాణాకు పాల్పడటం, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదుల కార్యకలాపాలకు సహాకరించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉగ్రవాదుల సానుభూతిపరులను గుర్తించి, వారిని ఏరివేసే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం సుమారు 75 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు గుర్తించి వారిని విధుల నుంచి తొలగించింది. క్షేత్రస్థాయిలో ఉగ్రవాదులకు సహకరిస్తున్న వారిని గుర్తించేందుకు నిరంతర నిఘా కొనసాగుతోంది.

తెలంగాణ ప్రభుత్వం
నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా
Lr.No. E1/27/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 03.06.2025
నమోదిత కాంట్రాక్టర్ల నుండి రూ.30.00 లక్షలు యొక్క విలువతో (6) నం.ల సివిల్ పనుల కొరకు టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 04.06.2025 ఉ.11.00 గం. నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వారిచే టెండర్ 07.06.2025 ఉ.11.00 గం. వరకు స్వీకరించబడి వాటిని ఆ కార్పొరేషన్ కమిషనర్ లేదా మునిసిపల్ ఇంజనీర్ వారిచే 07.06.2025 ఉ.11.00 గం. వద్ద తెరువబడును. తదుపరి వివరాలకు https://tender.telangana.gov.in ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం వీక్షించవచ్చును. లేదా నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చును.
DIPR.No.3019-PP/CL/Advt/1/2025-26, తేది: 03.06.2025 సం/- కమిషనర్, నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్

తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము
మైసిగండి గ్రా. కడ్తాల్ మం, రంగారెడ్డి జిల్లా
బహిరంగ వేలము ప్రకటన - 2వ సారి తేది: 03-06-2025
ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా! శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవస్థానము నందు 2025-2026 సంవత్సరమునకు అనగా తేది 01-07-2025 నుండి 30-06-2026 వరకు ఈ దిగువ కనబర్చిన హక్కుకు లైసెన్సు బహిరంగ వేలము ద్వారా (2 వ సారి) ఇచ్చుటకు తేది 10-06-2025 మంగళవారము ఉ.10.30 ని.ల నుండి ఆలయ ఆవరణలో వేలము పాట నిర్వహించబడును. క్ర.సం.1, వేలము వివరములు: శాశ్వత మొక్కుబడుల రశీదు రుసుము వసూలు చేసుకొను హక్కు. డిపాజిట్: 5,00,000. లైసెన్సు హక్కు కాలపరిమితి తేది 01-07-2025 నుండి 30-06-2026 వరకు (సం॥). పైన చూపబడిన వేలము పాటలకు సంబంధించి ఇతర నియమ నిబంధనలను దేవాలయ కార్యాలయములో తెలుసుకొనగలరు. కరపత్రములో ఉన్న షరతులు వర్తించబడును. సెల్: 9989174398. ఇతర షరతులు, వివరములకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.
శ్రీమతి ఆర్. లక్ష్మీ శిరోలి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
శ్రీమతి స్నేహలత, కార్యనిర్వహణాధికారి
DIPR.No.3057-PP/CL/Advt/1/2025-26, తేది: 03.06.2025

pnb Housing Finance Limited
అనుబంధం-IV-A ఇ-వేలం-స్థిరాస్తి/లు యొక్క బహిరంగ అమ్మకపు ప్రకటన
... 110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com
... తెలంగాణ 502307

వార్త

చదువు డబ్బు లాంటిది. ఎంత సంపాదించినా అంతకంటే ఎక్కువ సంపాదించడానికి మనస్సు ఉబలాటపడాలి.

-జోసఫ్ బిల్లింగ్స్

# చేటు తెచ్చిన పొల్లు మాట!

కాలుజారితే తీసుకోవచ్చు. నోరుజారితే తీసుకోవడం చాలా కష్టం. అది ఇతరుల మనోభావాలను ఏ మేరకు గాయపరుస్తుంది. పర్యవసానాలేమిటి అన్న విషయాలను ఆలోచించకుండా ఏదేదో మాట్లాడేస్తే ఎలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో నిన్నమొన్నటి కమల్‌హాసన్ వ్యాఖ్యలే చెబుతున్నాయి. కన్నడిగుల మనోభావాలను తక్కువగా అంచనా వేసారని కర్ణాటక హైకోర్టు మండిపడింది కూడా. అందరూ అనుకున్నట్లుగానే హైకోర్టు ధర్మాసనం కూడా 'సినిమా విడుదల సాఫీగా సాగాలంటే కన్నడిగులకు క్షమాపణ చెబితే సరిపోతుంది కదా! అని ఒక్క ముక్కతో తేల్చేశారు. 75యేళ్ల క్రితం ఇలాంటి చర్చ చేయడానికి కమల్ చరిత్రకారులు కానీ భాషావేత్త కూడా కాదని నేరుగానే చెప్పింది. అంతస్పష్టంగా క్షమాపణ మించింది లేదని చెప్పినా కమల్ అందుకు ససేమిరా అంటున్నారు. శ్రీ రాజగోపాలచారి అంతటివారే ఇలాంటి సందర్భమే వస్తే ఇతరుల మనోభావాల గురించి అర్థం చేసుకుని క్షమాపణ చెప్పారని కమలహాసన్‌కు హితవు చెప్పారు. పార్లమెంట్‌లో తమిళవాణి వినిపించేందుకు సిద్ధమవుతున్న హీరో కమల్‌హాసన్‌కు పొరుగు భాషాభిమానులతో పెద్ద చిక్కొచ్చిపడింది. ద్రవిడ భాషలన్నీ ప్రాచీన భాషలన్న విషయం అందరికీ తెలిసింది. భాష, పుట్టుక, లిపి, దాని పరిమాణ క్రమం గురించి పెద్దపెద్ద పరిశోధనల ఉద్గ్రంథాలే అందుబాటులో ఉన్నా, శాసనాల పరిభాషలో వాటి పుట్టుపుర్వోత్తరాలు లిఖించినా, కూడా ఎప్పుడూ కొత్త కొత్త విషయాలు జోడవుతూనే ఉంటాయి. కానీ చరిత్ర గతులను మార్చలేరు. ప్రాచీన భాషల విషయమై తమది గొప్పంటే తమదని చెప్పుకునే క్రమంలో దొర్లుతున్న అతి సామాన్య విషయాలు ఒక్కొక్కప్పుడు అపార్థాలకు దారి తీస్తాయి. మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత తమిళనటుడు కమల్‌హాసన్ 'తమిళం నుంచి కన్నడం పుట్టిందనే ధోరణిలో ప్రసంగించారు. కానీ అవే వివాదాస్పదమయ్యాయి. ఆయన నటించిన 'దగ్‌లైఫ్' చిత్రాన్ని నిషేధించాలని కర్ణాటక ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ (కెఎఫ్‌సిసి) సంచలన నిర్ణయం తీసుకొంది. అదే అమలైతే కర్ణాటకలో ఆ సినిమా విడుదల ఆగిపోతుంది. సాధారణంగా అగ్రనటులు తమ సినిమాలు విడుదలైన సందర్భంలో అటు ముందు కాని, తర్వాత కానీ ఎలాంటి వివాదాలకుపోరు. ఆచితూచి మాట్లాడతారు. ఇటీవల కమల్‌హాసన్ తమిళనాడు నుంచి రాజ్యసభకు వెళ్లేక్రమంలో డిఎంకెతో కలిసి నడిచేందుకు అంగీకారం కుదిరింది. ఆ నేపథ్యంలో తాను పార్లమెంట్‌లో తమిళవాణిని వినిపించనున్నట్లు చెప్పారు. అయితే కమలహాసన్ యధాలాపంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతవారం చెన్నైలో జరిగిన 'ధగ్‌లైఫ్' ఆడియో ఫంక్షన్‌లో కమల్ చేసిన సదరు వ్యాఖ్యానాలపై కన్నడ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కమల్ క్షమాపణలు చెప్పి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. కాగా తన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదని, తప్పుంటే తానే క్షమాపణ చెప్పేవాడినని మాత్రమే వివరిస్తూ క్షమాపణకు నిరాకరించారు. కమల్ తన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పేంతవరకూ ఆయన నటించిన తాజా చిత్రానికి విడుదల మోక్షం కనిపించేటట్లు లేదు. కమల్ క్షమాపణ కోరుతున్న కర్ణాటక రక్షణవేదిక, ఇతర కన్నడసంస్థలు గట్టి పట్టుతోఉన్నాయి. తమ మనోభావాలు దెబ్బతిన్న సందర్భాలలో ఏ ప్రాంత ప్రజలైనా ఇలాగే స్పందిస్తారని గత చరిత్రలు చెబుతూనే ఉన్నాయి. కమల్ ఏ సమాచారంతో అలా మాట్లాడినా ప్రస్తుత అంశంలో సమయం,సందర్భం లేకుండా ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యల పట్ల కన్నడీగులు తీవ్రంగా స్పందించారు. నిజానికి కమల్‌హాసన్‌కు దేశమంతటా సినీ అభిమానులున్నారు. ఆయన సినిమాలు యువత ఒకటికి రెండుసార్లు వీక్షించిన సందర్భాలున్నాయి. జనంలో ఆయనకు అంత ఆదరణఉంది. కానీ తాజా వ్యాఖ్యలు వికటించాయి. తప్పితే ' తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధిస్తే ఉపసంహరించుకుంటున్నా'ను అనే చిన్నపాటి క్షమాపణ చెప్పేందుకు కూడా ఆయన ముందుకు రాలేదు. దాంతో విషయంపై గలాభా చిలికిచిలికి గాలివానలా మారింది. అదెంతవరకు వెళ్లిందంటే కమల్‌హాసన్ చెల్లని నాణెం వంటి వాడని కర్ణాటకకు చెందిన కేంద్ర మంత్రి, శోభా కరంద్లాజె విమర్శించేస్థాయికి తన సినిమాను ప్రోత్సహించుకోవడం కోసం కన్నడ భాషను అవమానించడం సరికాదన్నారు. ప్రస్తుతకాలంలో ఇలాంటివి సాధారణమైపోయాయి. మొన్నటికి మొన్న మధ్యప్రదేశ్ మంత్రిఒకరు ప్రధాని నరేంద్ర మోడీని కీర్తించే ఉత్సాహంలో సైన్యం వీరోచిత పోరాటాన్ని వివరిస్తున్న అధికారుల మీద నోరు పారేసుకుకుని సుప్రీంకోర్టు చేత చీవాట్లు తిన్న విషయమూ మనకు తెలుసు. ఆయన పక్కనే ఉన్న కన్నడ హీరో శివరాజ్‌కుమార్ కూడా ఇప్పుడు ఇరకాటంలో పడ్డారు. అంతా మన వాళ్లే కనుక కమల్‌హాసన్ పెద్ద మనసుతో వారి మనోభావాల గురించి ఆలోచించడం సర్వశ్రేయోదాయకం. కమల్‌హాసన్ తన సొంత చిత్ర 'ధగ్‌లైఫ్' విడుదల కోరుతూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఎంతో సున్నితమైన విషయాన్ని గోటితో పోయే దానికి గొడ్డలితో పరిష్కరించుకోవాలని చూడడం దుస్సాహసమే. కమల్‌హాసన్‌కు కన్నడిగుల్లో చాలా మంది అభిమానులున్నందున ఈ అంశానికి తెరదించుకోవడమన్నది 'నాయగన్' చేతుల్లోనే ఉంది. ఆ దిశగా కృషి చేయడమే మేలు. కోర్టు స్పష్టంగా జరిగినదానికి కేవలం క్షమాపణ మాత్రమే పరిష్కారమని దానివల్ల ఆ చిత్రానికి కోట్లాది రూపాయల ఆదాయంకూడా వస్తుంది కదా! అని అనునయంగా చెప్పినా కమల్‌హాసన్ మరో ప్రయత్నానికి దిగారు. నేల విడిచి సాము చేయడమంటే ఇదే.

మీ ఆలోచనలు సదాచారమార్గం నుంచి మిమ్మల్ని దూరం చేసే సంకేతాలను ఇస్తున్నాయంటే దురదృష్టం మీకై కాచుకు కూర్చుంది అని భావించండి.



తిరుక్కురళ్

ఏమైనా సాధించడానికి మీ వద్ద సమయం అంటూ ఉండదు. అందుకే సమయాన్ని కల్పించుకోవాల్సి ఉంటుంది.



చార్లెస్ బర్ట్సన్

## ప్రజావాక్కు



### నైతిక విద్యను బోధించాలి

ఈరోజుల్లో విద్యార్థులు విజ్ఞానంలో, సాంకేతికతలో అభివృద్ధి చెందుతున్నా, నైతికవిలువల విషయంలో వెనుకబడిపోతున్నారు. ఇది మన సమాజానికి ప్రమాదకరమైన పరిణామం. విద్యకేవలం ఉత్తీర్ణతలకు పరిమితం కాకుండా, మంచివ్యక్తిత్వాన్ని రూపుదిద్దే దిశగాసాగాలి. అందుకే నైతికవిద్యను ప్రతిపాఠశాలలో తప్పనిసరిగా బోధించాలి. ఈసందర్భంలో మన తెలుగు సాహిత్యంలో అమూల్యమైన సుమతీ శతకంగురించి చెప్పుకోవాలి. బద్దెన కవి రచించిన ఈ శతకం చిన్న పద్యాలలో గొప్ప జీవన సత్యాలను బోధిస్తుంది. "తన కోపమే తన శత్రువు' "అప్పిచ్చువాడు వైద్యుడు' వంటి పద్యాలు చిన్న పిల్లలకే కాదు, పెద్దలకు కూడా మార్గదర్శకాలు. ఈశతకం సహజమైనభాషలో నైతికతను బోధిస్తూ మంచి జీవన పాఠాలను అందిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సామ్మొకరిది సోకొకరిది

ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలపైదాడి చేసి వాటిని ధ్వంసం చేయటమేకాక అక్కడ తలదాచుకుంటున్న ఉగ్రవాదులను హతమార్చారు. త్రివిధ దళాలు. ఆ తరువాత జరిగిన యుద్ధంలో తమ విశ్వరూపాన్ని చూపించి పాకిస్థాన్ సైనికులకు చెమటలు పట్టించారు. ఇక చేసేదేమీలేక పాకిస్థాన్ కాల్పుల విరమణకు సిద్ధపడింది. ఈసందర్భంగా మనదేశ సైనికుల శక్తి సామర్థ్యాలను, ధైర్య సాహసాలను ప్రతిఒక్క భారతీయుడు ప్రశంసించాలి. వారికి సెల్యూట్ చేయాలి.అయితే గతంలో ఇలాంటిసందర్భాలను ప్రభుత్వాధినేతలు తమ రాజకీయ లబ్ధికోసం ఉపయోగించుకున్నారు. సైనికులు సాధించిన విజయాన్ని తమ విజయంగా చెప్పుకున్నారు.

- మిథునం, హైదరాబాద్

### మాదకద్రవ్యాలపై నియంత్రణ అవసరం

మద్యం, మాదకద్రవ్యాలు ఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదం మోపాలి. నవతరాన్ని కాపాడాలి. మద్యం, మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన శిక్షలు విధించాలి.

- ఎం.రాజేష్, నల్గొండజిల్లా

### ప్రధానులపై విమర్శలెందుకు?

కాంగ్రెస్ పార్టీ మంచి కార్యక్రమాలతో సంక్షేమ పథకాలతోప్రజలకు దగ్గర అవుతుంది. ఆ పార్టీ నాయకులు ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా బలపడి తన పూర్వ వైభవాన్ని సాధించాలని ప్రయత్నిస్తున్నారు. దీంతో దడుసుకున్న బిజెపి తన అంబుల పొదిలో ఉన్న ఇ.డి అనే అస్త్రాన్ని ప్రయోగించి ఆపార్టీని నేలకూల్చాలని చూస్తోంది.మళ్లీ లేవకుండా చేయాలనే ఉద్దేశ్యంతో కుట్రలు, కుతంత్రాలు పన్నుతోంది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టి ఆ తరువాత శత్రుదేశాలతో పోరాడి విజయం సాధించి దశాబ్దాల పాట దేశానికి సేవ చేసి చివరికి దేశ సేవ చేస్తూనే తమ ప్రాణాలను విడిచిన దివంగత ప్రధానులను విమర్శల పాలు చేస్తున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### వికలాంగుల నైపుణ్యాలు మెరుగుపరచాలి

వైకల్యం అనేది శరీరాలకి కానీ మనసుకు, నైపుణ్యాలకు, చైతన్యానికి అడ్డు కాదని వికలాంగులు వివిధ రంగాలలో నిరూపిస్తున్నారు.వికలాంగులలో ఉన్నతవిద్యావంతులు, రచయితలు, గాయకులు,ఆర్టిస్ట్, క్రీడలు,నటన,చిత్రకారులు, వివిధ సంస్కృతికరంగాలలో అద్భుతమైన ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయా రంగాలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో ఉన్న పేరు ప్రతిష్టలు పొందిన వారి చేత వికలాంగులకు ఉన్న వివిధ రకాల ఆసక్తి అభిరుచి కలిగిన రంగాలలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి. నైపుణ్య మెలకువలు నేర్పించాలి. వారి వెన్ను తట్టి ప్రోత్సహించాలి. ప్రభుత్వం ప్రోత్సహిస్తే అనేక రంగాలలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తారు.

- డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్ల కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తి పలకాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వన్యప్రాణులకు కవ్వాల్ స్వర్గధామమేనా?

**అభయారణ్యంలో వన్యప్రాణుల కదలికలను అటవీశాఖకు అందించే వెసులుబాటును కలిగించేట్రాప్ కెమెరాల పరిస్థితి అంతంత మాత్రంగానే వుండడం, వాటి నిర్వహణ తడిసి మోపెడౌతున్నా ఉన్నతాధికారులు నిధులను సమకూర్చడం లేదనే క్రిందిస్థాయి ఉద్యోగుల ఆవేదనను అర్థంచేసుకునేవారే లేకపోవడం బాధాకరం. వన్యప్రాణుల సంరక్షణకోసం ఏర్పాటు చేసిన అభయారణ్యాల నుండి ప్రజలను అనివార్యంగా ఖాళీ చేయించాల్సిందే. అయితే వారికి చట్ట నియమాలను అనుసరించి సరైన పునరావాసాన్ని కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు త్రికరణశుద్ధిగా నిర్వర్తించాల్సిందే. పరిస్థితులు డిమాండ్ చేసినప్పుడు అట వీశాఖ అధికారులకు అవసరమైన ఆయుధాలను సమకూర్చడంతో పాటు పోలీసు శాఖ సహకారంతో, యాంటీ పౌచింగ్ స్క్వాడ్ సహకారంతో అటవీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయి నుండి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరు పరిపూర్ణ సమన్వయంతో పనిచేస్తూ నిరంతర నిఘాతో వాటి రక్షణ బాధ్యతను అంగీకరించినప్పుడే పులులతో పాటు ఇతర వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమౌతుంది.**



డాక్టర్ నీలం సంపత్

తెలంగాణ రాష్ట్రంలో అధిక శాతం అటవీ విస్తీర్ణత కలిగిన అదిలాబాద్ జిల్లాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా వున్నప్పుడే 2012వ సంవత్సరంలోనే దేశంలో 42వ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌గా జన్నారం అటవీ డివిజన్లో పులుల సంరక్షణ కోసం కవ్వాల్ పులుల అభయారణ్యాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఓ వైపు జీవనది గోదావరి మరో వైపు మహారాష్ట్ర మధ్యలో 2015.45 చ.కిలో మీటర్ల విస్తీర్ణతలో ఏర్పాటైంది. కాగా దాని కోర్ జోన్ 893 చ.కిలోమీటర్ల పరిధిగా గుర్తించడమైనది. కాగా మిగతా 1122 చ.కిలోమీటర్ల అటవీ ప్రాంతం బఫర్ జోన్‌గా ప్రకటించబడి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తరించివుండడం గమనార్హం.మండు వేసవిలో గరిష్ఠంగా 47 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో,చలికాలంలో 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో సగటున 100 మిల్లీ మీటర్ల వర్ష పాతంతో మధ్య భారతంలోని ఆకురాలే స్వభావం కలిగిన అడవి 673 రకాల వృక్షజాతులు,10 రకాల ఉభయ చరాలు,34 రకాల సరీ సృపాలు,310 రకాల పక్షిజాతులు,68రకాల క్షీరదాలతో అలరారుతూ పులుల శాశ్వత ఆవాసానికి అవసరమైన వెదురతో కూడిన దట్టమైన అడవిగా గుర్తించబడినది. పులుల జీవనానికి అవసరమైన జింకలు, దుప్పులు,మెకాలు,అడవి దున్నలు, నీలుగాయిలు, సాంబారులు, అడవి పందుల లాంటి శాఖాహార జంతువుల లభ్యత పుష్కలంగా వుంటుంది. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్ టైగర్‌రిజర్వ్ ఫారెస్టుల నుండి కాగజ్ నగర్ టైగర్ కారిడార్ ద్వారా కవ్వాల్ పులుల అభయారణ్యానికి పులులను ఆకర్షించాలనేది అటవీశాఖ అధికారుల, వన్యప్రాణుల సంరక్షణ నిపుణుల లక్ష్యం. ఐతే వారి అంచనాలను కొంతమేర నిజం చేస్తూ తాడోబా, తిప్పేశ్వర్ పులుల అభయారణ్యాల నుంచి పులులు వలసబాట పట్టి కాగజ్ నగర్ టైగర్ కారిడార్‌లోకి ప్రవేశించడంతో పాటు ఆ ప్రాంతంలోనే స్థిర నివాసం ఏర్పరచుకోవడం జరిగింది. ఆ పులులలో ఒకటైన ఫాల్గుణ మరో మగపులి ద్వారా రెండు దఫాలుగా గర్భం దాల్చి ఎనిమిది పిల్లలకు జన్మనిచ్చి సూపర్ మామ్‌గా పేరు తెచ్చుకున్న వైనం గమనార్హం.ఈ సంఘటనతో పులుల సంరక్షణలో దేశ చరిత్రలో కాగజ్ నగర్ కారిడార్ గొప్పస్థానాన్ని సంపాదించుకుంది. ఈ ప్రాంత రాజకీయ నాయకులు, అధికారులు సైతం దానిని తమ విజయంగా క్లైయిమ్ చేసుకోవడం జరిగింది. ఐతే స్వల్పకాలంలోనే వారి సంతోషాన్ని ఆవిరి చేస్తూ ఆ టైగర్ కారిడార్‌లో నివసిస్తున్న ప్రజలకు, పులులకు మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఆ వైరుధ్యంలోనే గతంలో దరిగాంలో రెండు రోజుల వ్యవధిలో రెండు పులులు విష ప్రయోగం తో హత్యకు గురైనవి. తదనంతరం చెన్నూర్‌లో మరోపులి కొద్దికాలం తర్వాత ములుగులో మరోపులి ఆ తర్వాత నిన్నటికి నిన్న పెంచికల్ పేట్ రేంజ్‌లో స్థిర నివాసమేర్పరచుకుని జీవిస్తున్నమరోపులి కె 8 వేటగాళ్ల చేతిలో విద్యుద్ఘాతంతో ప్రాణాలను కోల్పోయిన వైనం దిగ్భ్రాంతిని గొలిపేదే. ఈ తరహా సంఘటనలతో కవ్వాల్ బఫర్ జోన్, కారిడార్‌లోనే ఐదు పులుల కథ కంచికి చేరడంతో పాటు మిగతావి మిస్సింగ్ పులుల కోటాలో చేరుతున్న ఫలితంగా కవ్వాల్ పులుల అభయారణ్యం నిర్వహణపై పలు సందేహాలు తలెత్తుతున్న వైనం బాధాకరం. ఈ దురదృష్ట కర పరిణామాలతో 2012 నుండి



2022 వరకు కవ్వాల్ కోర్ ఏరియాలోకి ఒక్క పులి కూడా ప్రవేశించలేదు.ఎట్ట కేలకు 2022లో కడంలోని పెద్దూర్ రేంజ్‌లో చాలా తక్కువ కాలంపాటు ఓ మైగ్రంట్ పులి బసచేసిందని అటవీశాఖా ధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత కవ్వాల్ టైగర్ సాంక్చువరీ అధికారుల ఎదురు చూపులకు తెరదీస్తూ గత సంవత్సరం కె.12 గా పిలవబడుతున్న మరోపులి కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని కోర్ జోన్‌లోకి ప్రవేశించిందని అధికారులు ధృవీకరించడం జరిగింది. వివిధ రకాలైన విలువైన ఖనిజాల తవ్వకాలకోసం చేసే బ్లాస్టింగ్, కలప స్మగ్లింగ్, పశువులను మేపడం, అడవుల కాల్చివేత, బొగ్గుల తయారీకి చెట్లనరికి వేత, జింకలు, మెకాలు, సాంబారు, కుందేళ్ల వేట, రిజర్వ్‌అడవులలో పోడు నెపంతో గిరిజనేతరుల ప్రవేశం ద్వారా మానవాళి కదలికలు, అడవిలో మంటలు లాంటి కార్యకలాపాల మూలాన పులుల ఆవాసాలకు నష్టం కలుగుతుంది. తద్వార సదరు వన్యమృగాలు నూతన ఆవాసాల వేటలో జనావాసాల వైపు చొచ్చుకువచ్చే ప్రమాదాలు పెచ్చుమీరుతున్నాయి. ఈ నేపథ్యంలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కేంద్రంగా కొనసాగుతున్న జన్నారం ఫారెస్ట్ డివిజన్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం యఫ్.డి.ఓ పర్యవేక్షణ అత్యంత కీలకమైనపాత్రను పోషించేదేననే దాంట్లో ఏ సందేహం అక్కరలేదు. ఐతే దురదృష్ట వశాత్తూ రెండేళ్లుగా జన్నారం ఫారెస్ట్ డివి జన్ ఇన్‌ఛార్జ యఫ్.డి.ఓ ల పాలనలో కునారిల్లుతోంది. ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే మెరికల్లాంటి ఐ.యఫ్. యస్ ఆఫీసర్లు అటవీశాఖలో అందుబాటులో వున్నప్పటికీ,వారిని సమర్థత, వృత్తిపరమైన సామర్థ్యాలతో సంబంధం లేని గురుకులాల నిర్వహణకో, హైదరాబాద్ అందాలకు మెరుగులు దిద్దే ఉద్యానవన శాఖలోనో నియమిస్తూ వారి సేవలను వినియోగిస్తున్నారు. మరోవైపు క్షేత్ర స్థాయిలో అటవీరక్షణ కోసం పనిచేసే యఫ్.యస్.ఓ ల,యఫ్.బి.ఓ ల కొరత మూలాన ఒక్కొక్కరు రెండు,మూడు సెక్షన్లు, బీట్లకు ఇన్ ఛార్జీలుగా పనిచేయాల్సి వస్తుండడంతో వారి పై ఒత్తిళ్లు పెరిగి తమ విధులకు న్యాయం చేయలేకపోతు న్నారు. నిన్నటికి నిన్న పెంచికల్ పేట రేంజ్‌లో విద్యు ద్ఘాతంతో పులి హత్య చేయబడిన సందర్భంగా ఆపెంచికల్ పేట్ రేంజ్ ఆఫీసర్ గత కొన్ని నెలలుగా కాగజ్‌నగర్ రేంజ్ కి సైతం ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నందున పని ఒత్తిళ్ల తో తన రేంజ్‌లో పులి కదలికలపై ఫోకస్ చేయలేక పోయాడేమోననే భావన కలుగుతోంది.అందుకేనేమో తన క్షేత్ర స్థాయి సిబ్బందికి తగు సూచనలను, ఇస్తూ దాని పగ్ మార్కులను ట్రాక్ చేస్తూ,ట్రాప్ కెమెరాల ద్వారా దాని ప్రతి కదలికను గమనిస్తూ ఆ పులి ఏ వైపుకు పయనిస్తుందో, నిజానికది రిజర్వ్ ఫారెస్ట్‌లో వుందో లేదా ఆ సరిహద్దులను దాటి రెవెన్యూ భూములలోకి ప్రవేశించిందో లేదో తెలుసుకోవడంలో కాసింత ఆలస్యమైనందున ఆ పులి సజీవంగా కాకుండా మరణించిన స్థితిలోదొరికింది. ఈదుస్థితికి కారణంప్రభుత్వం అటవీశాఖ లో సముచిత సంఖ్యలో అధికారులను నియామకం చేయకపోవడం,ఆర్థిక వనరుల కొరత దృష్ట్యా ఒక అధికారికే రెండు మూడు బాధ్యతలను అప్పగించడమేనా ? లేదా రాజకీయ ఒత్తిళ్లతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయా? అనేది మిలియన్ డాలర్లప్రశ్నగా మిగిలిపోతుంది. ఎందుకంటే గతంలో కాగజ్‌నగర్ ప్రాంతంలో ఎంతోఅంకిత భావం తో అటవీరక్షణ కోసం పనిచేసిన డి.యఫ్.ఓ లను తమ మాట వినడం లేదనే నెపంతో అధికార పార్టీకిచెందిన ప్రజాప్రతినిధులు చెప్పి మరీ బదలీ చేయించిన వైనం బహిరంగ రహస్యమే. అభయారణ్యంలో వన్యప్రాణుల కదలికలను అటవీశాఖకు అందించే వెసులుబాటును కలిగించేట్రాప్ కెమెరాల పరిస్థితి అంతంత మాత్రంగానే వుండడం, వాటి నిర్వహణ తడిసి మోపెడౌతున్నా ఉన్నతాధికారులు నిధులను సమకూర్చడం లేదనే క్రిందిస్థాయి ఉద్యోగుల ఆవేదనను అర్థంచేసుకునేవారే లేకపోవడం బాధాకరం. వన్యప్రాణుల సంరక్షణకోసం ఏర్పాటు చేసిన అభయారణ్యాల నుండి ప్రజలను అనివార్యంగా ఖాళీ చేయించాల్సిందే. అయితే వారికి చట్ట నియమాలను అనుసరించి సరైన పునరావాసాన్ని కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు త్రికరణశుద్ధిగా నిర్వర్తించాల్సిందే. పరిస్థితులు డిమాండ్ చేసినప్పుడు అటవీశాఖ అధికారులకు అవసరమైన ఆయుధాలను సమకూర్చడంతో పాటు పోలీసు శాఖ సహకారంతో, యాంటీ పౌచింగ్ స్క్వాడ్ సహకారంతో అటవీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయి నుండి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరు పరిపూర్ణ సమన్వయంతో పనిచేస్తూ నిరంతర నిఘాతో వాటి రక్షణ బాధ్యతను అంగీకరించినప్పుడే పులులతో పాటు ఇతర వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమౌతుంది. •

# ప్రజల అభివృద్ధికి, సంస్కృతికి భాషే ఆధారం


డా.యండి.మహబూబ్ పాషా

మానవుడు ఇతర జంతువులతో పోలిస్తే అత్యున్నత స్థాయికి ఎదగడానికి కారణాల్లో భాష ప్రధానమైనది. అనాగరికత నుండి మానవుడికి నాగరికతవైపు నడిపించేది భాష. భాష మానవుని అస్తిత్వ స్వరూపం. ఇది వ్యక్తికి ఆలోచనలు, భావ వ్యక్తీకరణకు, అనుభూతులు జ్ఞానాన్ని ఇతరులతో పంచుకునే అవకాశాన్ని కలిగిస్తుంది. మనజ్ఞానం తరం నుంచి తరం ప్రయాణించడానికి భాషే అత్యంత ప్రధానం. వేదాలు, ఇతిహాసాలు పవిత్ర గ్రంథాలు పాఠ్య గ్రంథాలు అన్నీ భాషకు ప్రతిరూపాలే. అధ్యయనాలు, శాస్త్ర విజ్ఞానం ఇవన్నీ భాష ఆధారితమే. అటువంటి భాష బోధనల మనుగడకు ఇప్పుడు ప్రమాదం పొంచిఉంది. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు బోధన, పుస్తకాల రచన, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, చరిత్ర ఇవన్నీ భాష ద్వారానే సాధ్యమవుతున్నాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భాషా శాస్త్రాలను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి విస్మరించే ప్రయత్నం చేస్తుంది. మాతృభూమి నుండి మానవ సంబంధాలను దూరం చేస్తున్నట్టు భాషా శాస్త్రాలను విద్యార్థులకు దూరం చేస్తున్న ప్రయత్నం జరుగుతుంది. డిగ్రీ విద్యా వ్యవస్థలో భాషా బోధనలపై తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల పై పలు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నత విద్యా మండలి డిగ్రీ విద్యావ్యవస్థలో క్రెడిట్‌ల క్రీడ మొదలుపెట్టింది. యుజిసి ఆదేశాలంటూ లాంగ్వేజ్స్ మనుగడని ప్రశ్నార్థకం చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం డిగ్రీవ్యవస్థలో భాషా శాస్త్రాల బోధనకు 20 క్రెడిట్లతో భాషా బోధనలు జరుగుతున్నాయి. అవి ఫస్ట్‌ఇయర్లో 4+4 క్రెడిట్‌లు సెకండ్ ఇయర్‌లో 3+3 క్రెడిట్‌లు థర్డ్ ఇయర్లో 3+3 క్రెడిట్‌లుగా మొత్తం 20 క్రెడిట్లో భాషాబోధన జరుగుతున్నాయి. అలాంటిది భాషా బోధనల క్రెడిట్లను కుదించే కుట్ర జరుగుతుంది. ఇదే జరిగితే తెలుగు,ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, సంస్కృతం భాషా బోధనలు చేసే అధ్యాపకుల జీవితాలు ఛిద్రమైపోతాయి. ప్రభుత్వ, ఏడెడ్, ప్రైవేటు ఇలా ప్రతి కళాశాలలో సగానికి సగం భాషా పండితులు రోడ్డున పడతారు. అంతే కాకుండా డిగ్రీ తర్వాత పీజీ చేయాలనే విద్యార్థుల ఆకాంక్షకు క్రెడిట్‌ల కోత అడ్డుకట్ట వెయ్యనుంది. దీనిని యావత్తు భాష ప్రేమికులు ముక్తకంఠంతో క్రెడిట్‌ల కోతను వ్యతిరేకిస్తున్నారు. డిగ్రీలో భాషా బోధనకు 20 క్రెడిట్ లేకుంటే విద్యార్థి భావోద్వేగం, మానవీయ విలువలు, విజ్ఞాన వికాసంకుంటుపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విజ్ఞాన రంగ పోకడలు పెరిగిపోతున్న తరుణంలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న భాషా బోధనలను క్రెడిట్‌ల పేరుతో కోత పెడితే భాషా శాస్త్రాలు అధోఃపాతాలానికి తొక్కబడతాయని, మానవుని చరిత్ర,సంస్కృతి సాంప్రదాయాల ఆయుపట్టు భాషా శాస్త్రాలు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన భాషా శాస్త్రాలను విస్మరిస్తే మానవ జీవన గమనంలో వచ్చేమార్పులు అత్యంత భయానకంగా ఉంటాయి. టెక్కు హైటెక్ విద్యాభ్యాసం చేస్తున్న ప్రస్తుత విద్యార్థికి, మానవ విలువలు జోడించి టెక్నాలజీని సహితం మానవాళి వికాసానికి వినియోగించేలా చేసే బోధనలు భాషా బోధనా శాస్త్రాలు. ఇటువంటి భాష శాస్త్రాలను విస్మరిస్తే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉంది. దేశభాషలందు తెలుగు లెస్స అని గర్వంగా చెప్పుకునే తెలుగోడి తెలుగు భాషను అభివృద్ధిపరిచి భావితరానికి అందించాలనే ఆలోచన లేనిపాలకవర్గాలు ఒక్కసారి ఆలోచించాలి. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి భాషా బోధనలను పూర్తిస్థాయిలో కొనసాగిస్తూ, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, సంస్కృతం భాషా బోధనల క్రెడిట్లను యధాతథంగా ఉంచి మానవ సంబంధాలను, డిగ్రీలో భాషా బోధనలను బలోపేతానికి కృషి చేయాలి. •

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే బాల్యానికి స్వేచ్ఛ

రామ కిష్టయ్య సంగన భట్ల

ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలతో బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్లు, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపువృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయ పెట్టీ, హింసించి, మోసగించి, బెదిరించి, వివిధ రకాలుగా శ్రమదోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మికవ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవిఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమతలేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేనిస్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధరంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలుచేయాల్సిన పనులను సైతం వీరేచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్ల వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మిక శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలనిభారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టంచేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసిపిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల




చేత పనిచేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసేచోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపుపిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికిమించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. 1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలలదినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయికూడా.బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్నిఉన్నా చాలామంది పిల్లలు బాలకార్మికులుగానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్ననిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతుమందిమన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా.దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5నుండి 15 సంవత్సరాల లోపు వయసుగల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదుకాని, మధ్యలో మాని వేసిన,అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకుకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్నిఅమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం.అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటుచేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. •

# మీరేమైనా చరిత్రకారులా? క్షమాపణ చెప్పండి




## కమల్‌హాసన్‌ను మందలించిన కర్ణాటక హైకోర్టు

### క్షమాపణ చెప్పను.. కర్ణాటకలో 'థగ్‌లైఫ్' విడుదల ఆపేస్తా: కమల్

**బెంగళూరు, జూన్ 3:** తమిళ స్టార్ కమల్ హాసన్ వివాదంలో చిక్కుకున్నారు. తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కమల్ వ్యాఖ్యలపై కర్ణాటకహైకోర్టు తీవ్రఆగ్రహం వ్యక్తం చేసింది. వాక్ స్వాతంత్ర్య హక్కును ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు ఉపయోగించొద్దంటూ హెచ్చరించింది. ఈవివాదం నేపథ్యంలో కమల్ హాసన్ తాజా చిత్రం 'థగ్‌లైఫ్' ప్రదర్శనను నిషేధిస్తున్నట్లు 'ది కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై కమల్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తన రాబోయే చిత్రం థగ్ లైఫ్‌ను రాష్ట్రంలో విడుదల చేసి ప్రదర్శించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఇవాళ విచారణ జరిపింది. విచారణ సందర్భంగా కమల్‌పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

'క్షమాపణలు చెప్పకుండా కోర్టుకు వచ్చారా..?' అంటూ తీవ్రంగా మండిపడింది. 'మీరు కమల్ హాసన్ కావొచ్చు.. ఎంత పెద్ద నటుడైనా కావొచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు మీకు లేదు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. నీరు, భూమి, భాష ఇవి ప్రజలకు ముఖ్యమైనవి. ఈ దేశ విభజన భాషా ప్రాతిపదికన జరిగింది. ఏ భాష మరొక భాష నుంచి పుట్టదు. మీ వ్యాఖ్యలతో కర్ణాటక ప్రజల మనోభావాలను దెబ్బతీశారు. మీరేమైనా చరిత్రకారులా, లేక భాషావేత్తనా, ఏ ఆధారాతో ఆ వ్యాఖ్యలు చేశారు, కన్నడ ప్రజలు మిమ్మల్ని ఏమి అడిగారు, కేవలం క్షమాపణలే కదా. ఈ వ్యవహారంలో ఒక్క క్షమాపణ చెబితే సమస్య మొత్తం పరిష్కారం అవుతుంది అని న్యాయమూర్తి నాగప్రసన్న వ్యాఖ్యానించారు

గురువారం విడుదలకానున్న కమల్ హాసన్ సినిమా థగ్ లైఫ్‌ను ఈ సందర్భంగా న్యాయస్థానం పరోక్షంగా ప్రస్తావించింది. కన్నడ భాషను ఉద్దేశించి మీరు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోండి. కర్ణాటకలోనూ కోట్లు సంపాదించుకోవచ్చు. మీకు కన్నడ ప్రజలు అక్కర్లేదని భావిస్తే ఆదాయాన్ని వదులుకోండని కమల్‌ను హైకోర్టు కోరింది. పబ్లిక్ సెంటిమెంటును ఎవరు దెబ్బతీసినా తాము ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చింది. కన్నడ ప్రజలను బాధ పెట్టేలా మాట్లాడింది మీరు, ఇప్పుడేమో క్షమాపణ చెప్పనని వాదిస్తున్నారు. కర్ణాటక ప్రజల సెంటిమెంట్‌ను మీరు తక్కువ అంచనా వేశారు. నా మాటల వల్ల ఎవరికైనా బాధ కలిగి ఉంటే క్షమించండి అనిమీరుప్రకటించండి అని కమల్‌కు న్యాయమూర్తి నిర్దేశించారు. కన్నడ ప్రజలకు కమల్ హాసన్ క్షమాపణ చెప్పకుంటే థగ్ లైఫ్ సినిమాను తమ రాష్ట్రంలో రిలీజ్ చేయనిచ్చేది లేదని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్నింగ్ ఇచ్చింది. అయితే తాను క్షమాపణ చెప్పేది లేదని ఇప్పటికే కమల్ స్పష్టం చేశారు. తాను మాట్లాడిన దాంట్లో తప్పేం లేదన్నారు. ఇది ప్రజాస్వామిక దేశమని, చట్టంపై తనకు నమ్మకం ఉందన్నారు. ఇదే విషయమై కర్ణాటక ఫిలింఛాంబర్‌కు లేఖరాసారు. తమిళ, కన్నడ ప్రజలు ఒకే కుటుంబం అన్నదే తన ఉద్దేశ్యం తప్ప కన్నడ భాషను తక్కువచేసి మాట్లాడాలన్నది నా అభిమతం కాదని అన్నారు.

**కర్ణాటకలో విడుదలచేయడంలేదు...!**

కాగా థగ్‌లైఫ్ సినిమాను కర్ణాటకలో విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. థగ్‌లైఫ్ సినిమా ఈవెంట్‌లో కన్నడభాషపై చేసిన వ్యాఖ్యల పట్లరేగిన దుమారంపై కర్ణాటక హైకోర్టుకూడా కమల్‌కు చురకలు వేసింది. ఈక్రమంలో సిని మాను నిషేధిస్తామని ప్రకటించిన కర్ణాటక ఫిలిం ఛాంబర్‌కు ధీటుగా ఈ సినిమాను ఇప్పటికిప్పుడు కర్ణాటకలో విడుదలచేయాలని భావించడంలేదని కమల్ హాసన్ స్పష్టంచేసారు.

వివాదం ఇలాగేఉంటే కర్ణాటకలో థగ్‌లైఫ్ సినిమా విడుదల చేయరని న్యాయవాది కోర్టుకు తెలిపారు. కెఎఫ్‌సిసితో సంప్రదింపులు జరిపేందుకు గాను వారం గడువు ఇవ్వాలని నిర్మాత న్యాయవాది కోరడంతో తదుపరి విచారణను న్యాయస్థానం ఈనెల 10కి వాయిదావేసింది.

---



# జి-7 సమావేశాలకు ఆహ్వానం లేదా?

## ప్రధాని హాజరుపై ఇంకా సందిగ్ధం

### కెనడాలోని అల్బెర్టాలో 15 నుంచి శిఖరాగ్ర సదస్సు

**న్యూఢిల్లీ, జూన్ 3:** కెనడా ఆతిథ్యమిస్తున్న ప్రతిష్ఠాత్మక జీ7 కూటమి శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈసారి దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇది దౌత్యపరమైన వైఫల్యమని పేర్కొంది. ఆరేళ్ల కాలంలో ప్రధాని మోడీ జీ7 సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే తొలిసారి. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితులు, రష్యా ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఇతర కీలక సవాళ్లపై సభ్యదేశాల అధినేతలు చర్చించనున్నారు. అయితే, ఈ కీలక భేటీకి హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఆహ్వానం అందలేదు.

ఒకవేళ చివరి నిమిషంలో ఆహ్వానం లభించినప్పటికీ, ప్రస్తుతం భారత్ కెనడా మధ్య నెలకొన్న ఉద్రిక్త సంబంధాల నేపథ్యంలో ప్రధాని మోడీ ఈ పర్యటనకు సుముఖత చూపకపోవచ్చనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే, గతఆరేళ్లలో ప్రధాని మోడీ జీ7 సదస్సుకు హాజరుకాని తొలి సందర్భం ఇదే అవుతుంది. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్‌మాట్లాడుతూ, జీ7 కూటమి సభ్య దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా దేశాధినేతలతో పాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు కూడా ఆహ్వానాలు అందాయనితెలిపారు. 2014కు ముందు జీ8గా ఉన్న సమయంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు క్రమం తప్పకుండా ఆహ్వానాలు అందేవని, 2014 తర్వాత కూడా ఈ సంప్రదాయం కొనసాగిందని గుర్తుచేశారు. అయితే, ఆరేళ్లలో తొలిసారి భారత ప్రధానికి ఆహ్వానం అందకపోవడం దౌత్యపరంగా ఎదురైన భంగపాటేనని ఆయన విమర్శించారు.

భారత్ పాకిస్థాన్ మధ్య వర్తిత్వానికి అమెరికాను అనుమతించడం వంటి పరిణామాల తర్వాత ఇది మరో దౌత్యపరమైన వైఫల్యంగా ఆయన అభివర్ణించారు. జీ7 కూటమిలో భారత్ సభ్యదేశం కానప్పటికీ, ఆతిథ్య దేశాల ప్రత్యేక ఆహ్వానంమేరకు భారత ప్రధానులు గతంలో పలుమార్లు ఈ శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొన్నారు. గత ఏడాది ఇటలీలో జరి గిన జీ7 సదస్సుకు భారత్‌తో పాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికాకు చెందిన పలు అభివృద్ధి చెందు తున్న దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

---

# విద్యార్థులకు ఒకటో తరగతి నుంచే బేసిక్ మిలటరీ శిక్షణ

### మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి వెల్లడి!

**ముంబయి, జూన్3:** మహారాష్ట్రలో ఇకపై 1వ తరగతి నుంచే విద్యార్థులకు బేసిక్ మిలిటరీ శిక్షణ నివ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లోదేశభక్తి, క్రమశిక్షణ, శారీరక వ్యాయామం వంటి సద్గుణాలు పెంపొందించడానికి బేసిక్ మిలిటరీ శిక్షణ ఇస్తామని మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే పేర్కొన్నారు. దీనిద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయంపై వారికి అవగాహన ఉంటుందన్నారు. దీనికోసం విద్యార్థులకు మాజీ సైనికులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మాజీ సైనికులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దేశం పట్ల ప్రేమ పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారని విద్యాశాఖ మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి క్రీడా ఉపాధ్యాయులు, నేషనల్ క్యాడెట్ కార్ప్స్, స్కౌట్స్, గైడ్స్‌తో పాటు 2.5 లక్షల మంది రిటైర్డ్ సైనికుల సహాయం తీసుకుంటామని దాదా భూసే పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ ప్రతిపాదనను తీసుకువచ్చినట్లు తెలిపారు.

---

# మేము మీ భాగస్వామిగా ఉంటాం

## చైనాకు యూనస్ వినతి



**ఢాకా, జూన్ 3:** చైనా అత్యధిక పెట్టుబడులు పడితే తమ దేశ ఆర్థిక వ్యవస్థ మలుపు తిరుగుతుందని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. చైనా-బంగ్లా వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన సదస్సును యూనస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి చైనా వాణిజ్య మంత్రి వాంగ్ వెంటావో ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తయారీరంగంలో చైనా కంపెనీలు పేరుగాంచాయన్నారు. చైనాతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. తమ దేశంలో బీజింగ్ పెట్టుబడులు పెడితే దేశ ఆర్థికవ్యవస్థ మలుపు తిరుగుతుందన్నారు. ఇక, దేశ ఆర్థిక వృద్ధిని మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా తాము ఉన్నట్లు తెలిపారు. పెట్టుబడులు మెరుగుపరచడం, చట్టాలను క్రమబద్ధీకరించడం, వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని చైనా కంపెనీలకు సూచించిన ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌కు యూనస్ కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇటీవల యూనస్ చైనాలో పర్యటించిన విషయం విదితమే. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా భేటీ అయ్యారు. బంగ్లా ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి చైనా నుంచి పెట్టుబడులను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్టులో పాల్గొనడానికి చైనా కంపెనీలను బంగ్లాదేశ్ స్వాగతించింది. డ్రాగన్ ఇస్తున్న రుణాలకు వడ్డీలను తగ్గించాలని, ఆ దేశ నిధులు అందుతున్న ప్రాజెక్టులకు కమిట్‌మెంట్ ఫీజ్‌ను మాఫీ చేయాలని, పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

---



# 24 గంటల్లో 1,430 మంది ఉక్రెయిన్ సైనికులు హాతం

## రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడి

**మాస్కో, జూన్ 3:** ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం చర్చలకు సన్నాహాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత 24 గంటల్లో ఉక్రెయిన్‌పై తమ బలగాలు చేసిన దాడుల్లో 1,430 మందికిపైగా ఆ దేశ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం చేశామన్నారు. మరోవైపు మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హాత మార్చిందని ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఆఫీస్ ప్రకటించింది. యుద్ధంలో మొత్తం 9,90,800 మంది రష్యన్ సైనికులు మరణించారని.. అందులో 1,100 మంది సైనికులు గత 24 గంటల్లో మరణించారని పేర్కొంది. తమ దాడుల్లో రష్యా 10,881 ట్యాంకులు, 22,671 సాయుధ పోరాట వాహనాలు, 50,607 ఇంధన ట్యాంకులు, 28,623 ఫిరంగి వ్యవస్థలు, 1,402 బహుళ ప్రయోగ రాకెట్ వ్యవస్థలు, 1,176 వైమానిక రక్షణ వ్యవస్థలు, 384విమానాలు, 41 యుద్ధ విమానాలు, 336 హెలికాప్టర్లు, 38,748 డ్రోన్లు, 28 నౌకలు, ఒకజలాంతర్గామిని కోల్పోయిందని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ తెలిపారు.

రష్యా, ఉక్రెయిన్ మధ్య సోమవారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లోని సిరగాన్ ప్యాలెస్‌లో తుర్కియే విదేశాంగ శాఖ మంత్రి హకన్ ఫిదాన్ అధ్యక్షతన సోమవారం రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ షరతులపై వారు చర్చించారు. అవి ఫలితమిచ్చినట్లు ఏ వర్గమూ ప్రకటించలేదు. ఈ చర్చలకు ముందు ఉక్రెయిన్ రష్యాపై అతిపెద్ద దాడి చేయడం గమనార్హం. దీనిని ప్రతిగా మాస్కో సైతం ఉక్రెయిన్‌లో 1,000 కిలోమీటర్ల దూరం వెళ్లి.. 472 డ్రోన్‌లతో విరుచుకుపడింది.

---

# హనీమూన్‌కు మేఘాలయ వెళ్లిన జంట అదృశ్యం!



### భర్త మృతదేహం లభ్యం, ఆచూకీ తెలియని భార్య..

**భోపాల్, జూన్ 3:** గత నెల 20న హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లిన ఓ జంట అదృశ్యమైన 11 రోజుల తర్వాత భర్త రాజా రఘువంశీ (29) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడి భార్యసోనమ్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మే 23న సోహ్రాలోని ఈస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో ఈ జంట అదృశ్యమైన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. నోంగ్రియాట్ గ్రామంలోని ఓ అతిథిగృహం నుంచి బయటకు వెళ్లిన కొద్ది గంటల్లోనే వీరు అదృశ్యమైనట్లు అధికారులు తెలిపారు. అయితే సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో రఘువంశీ మృతదేహాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. నోంగ్రియాట్ గ్రామం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో అతడి మృతదేహాన్ని గుర్తించి హత్య కేసుగా నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారి రాజా రఘువంశీ మృతిపై అతడి సోదరుడు సచిన్ రఘువంశీ ఇండోర్‌లో స్పందించాడు. 'నా సోదరుడి హత్య కేసు మిస్టరీని ఛేధించేందుకు సిబిఐతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నా సోదరుడిని కోల్పోయా కానీ నా మరదలు సోనమ్‌ని పోగొట్టుకొనేందుకు సిద్ధంగా లేము. ఆమె ఎక్కడ ఉందో ప్రభుత్వం గుర్తించాలి. సెర్చ్ ఆపరేషన్‌లో సైన్యం సహాయం తీసుకోవాలని నేను మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నా. నా సోదరుడి మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో గుర్తించడం కష్టమైంది. కానీ అతడి పేరును 'రాజా' అని చేతిపై టాటూ వేయించుకున్నాడు. మేఘాలయలో భారీవర్షాలు కురుస్తుండటంతో నా వాటర్ ప్రూఫ్ స్మార్ట్‌వాచ్ పెట్టుకుని వెళ్లాడు ఆ వాచి చేతికి ఉండటంతో అతడేనని గుర్తించడం సులువైంది. అని వివరించాడు. 'నా సోదరుడి హత్య, అతడి భార్యఅదృశ్యం కేసులో మేఘాలయలోని స్థానిక హోటల్, రెస్టారెంట్ సిబ్బంది, గైడ్‌లు, ద్విచక్రవాహనాలు అద్దెకు ఇచ్చే వ్యక్తులపై అనుమానం ఉంది. వారిని పోలీసులు గట్టిగా విచారించాలి ' అని కోరాడు. రాజా రఘువంశీ కుటుంబం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తోంది. మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరగగా, 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయాకు వెళ్లారు. అయితే ఈ జంట మే 22న ఓ ద్విచక్రవాహనాన్ని అద్దెకు తీసుకుని మౌలాకియాత్ అనే గ్రామానికి చేరుకున్నట్లు మేఘాలయ అధికారులు తెలిపారు. ద్విచక్రవాహానాన్ని అక్కడపార్క్‌చేసి అక్కడే ఉన్న ప్రసిద్ధి గాంచిన 'లివింగ్ రూట్ వంతెన'ను చూసేందుకు వెళ్లారనితెలిపారు. రాత్రిఅక్కడబసచేసి మర్నాడు ఉదయం బయటకు వెళ్లారని వివరించారు. ఈ జంట ప్రయాణించిన ద్విచక్రవాహనాన్ని మే 24న షిల్లాంగ్ , సోహ్రా రోడ్డులో ఓ కేఫ్ వద్ద గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం గ్రామస్థుల సహకారంతో గాలింపు చర్యలు కొనసాగించినట్లు చెప్పారు.

---

# జస్టిస్ వర్మను ప్రాసిక్యూట్‌చేయాలి

### చీఫ్‌జస్టిస్‌కు బాంబే లాయర్స్ అసోసియేషన్ లేఖ

**న్యూఢిల్లీ, జూన్ 3:** జడ్జి ఇంట్లో నోట్లకట్టల వ్యవహారంపై విచారణ ఎదుర్కొంటున్న హైకోర్టు జడ్జి యశ్వంత్‌వర్మను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ బాంబే లాయర్స్ అసోసియేషన్ చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయికి లేఖరాసింది. అప్పటి చీఫ్‌జస్టిస్ సంజీవ్ ఖన్నా ఇటీవలే రాష్ట్ర పతి ద్రౌపదిముర్ము, ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాసారు. ముగ్గురుసభ్యుల కమిటీ సిఫారసులు, జడ్జి స్పందనను కూడా తెలియజేస్తూ లేఖరాసారు. కాగా బాంబే లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్ ఎం అబ్ది, కార్యదర్శి ఏక్‌నాథ్ ఆర్ ఢోకలేలు సంతకంచేసిన లేఖను అసోసియేషన్ చీఫ్‌ఝస్టిస్‌కు పంపించింది. ఇప్పటికే సర్వోన్నత న్యాయస్థానం గతనెల 21వ తేదీ దాఖలయిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని తిరస్కరించడంతో బిఎల్ఎ లేఖరాసింది. విచారణకు ముందుగానే దాఖలుచేసిన పిల్ అని సుప్రీం కోర్టు కొట్టివేసింది. పిటిషనర్లు సరైన అధికార యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించింది. జడ్జిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌తో పాటు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని డిమాండ్‌చేసింది.

---


# నెతన్యాహు మోస్ట్ వాంటెడ్ ఢిల్లీలో వెలిసిన పోస్టర్లు

**న్యూఢిల్లీ,జూన్ 3:** గాజాపై ఇజ్రాయెల్ సైనిక చర్యలు తీవ్రమవుతున్న వేళ, దేశ రాజధాని ఢిల్లీలో ఒక అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును వాంటెడ్ అంటూ పేర్కొంటూ వెలసిన పోస్టర్లు, బెల్జియం దౌత్య కార్యాలయ ప్రాంగణంలో కనిపించడం సంచలనంగా మారింది. ఈ ఘటనకు బాధ్యుడని భావిస్తున్న ఎంబసీ సిబ్బంది ఒకరిని ఢిల్లీపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చాణక్యపురి లోని దౌత్యవేత్తల నివాస ప్రాంతంలోని బెల్జియం ఎంబసీ కాంపౌండ్‌లోని రెండు స్తంభాలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోటోతో కూడిన వాంటెడ్ పోస్టర్లు దర్శనమిచ్చాయి.

---

# 'సిందూర్'పై ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేయాలి

### ప్రధానికి 16 ప్రతిపక్షాల డిమాండ్



**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు ప్రత్యేకపార్లమెంటు సమావేశం ఏర్పాటుచేయాలని దేశంలోని 16 ప్రతిపక్ష పార్టీలు డిమాండ్‌చేసాయి. ఇండియాకూటమి పార్టీలు ఈ సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడి, సమాజ్‌వాదిపార్టీ, శివసేన(యుబిటి) పార్టీలప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఇండియా కూటమి ఎంపిలు ఇందుకు సంబంధించి ఒక లేఖపై సంతకాలుచేసి ప్రధానమంత్రికి అందించాలని నిర్ణయించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఆపరేషన్ సిందూర్, పహల్గాంవ్ దాడి జమ్ము సరిహద్దుల్లో ఇళ్లు నష్టపోయినవారికి సాయం వంటి వాటిపై చర్చించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ ప్రతినిధి జైరామ్‌రమేష్, దీపేంద్ర హుడా, టిఎంసి నేత డెరెక్ ఒబ్రెయిన్, ఎస్పీ రామ్‌గోపాల్ యాదవ్, ఆర్‌జెడి మనోజ్‌ఝా, శివసేన యుబిటి సంజయ్‌రౌత్‌లు ఈ సమా వేశంలో పాల్గొన్నారు. డిఎంకె పార్టీ ఎంపిలు కూడా సమావేశానికి వచ్చారు. కరుణానిధి శతజయంతి కార్యక్రమాలుండటంతో సంతకాలు చేసి వెళ్లిపోయారు. ఎన్సీపీ, సిపిఎం, ఐఎంఎల్, సిపిఐ, ఆర్ఎస్పీ, విడుదలై చిరుతైగల్ కట్చి, కేరళ కాంగ్రెస్, ఎండిఎంకె, సిపిఐఎంఎల్, లిబరేషన్ వంటివారు కూడా ఈ లేఖపై సంతకాలుచేసారు. ఆమ్ ఆద్మీపార్టీ మాత్రం సమావేశానికి హాజరుకాలేదు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేయాలని ప్రత్యేక లేఖరాయాలని నిర్ణయించింది. ఎన్సీపీ ఎస్పి కూడా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేయాలన్న పార్టీల కూటమిలోకి రాలేదు. ప్రతిపక్ష పార్టీలు ఎక్కువశాతం పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత ప్రత్యేక సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేయడంలేదన్న వాదనలు లేవదీస్తున్నారు.

---

# భారత్‌ను టార్గెట్ చేసేవారికి దూరంగా ఉండండి

## కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్

**ఒట్టావో, జూన్ 3:** భారత్‌ను టార్గెట్ చేస్తున్న వేర్పాటువాద శక్తులతో సంబంధాలు తెంచుకోవాలని కెనడా మాజీ ప్రధాని స్టీఫెన్ హార్పర్ ఆ దేశంలోని రాజకీయ పార్టీలకు సూచించారు. కెనడాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకునే ఏ పార్టీ అయినా భారత్‌తో సమస్యలు సృష్టించిన వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోకపోతే న్యూఢిల్లీతో.. కెనడా ఎప్పటికీ స్నేహపూర్వకమైన, బలమైన సంబంధాలను కొనసాగించలేదన్నారు. భారత్‌ను విభజించాలని చూసే అరాచక శక్తులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని రాజకీయ పార్టీలకు సూచించారు. వేర్పాటువాదులతో సంబంధాలు తెంచుకోవడానికి ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీలు ఎందుకు ఆలస్యం చేశాయో తనకు తెలియదని హార్పర్ అన్నారు. తన పదవీకాలంలో ఇటువంటి విషయాలకు దూరంగా ఉన్నామని.. ప్రస్తుత రాజకీయ పార్టీలు కూడా అదే విధానాన్ని పాటిస్తాయని తాను భావిస్తున్నానని తెలిపారు. ఎన్నో యేళ్లుగా కెనడాకు మిత్ర దేశంగా ఉన్న భారత్‌తో తిరిగి బలమైన సంబంధాలు ఏర్పచుకోవాలంటే ఇప్పటివరకు కెనడాకు, భారత్‌కు ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని, జిహాదీలు, యాంటీసెమిట్‌లు, ఖలిస్థానీలు వంటి విభజన సమూహాలను ప్రోత్సహించడం ఆపాలన్నారు. ఇది మాత్రమే ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు.

---

# ప్రీమియం ప్రభుత్వానిది.. బెనిఫిట్ అదానీకి!

## రాహుల్ తీవ్ర ఆరోపణలు



**న్యూఢిల్లీ, జూన్ 3:** ప్రభుత్వరంగంలోని ఎల్ఐసి ఆదానిగ్రూప్‌లో ఐదువేల కోట్లు పెట్టుబడులు కుమ్మరించడంపై తీవ్ర ఆరోపణలుచేసారు. ప్రీమియం ప్రభుత్వానిది, బెనిఫిట్ ఆదానికి అని వ్యాఖ్యలుచేసారు. ప్రైవేటు సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వ సంస్థల నిధులు దుర్వినియోగంచేస్తున్నారని, ప్రభుత్వసంస్థల నిధులు భారీ మొత్తంలో పెట్టుబడులు ఎందుకు పెట్టారో తెలియజెప్పాలన్నారు. మనీ, పాలసీ, ప్రీమియంలు ప్రభుత్వానివని, సెక్యూరిటీ, సర్దుబాటు, బెనిఫిట్ మొత్తం ఆదానికి చేకూరుస్తున్నారని రాహుల్ తన సోషల్ మీడియాలో పోస్టు చేసారు. ఆదాని పోర్టులు, స్పెషల్ ఎకనమిక్ జోన్‌లు భారత్‌లోని అతిపెద్దసమీకృత రవాణా సంస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 15 ఏళ్ల నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లను ఆదాని సెజ్ ఎల్ఐసినుంచి సమీకరించింది. ఈ ఎన్‌సిడి లకు సాలీనా7.75 కూపన్‌రేటును ప్రకటించింది.

ఆప్‌సెజ్ ఆర్థిక స్థిరత్వం పటిష్టంగా ఉందని, దేశీయంగా క్రెడిట్‌రేటింగ్ స్థిరంగాను, ట్రిపుల్ ఎ రేటింగ్‌తో ఉంది. కాగా వీటిని ఎల్ఐసి పూర్తిగా కొనుగోలుచేసింది. బిఎస్ఇలో ఈ డిబెంచర్లను లిస్టింగ్ చేస్తున్నట్లు ఆప్‌సెజ్ ప్రకటించింది. ప్రజలనుంచి ప్రీమియం రూపంలో వసూలు చేసిన సొమ్మును ఎల్ఐసి భారీ ఎత్తున ఆదాని గ్రూపులో పెట్టుబడులుపెట్టిందని ఆరోపించారు. ఎల్ఐసి ప్రభుత్వరంగంలోని ఆర్థిక సంస్థ కాగా భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతోంది.

# మిస్ ఇంగ్లండ్ ఆరోపణల్లో వాస్తవం లేదు



## మిస్ వరల్డ్ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చు రూ.10 కోట్లే

### మిగతా రూ. 21 కోట్లు స్పాన్సర్ల ద్వారా వచ్చాయి

### పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు సుమారు రూ. 31 కోట్లు ఖర్చు అయిందని, వీటి ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం అయ్యాయని, మిస్‌వరల్డ్ ఈవెంట్‌ను అపూర్వవిజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటకం, హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు మంచి ప్రమోషన్ వచ్చిందని, మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రపంచానికి పరిచయం చేశామని, ఆ వేడుకల నిర్వ హణ, ఆతిథ్యం పట్ల కంటెస్టెంట్లు, మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు సైతం ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అభినందించాల్సి పోయి విమర్శలు చేస్తున్నాయని మండపడ్డారు. ఈ రూ.31 కోట్లలో, స్పాన్సర్ల ద్వారానే రూ.21 కోట్లు వచ్చాయని, ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.10 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. మరో రూ.12 కోట్ల ఆదాయంపై ఒప్పందాలు ఉన్నాయని వివరిం చారు. ఈ పోటీలపై కొందరు తప్పుడు ప్రచా రం చేశారని, గొప్పగా కార్య క్రమం నిర్వహిస్తే పలుచన చేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల విమర్శలు చూసి నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు ఎక్కడ అయ్యాయో చెప్పాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుకు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌కు రావాలా? అబిడ్స్ చౌరస్తాకు రావాలా? రూ.200 కోట్లు ఖర్చు అయినట్లు నిరూపించకుంటే ముక్కు నేలకు రాయాలి.. అని మంత్రి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో టూరిజం ప్రమోషన్లకే రూ.115 కోట్లకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. ఇంత పెద్ద ఈవెంట్‌ను తక్కువ ఖర్చుతో ఘనంగా నిర్వహిం చామన్నారు. సొంత పత్రికలు, మీడియా, సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేశారని, అందగత్తెల కాళ్లు కడిగారని విష ప్రచారం చేశారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్న ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చారనేది పచ్చి అబద్ధం అని, చౌమహల్లా ప్యాలెస్ విందులో ఒక్కో ప్లేట్ భోజనానికి లక్ష రూపా యాలు ఖర్చు చేశారనేది అవాస్తమని, ఒక్కో ప్లేట్‌కు అయిన ఖర్చు రూ. 8,200 మాత్రమేనని స్పష్టం చేశారు. తన పట్ల మిస్‌బిహేవ్ చేశారని మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలను మంత్రి జూపల్లి ఖండించారు. ఆమె ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. దీనిపై కొందరు బీఆర్ఎస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అవన్నీ అభూతక కల్పనలేనని చెప్పారు. మిస్ ఇంగ్లాండ్‌ను ఇబ్బంది పెట్టారనేది వాస్తవం అయితే మిగతా 108 మంది పోటీదారులు చివరి వరకు ఉండేవారు కాదన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులకు వచ్చిన వాళ్లు చివరిదాకా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పారు. ఏమీ జరగని దానికి ఏదో జరిగినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాళ్లను ఇబ్బంది పెడితే.. మళ్లీ మళ్లీ తెలంగాణకు రావాలని ఉందని ఎందుకు చెబుతారని ప్రశ్నించారు మిస్ వరల్డ్ విన్నర్ గా గెలిచిన థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాతకు తెలంగాణ ఆతిథ్యం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలు నచ్చాయని చెప్పారు. తన జీవితంలో హైదరాబాద్‌ను మరువ.. అవకాశం వస్తే మళ్లీ ఇక్కడికి వస్తానని ఓపల్ సుచాత చెప్పారన్న విషయాన్ని మంత్రిగుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మిస్‌వరల్డ్ పోటీలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించడాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతు న్నాయన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు అనవసర విషయాలను లేవనెత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం అసత్యాలను ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు జండగే, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు




# ప్లాస్టిక్‌రహిత స్టేట్‌గా చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి

### అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత స్టేట్‌గా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. తెలంగాణలో ఎవరూ ప్లాస్టిక్ వాడొద్దని.. పర్యావరణాన్ని నష్టపరచొద్దని మంత్రి చెప్పారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పోస్టరును మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం2025 సందర్భంగా "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్‌తో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్థిరమైన పద్ధతులను అవలంభించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ చేయడం, సరైన వ్యర్థాల నిర్వహణ అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని, వ్యక్తులు పాల్గొనేలా ప్రోత్సహించి ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని ఆమె సురేఖ సూచించారు. పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో, స్థిరత్వాన్ని ప్రోత్సహించడంలో రాష్ట్రం ప్రభుత్వ నిబద్ధతను మంత్రి నొక్కి చెప్పారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో టీజీపీసీబీ మెంబర్ సెక్రటరీ గుగులోత్ రవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రగడ్డ ఆస్పత్రిలో కలుషిత ఆహారం

### ఒకరు మృతి.. పలువురికి అస్వస్థత

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూన్ 3, ప్రభాతవార్త:** ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక చికిత్సాలయంలో కలుషిత ఆహారం తీసుకోవడంతో దాదాపు 30మందికి పైగా అస్వస్తతకు గురి కాగా ఒకరు మృతి చెందారు. ఆసుపత్రిలో కలుషిత ఆహారమా లేక కలుషిత నీరు త్రాగడం వల్ల ఇలా జరిగిందా అనే అంశంలో ఆసుపత్రి అధికారులు అన్ని కోణాలలో విచారణ జరుపుతున్నారు. ఇందుకు సంబందించిన వారు తీసుకున్న నీరు మలం నమూనాలను పరిక్షల కోసం పంపారు. ఆసుపత్రిలో సోమవారం ఆహారంతో పాటు ప్రత్యేకమైన పరమాన్నం వండి వివిధ వార్డుల్లో రోగులకు ఇచ్చారు. మధ్యాహ్నం పరమాన్నంతో పాటు సాదారణ అన్నం, గుడ్లు, అరటిపల్లు రోగులకు అందించారు. అయితే సాయంత్రానికి డిసి వార్డు, కోర్టు వార్డుల్లో కొందరు రోగులకు స్వల్పంగా వాంతులు కావడం తీవ్రంగా విరోచనాలు అయ్యాయి. కొందరు బాధితులు అనేక సార్లు విరోచనాలకు వెళ్ళారు. దీనితో అప్రమత్తమైన ఆసుపత్రి వైద్యులు బాధితులందికి చికిత్స అందించారు. ఇదే ఆహారం తీసుకున్న సిసి వార్డులోని కరణ్(35) అనే బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురిఅవడంతో పాటు కొద్ది పాటి జ్వరం రావడంతో పాటు మంగళవారం ఉదయం మృతి చెందాడు. రోగి మృతి చెందడంతో ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ అనితా రాయిరాల ఇతర వైద్యాధికారులు వెంటనే హుటాహుటీన ఆసుపత్రిలోని వార్డులు వంటగదికి వెళ్ళి ఆహారాలను పరిశీలించారు. అదేవిధంగా ఆయా వార్డుల్లోని సిబ్బందితో, రోగులతో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల మలాన్ని పరిక్ష నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలోని మైక్రో బయాలజీ విభాగానికి పంపించారు. అదేవిధంగా ఆసుపత్రిలో రోగులు త్రాగే నీటి నమూనాలు కూడా పరిక్షల నిమిత్తం నారాయణ గూడలోని ఐపిఎంకు పంపించారు. మృతి చెందిన రోగి కరణ్ 2023లో భూపాలపల్లి పోలీసులు న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తరలించారు. ఎంతో కాలంగా మానసిక సమస్యలతో బాధ పడుతుండటంతో రోగిని ఆసుపత్రిలో చేర్చిన వైద్యులు చికిత్సను అందించారు. అతనికి సబందితులు ఎవరు లేకపోవడంతో పోలలీసులు కూడా ఆరోగిని తిరిగి తీసుకుపోకుండా ఆసుపత్రిలోనే ఉంచారు. ప్రస్తుతం బాధితుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# జన్‌ధన్‌లో బోగస్ ఖాతాలు

### రాష్ట్రంలో 21.25 లక్షల ఖాతాలకు ఆధార్ నో

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జన్ ధన్ పథకానికి వివిధ బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. బోగస్ ఖాతాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్రం ప్రతీ బ్యాంకు జన్ ధన్ ఖాతాకు ఖాతాదారుడి ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని మాత్రం కొన్ని బ్యాంకులు పట్టించుకోవడం లేదు.

సంక్షేమ పథకాల సొమ్మును జన్ ధన్ ఖాతాలకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానంలో కేంద్రం జమ చేస్తోంది. అయితే తెలంగాణలో 21,24,728 జన్ ధన్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో బోగస్ ఖాతాలను గుర్తించడం సాధ్యం కావడం లేదు. ఖాతాదారులకు ఇతర బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లను గుర్తించడం సైతం కష్టంగా మారుతుంది. అందుకే వెంటనే అనుసంధానం పూర్తి చేయాలని గత ఏడాది రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సైతం ఆదేశించింది.

అయినప్పటికీ ప్రధాన బ్యాంకుల్లో దాదాపు సగం మేర ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం గమనార్హం. ఈ విధంగానే ఆదిలాబాద్ జిల్లాలో 5.82 లక్షల మంది పేదలకు జన్ ధన్ ఖాతాలుంటే వీటిలో 1.33 లక్షల ఖాతాలకు, హైదరాబాద్‌లో 12.47 లక్షల జన్ ధన్ ఖాతాలకు 1.60 లక్షల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదు. దీంతో ఈ ఖాతాల్లో ఎన్ని బోగస్ ఉన్నాయనేది గుర్తించడం కష్టతరంగా మారిందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

# బియ్యం ఉత్పత్తిలో రాష్ట్రం నంబర్ వన్

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** ధాన్యం దిగుబడిలో తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించింది. 2024-25లో దేశంలోనే అత్యధికంగా బియ్యం పండిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర అర్థ, గణాంక శాఖ తెలిపింది. కేవలం బియ్యం ఒకటే కాకుండా పలు ఇతర పంటల దిగుబడులు సైతం పెరిగినట్లు వివరించింది. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్ కూడా తెలంగాణ తర్వాతే నిలిచింది. తెలంగాణ తర్వాత వరుసగా ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ ఉన్నాయి. రాష్ట్రంలో 2024-25లో 183.57 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి చేసింది. 2023-24లో అది 168.75లక్షల టన్నులు మాత్రమే. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయని తాజాగా విడుదల చేసిన అంచనాల్లో వెల్లడించింది. బియ్యం ఒక్కటే కాకుండా పలు ఇతర పంటల దిగుబడి సైతం అంతకు ముందుతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు వివరించింది. తెలంగాణలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి వరి పంట వేయడంతో దిగుబడులు వెల్లువెత్తాయి. గత ఏడాది ఖరీఫ్, యాసంగిలో కలిపి మొత్తం 275లక్షల టన్నులకు పైగా ధాన్యం ఉత్పత్తి వచ్చింది. దీని నుంచి 183 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అయినట్లు నివేదిక తెలిపింది. అలాగే గత ఏడాది మొత్తం 224లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పండినట్లు కేంద్రం ప్రకటించింది. తృణ, చిరుధాన్యాలు కలిపి తెలంగాణలో 37.19లక్షల టన్నులు, కందులు 1.99లక్షల టన్నులు, శనగ 1.10లక్షల టన్నులు, మినుములు 43,570 టన్నులు, పెసలు 24,170టన్నులు, నూనె గింజలు 5.50లక్షల టన్నులు పండినట్లు అర్థ, గణాంక శాఖ వెల్లడించింది.

# ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 80 శాతం మంది హాజరు

### 150 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మంగళవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకి 80.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్టు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఏ కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరిగాయి. మొదటి రోజైన మంగళవారం ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. పరీక్షకి 8,473 మంది హాజరు కావల్సి ఉండగా.. వారిలో 6,852 మంది హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 80.87 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు రాష్ట్రంలో 42832 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో బాలురు 26,286 మంది.. బాలికలు 16,546 మంది ఉన్నారు. పరీక్షల నిర్వ హణ కోసం రాష్ట్రంలోని 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేడు, రేపు మేధోమధనం సదస్సు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో మేధోమధనం సదస్సు నిర్వహించ నున్నట్లు నిర్వహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు రాజేంద్రనగర్ లోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాంగణంలో జరుగు తుందని, అంగన్‌వాడీలు, స్కీములు, మహిళాశిశు సంక్షేమ పథకాలు కార్యక్రమాలు, నూతన విధానాలపై రెండు రోజులపాటు విస్తృతంగా చర్చించనున్నట్లు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల్లో అమలవుతున్న బెస్ట్ ప్రాక్టీస్‌లను ప్రజెంట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల్లో అమలు చేసే కార్యాచరణ, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, దివ్యాంగుల సంక్షేమంపై ఈ సదస్సుల్లో చర్చ జరుగుతుందన్నారు. ఈ సదస్సులో జిల్లా సంక్షేమ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి, దివ్య.

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 221

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 3, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 221 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 42 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 19 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 15దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 56 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో సైనిక్ స్కూలు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చారు. ఎనిమిదేళ్లుగా బదలీలు లేకుండా పోయిన తమకు ఇతర స్థానాలకు బదలీలు చేపట్టాలని కోరుతూ ఆబ్కారీ శాఖ హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు దరఖాస్తు అందజేశారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి, దివ్య వారికి తెలియజేసారు. సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# పెద్దగోప్లారంలో దంపతులు బలవన్మరణం

**మునిపల్లి, జూన్ 3, ప్రభాతవార్త:** కుటుంబకలహాలతో భార్యభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మునిపల్లి మండలం పెద్దగోప్లారంలో జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి రమేష్ (40)కు 14 యేళ్ల క్రితం బిలాల్‌పూర్‌కు చెందిన అనిత(30)తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. మార్చి నెలలో భార్యభర్తల మధ్య గొడవ జరగటంతో అనిత పుట్టింటికి వెళ్లింది. కాగా కొద్దిరోజుల క్రితం రమేష్ గ్రామ పెద్దల సహాయంతో భార్యను స్వగ్రామానికి తీసుకువచ్చాడు. అయినప్పటికీ వారు తరుచూ గొడవ పడుతుండేవారని గ్రామస్థులు తెలిపారు. సోమవారం రాత్రి వారిద్దరి మధ్య ఏమి జరిగిందో తెలియదుగాని మంగళ వారం ఉదయం తల్లిదండ్రులు ఉరేసుకుని మృతి చెందడం చూసి వారి పిల్లలు రోదిస్తూ గ్రామస్థులకు తెలిపారు. ఘటనా స్థలాన్ని సిఐ వెంకటేష్, ఎస్సై రాజేష్‌నాయక్ సందర్శించారు. శవాలను పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. తమ తల్లిదండ్రులు మృతి చెందడంతో వారి పిల్లల రోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి. ఆడపిల్లలు అర్చన(13), రాధిక(8), కుమారుడు శ్రీనాథ్(5) తమ తల్లిదండ్రులు విగతజీవులుగా మారడంతో బిక్క చూపులు చూడటం అక్కడున్న వారి కలిచివేసింది. కాగా రముష్, అనిత మృతి చెందిన విషయం తెలుసుకున్న రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష వారి పిల్లలకు రూ.లు 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

# జాతీయ విద్యావిధానం అమలులో అగ్రగామిగా జెఎన్‌టియు




### కొత్త కోర్సులతో ఉన్నత ప్రమాణాలు

### వర్సిటీ స్నాతకోత్సవ సభలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జూన్ 3, ప్రభాతవార్త:** విశ్వవిద్యాలయం నూతన కోర్సులు, డిజిటల్ ఆధారిత అభ్యాసకేంద్రిత మోడళ్లను ప్రవేశపెట్టి విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలు ఏర్పరుస్తున్నదనీ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కొనియాడారు. కూకట్‌ల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ 13వ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ చాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు, అధ్యాప కులు, అధికా రులు, సిబ్బంది అందరినీ అభినందిస్తూ, యూని వర్సిటీ సగటు శతాబ్దం (50 ఏళ్ళు) పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత 2023-2024 విద్యా సంవత్సరానికి గాను మొత్తం 91,840 డిగ్రీలు ప్రదానం చేయబడ్డాయనీ వీటిలో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ డాక్టరేట్ ప్రోగ్రాములు ఉన్నాయన్నా రు. పతక విజేతలకు అభినందనలు తెలుపు తూ, ఈ విజయాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, కుటుంబ సభ్యుల మద్దతు అమోఘ మని పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపి) అమలులో విశ్వవిద్యా లయం అగ్రగామిగా నిలుస్తున్నదని, నూతన కోర్సులు, డిజిటల్ ఆధారిత అభ్యాసకేంద్రిత మోడళ్లను ప్రవేశపెట్టి విద్యా రంగంలో ఉన్నత ప్రమాణాలు ఏర్పరుస్తున్నదని గవర్నర్ కొనియా డారు. ఈ సందర్భంగా 498 కోట్ల రూపాయల పరిశోధన నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల నుండి పొందినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల అనుసరణలో భాగంగా 25 దేశాల నుండి 237 విదేశీ విద్యార్థులు జేఎన్టీయూహెచ్ లో చేరడం విశ్వవిద్యాలయ వైవిధ్యాన్ని గ్లోబల్ గుర్తింపును చాటుతోందని వివరించారు. జ్ఞానాన్ని సంపాదించడమే కాదు, దాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించడమే నిజమైన విద్య అని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ఈ యుగంలో విద్యార్థులు సృజనాత్మకత, నైతికత మానవీయ విలువలతో ముందుకు సాగాలని సూచించారు. స్వావలంబన భారత్ దిశగా యువత ముందుండి నడిపించాలన్నారు. చివరగా, శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలు సమాజసేవలలో విశ్వవిద్యా లయం అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షి స్తూ, అన్ని విభాగాల కృషిని అభినందించారు.

# వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు జూలై 31 తర్వాత అమలు చేయాలి

### ప్రభుత్వానికి టిపియుఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుస్) డిమాండ్ చేసింది. అలాగే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులను జులై 31 తరువాతనే అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై విద్యా శాఖ కార్యదర్శి, పాఠశాల విద్య డైరక్టర్‌ని మంగళవారం కలిసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల గ్రేడ్-2 పదోన్నతులతోపాటు, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) ఎస్జీటీల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. పదవి విరమణ ద్వారా చాలా ఖాళీలు ఏర్పడ్డాయని వాటిని కూడా వెంటనే భర్తీ చేస్తేనే.. విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. వర్క్ అడ్జస్‌మెంట్ ఉత్తర్వులు జులై 31 తరువాత అమలు చేయాలని, అప్పటివరకు పాఠశాలలో అడ్మిషన్లు కొనసాగుతాయి కాబట్టి ప్రస్తుతం ఆ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని కోరారు. సీనియర్, జూనియర్ విషయంలో నిర్ణయ అధికారం సీనియర్లకు ఇవ్వాలని, ప్రతి పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలని, సాంఘిక శాస్త్రంలో పోస్టుల కేటాయింపులో 340 మంది విద్యార్థులకు ఒక పోస్టును కేటాయించడం సరైనది కాదన్నారు. అలాగే 221 మంది కంటే ఎక్కువ విద్యార్థులుంటే రెండవ పోస్ట్ కేటాయించాలని వారు కోరారు. వివిధ కారణాల చేత పరస్పర బదిలీలలో అవకాశము లభించని వారికి మరొక మరో అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకోవాలి

### 140 బిసి గురుకుల స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత శుభపరిణామం

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించ డానికి కృషి చేయాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు. గత మార్చిలో జరిగిన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి మంగళవారం వారికి ప్రతిభా పురస్కారాలను అందించారు. బేగంపేటలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు.

విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను అధ్యాపకులను సైతం మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు పాల్గొ న్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినం దనలు, శుభాకాంక్షలు తెలిపారు. 593 మార్కులు తెచ్చుకున్న దుర్గాభవాని, 590 మార్కులు తెచ్చుకున్న శివాని, 580కి పైగా మార్కులు తెచ్చుకున్న 31 మంది, 570పైన మార్కులు తెచ్చుకున్న 216 మంది విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు రాష్ట్రానికి పేరు తెచ్చారని అన్నారు. బిసి గురుకుల పాఠశాలలు, హాస్టల్స్‌లో లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో 17 వేల మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తే వారిలో 570కి పైగా మార్కులు వచ్చిన వారు వందల్లో ఉన్నారని అన్నారు. 147 స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత శాతం ఉందని.. మిగిలిన స్కూల్‌లో ఎందుకు తక్కువ వచ్చిందని రివ్యూ చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఇంటర్మీడియట్‌లో భవిష్యత్‌లో మంచి లక్ష్యాలను నిర్ణయించుకోవాలన్నారు. రేపటి తెలంగాణ భవిష్యత్తుకి మీరు మార్గదర్శకులుగా కావాలన్నారు.

593 మార్కులు తెచ్చుకున్న దుర్గాభవాని, 590 మార్కులు తెచ్చుకున్న శివానిలకు ఇతర విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు చెప్పారు. జ్యోతి బాపులే సినిమాను అన్ని గురుకులాల్లో చూపెడ తామని.. తల్లిదండ్రులకు కూడా చూపెడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# వర్షాకాలంలో కూడా పూర్తి స్థాయిలో బొగ్గు ఉత్పత్తి

### గనుల్లో నష్టాలు తగ్గించేందుకు నిపుణుల బృందం

### సింగరేణి సిఎండి బలరామ్

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** ఈ వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి ఏమాత్రం కుంటు బడకుండా పూర్తి స్థాయిలో జరిగేలా అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ సూచించారు. గనుల్లో వర్షపు నీటిని తోడి బయటకు పోయడానికి తగినన్ని పంపులు సంసిద్ధంగా ఉంచుకోవాలని అన్ని ఏరియాల జిఎంలకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాదికి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలంటే వర్షాకాలంలో కూడా నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా సాధించాలన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు రోజుకు కనీసం 2.15 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.45 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు ఏరియాల వారీగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నాణ్యత ప్రమాణాలు బాగా పెంచాలన్నారు. నాణ్యతలేని బొగ్గును వినియోగదారులు స్వీకరించడం లేదని కాబట్టి కిందిస్థాయి నుంచి పై అధికారుల వరకు నాణ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉద్యోగులు యంత్రాలతో షిఫ్ట్ లో పూర్తి పనిగంటలు పనిచేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిరక్ష్యంగా ఉండే వారిని అవసరమైతే తొలగించాలని కూడా ఆయన ఆదేశించారు. గైర్హాజరు శాతాన్ని గణనీయంగా తగ్గించాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కూడా ఆయన సూచించారు. తగినన్ని యంత్రాలను పనిలో పెట్టి లక్ష్యాల మేర రోజు వారీగా ఓవర్ బర్డెన్ తొలగించాలని సూచిం చారు. భూగర్భగనుల్లో నష్టాలను తగ్గించడం కోసం నిపుణుల బృందంతో త్వరలో పరిశీలన జరపనున్నట్లు తెలిపారు. శాంతిఖని, అడ్రియాల లాంగ్ వాల్ గనిలో ఈ బృందం ముందుగా పరిశీలన జరుపుతుందన్నారు. ఈ సమావేశంలో డైరె క్టర్లు డి.సత్యనారాయణ రావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఇడి యస్.డి.ఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

# 'నేతన్నకు భరోసా' పథకం మార్గదర్శకాలు విడుదల

## బడ్జెట్‌లో రూ.48 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

### 40వేల మంది చేనేత కార్మికులకు లబ్ధి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 3:** నేత కార్మికుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులోభాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ చేనేత అభయహస్తంలో భాగంగా తెలంగాణ నేతన్నకు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



ఇందుకోసం బడ్జెట్ రూ.48 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా జియో ట్యాగ్ చేయబడిన మగ్గాలపై పనిచేస్తున్న కార్మికులకు, అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద గరిష్టంగా సంవత్సరానికి నేత కార్మికులకు రూ. 18,000, అనుబంధ కార్మికులకు రూ.6,000 అందిస్తామన్నారు. దీంతో దాదాపు 40వేల మంది చేనేత,అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని, చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా తయారుచేయబడిన యూనిక్ లోగోను జతచేశామని, తద్వారా చేనేత ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను నేత కార్మికుని వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చున్నారు. దీంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరిగే అవకాశాలు ఏర్పడతాయని తెలియజేశారు.18 సంవత్సరాలు నిండి జియో ట్యాగ్ చేయబడిన మరమగ్గాలపై పనిచేసే కార్మికులు, ప్రీలూమ్, ప్రిపరేటరి పనులైన డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్ మొదలైన అనుబంధ పనులు చేసే కార్మికులు, చేనేత వృత్తి ద్వారా వారి వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం పొందుతున్నవారు అర్హులు.ఈ పథకం కింద వార్పులలో కనీసం 50 శాతం కంటే ఎక్కువ పూర్తి చేసిన నేత, అనుబంధ కార్మికులకు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి వేతన ప్రోత్సాహకం కింద సంవత్సరానికి రెండు విడతలుగా (ఏప్రిల్ నుండి సెప్టెంబర్,అక్టోబర్ నుండి మార్చి) నేత కార్మికునికి రూ.9,000, అనుబంధ కార్మికునికి రూ. 3,000 జమ చేస్తారు. మొదటి విడతలో 50 శాతం వార్పులు పూర్తి చేయని వారు, రెండో విడతలో పూర్తి చేసినట్లైతే మొత్తం ప్రోత్సాహకం సంవత్సరాంతంలో చేనేత, అనుబంధ కార్మికులకు అందుతుందని మంత్రి తెలిపారు.

# రాష్ట్రానికి భారీగా పెరిగిన జిఎస్టీ ఆదాయం

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఆదాయం భారీగా పెరుగుదల నమోదైంది. గతంలో కంటే మే నెలలో జీఎస్టీ ఆదాయం ఆరు శాతం పెరిగింది. మే 31తో ముగిసిన నెలలో రూ.5,310 కోట్ల ఆదాయం వచ్చినట్లు కేంద్రం ప్రకటించింది. గత సంవత్సరం మే నెలలో రాష్ట్రానికి జీఎస్టీ ద్వారా రూ.4,986 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏప్రిల్లో 6,983 కోట్లు ఆదాయం జీఎస్టీ ద్వారా వచ్చింది. దేశవ్యాప్తంగా జీఎస్టీ ద్వారా కేంద్రానికి రూ.1,49,785 కోట్ల ఆదాయం వచ్చింది. జాతీయ స్థాయిలో జీఎస్టీ ఆదాయం 13.66 శాతం పెరుగుదల నమోదు అయింది.

# ఈ నెలాఖరుకు రైతు భరోసా

## రూ.15 వేల కోట్ల అంచనా

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** తెలంగాణలో వ్రానాకాలం సీజన్ ప్రారంభమైంది. అయితే, ఈ ఏడాది నుంచి ఒకేసారి 12 వేల రూపాయలను రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు రాష్ట్ర సర్కార్ సిద్ధమవుతోంది. ఈ సీజన్ కు సంబంధించి రైతు భరోసా నిధులను వరినాట్లు వేసే నాటికి అందచేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల చివరి వారంలో లేదా జులై మొదటి వారంలో రైతు భరోసా నిధులు విడతల వారిగా జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుండగా, ఇందుకోసం 15 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు అవసరం అవుతుందని అధికారులు అధికారులు అంచనా వేశారు.

అయితే ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే ఇంత మొత్తంలో ఒకేసారి నిధులు సమకూర్చడం రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారుతుంది. ఈ పరిస్థితుల్లో ఎకరాల ఆధారంగా విడుతల వారీగా రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యం కాని ఈ భూములు అటు ఇటుగా రెండున్నర లక్షల ఎకరాలని వ్యవసాయ శాఖ అధికారులు లెక్క తేల్చారు. దీంతో ఈ భూములు రైతు భరోసాకు అర్హత లేకుండా పోయింది.

క్షేత్రస్థాయిలో వ్యవసాయ ఎక్స్టెన్షన్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా జరిపిన సర్వేలో 2.10 లక్షల ఎకరాలు సాగు యోగ్యం కానివిగా గుర్తించగా, గతంలో నిర్వహించిన గ్రామ సభల్లో వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదుల అనంతరం వాటి విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాలకు పెరిగింది. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి, భువనగిరి, మల్కాజిగిరి జిల్లాల్లో రియల్ వెంచర్లుగా, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భూములపై ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా పలు జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో తొలుత వ్యవసాయ యోగ్యం కాని భూములుగా గుర్తించిన వాటిని తర్వాత సాగుకు పనికొచ్చేవిగా మార్చారు.

# గుల్జార్‌హౌస్‌లో చిన్నారుల మరణంపై మిస్ వరల్డ్ ఆవేదన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 3:** గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదంపై మిస్ వరల్డ్ విజేత-2025 ఓపల్ సుచాత భావోద్వేగ పోస్ట్ చేశారు. ప్రమాదంలో పిల్లలతో సహా కుటుంబమంతా మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన చార్మినార్ పర్యటన సందర్భంగా వారితో దిగిన ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. వారు తనపై చూపిన ప్రేమ అద్భుతమని,తన విజయాన్ని చూడకముందే వారంతా కన్నుమూశారని ఎమోషనల్ అయ్యారు.

# ఐజిఎస్‌టి స్కామ్‌కు యేడాది.. ఓవైపు సిఐడి, మరోవైపు ఇడి విచారణ

## ముందుకు సాగని దర్యాప్తు

### సోమేష్‌కుమార్ సహా కీలక నిందితుల విచారణ ఎప్పుడో?

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఐజిఎస్‌టి స్కాంకు ఏడాది పూర్తి కావస్తున్నా విచారణ ముందుకు సాగడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కేసును ఓవైపు సిఐడి మరోవైపు ఈడీ విచారిస్తున్నా ఇప్పటి వరకు దర్యాప్తు ఎంతవరకు వచ్చిందనేది తెలియరావడం లేదు. గత ఏడాది జూ న్‌లో వెలుగు చూసిన ఈ స్కాంపై అదే ఏడాది జులై 26వ తేదీన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరాంప్రసాద్, సంగారెడ్డి జిల్లా కందిలో గల హైదరాబాద్ ఐఐటిలో అసి స్టంట్ ప్రొఫెసర్‌గా వున్న శోభన్ బాబు సహా మరికొందరిపై ఐపిసి 406, 409, 120 (బి), ఐటి చట్టం కింద కేసు నమోదు చేయ డం తెలిసిందే. వాణిజ్యపన్నుల శాఖలో వెలుగు చూసిన 1400 కోట్ల రూపాయల భారీ కుంభకోణం రాజకీయంగానూ ప్రకంపనలు రేపడంతో దీనిపై లోతుగా విచారించడంతో పాటు దోషులను గుర్తించి, శిక్షించేందుకుగానూ ఈ కేసును రెండు రోజుల వ్యవధిలోనే సిఐడికి బదలాయించడం విదితమే. ఐజీఎస్‌టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపుల లావాదేవీల్లో ఈ గోల్‌మాల్ జరిగిందని మొదట ఆరోపణలు రాగా ఇది నిజమని తేలి చివరకు 1400 కోట్ల రూపాయలకు పైగా గోల్ మాల్‌కు దారితీంది. ఐజిఎస్‌టి స్కాంకు సంబంధించి సిఐడి విచారణ మొదట్లో వేగంగానే సాగినా ఆ తరువాత ఎందుకో నెమ్మదించిందనే అభియోగాలు వస్తు న్నాయి. వాణిజ్య పన్నుల శాఖలో ఇదివరకు కమిషనర్‌గా పనిచేసిన శ్రీదేవితో పాటు మరికొందరు అధికారుల నుంచి వివ రాలు సేకరించారు. దీంతో పాటు దీనిపై ఫిర్యాదు చేసిన మరో ఉన్నతాధికారి రవి నుంచి కూడా వివరాలు సేకరించారు. ఈ వివరాల ఆధారంగా వాణిజ్య పన్నుల శాఖలో నిధుల గోల్‌మాల్ ఎ లా జరిగింది...? దీనికి గల కారణాలు ఏమిటీ...? అనే అంశాలపై సిఐడి అధికారులు అప్పట్లో అనేక వివరాలు సేకరించారు. ఈ కేసు తెలంగాణకే పరిమితం కాకుండా ఎపి, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లలోనూ విస్తరించడంతో ఆ రాష్ట్రాలలోనూ సిఐడి అధికారులు ఆయా రాష్ట్రాలలో పర్యటించి వివరాలు సేకరించారు. ఈ కేసులో నిందితులుగా వున్న మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ విశ్వేశ్వరరావు సహా ఇతర నిందితులకు నోటీసులు ఇవ్వాలని సిఐడి అధికారులు నిర్ణయించినట్లు వార్తలు వచ్చినా ఇవి నిర్ధారణ కాలేదు. దీనిపై పలు సందర్భాలలో మీడియా సమావేశాల్లో సిఐడి ఉన్నతాధికారులను అడిగినా వారు సమాధానం దాటవేశారు.

ఈ గోల్‌మాల్ అంతా సోమేష్‌కుమార్ ఆదేశాల మేరకే జరిగిందని మిగతా నలుగురు నింది తులు ఆయనకు సహకరించారని సిటీ పోలీసుల విచారణలో వెలుగు చూసిందని వార్తలు వచ్చాయి. దీనిని కూడా అటు సిటీ పోలీసులు కానీ ఇటు సిఐడి అధి కారులు కానీ నిర్ధారించలేదు. నిబంధనల మేరకు 75 కంపెనీలు పన్నులు చెల్లించినా దీనికి సంబంధించిన నిధులు సర్కారు ఖజా నాకు చేరకుండా పక్కదారి పట్టడం వెనుక సోమేష్‌కుమార్ హస్తం వుందని సిటీ పోలీసులకు ఆధారాలు లభించాయని సమాచారం. ఈ కేసులో తాజాగా వాణిజ్య పన్నుల శాఖ అధి కారులను విచారించాలని సిఐడి నిర్ణయించినట్లు వార్తలు వచ్చినా దీనిపై అధికారులు మౌనంగా ఉన్నారు.

**ఇడి విచారణ కూడా సాగుతోంది..**

ఐజిఎస్‌టి స్కాంపై సిఐడి విచారణ ఇలా వుండగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణ కూడా దాదాపుగా ఇలాగే వుందనే వాద న వుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఈడీ ఈ కేసు విచారణను మొదలు పెట్టగా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి సాధించిందనే దానిపై స్పష్టత లేదు. బిఆర్‌ఎస్ హయాంలో బోగస్ ఇన్వాయిస్ సృష్టించి పెద్ద ఎత్తున ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ అంతర్గత ఆడిట్‌లో మొదట వెలుగు చూసిన విషయాన్ని ఈడీ గుర్తించింది. ఈ కేసులో ఎలాంటి వస్తువులు సరఫరా చేయక పోయినా బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించారని ఇడఇ గుర్తించింది. 75 కంపెనీలు ఐజిఎస్‌టి చెల్లింపులో భారీగా అవకతవకలకు పాల్పడడమే కాకుండా 1400 కోట్ల రూపాయలను అక్రమంగా లబ్ధి పొందినట్లు ఈడీ ప్రాథమిక విచారణలో తేలింది. ఇడి కేసు నమోదు చేసినా విచారణ సుదీర్ఘంగా సాగుతోంది.

# అమెరికాలో తెలుగు విద్యార్థులు ఇబ్బందులు పడితే న్యాయసహాయం

## ఇండియా రాణించాలంటే విదేశాల్లో చదువుకుంటున్న యువత సహకరించాలి

### డలాస్‌లోని విద్యార్థులతో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 3:** అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు భరోసా ఇచ్చారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయసహాయం అందించేందుకు బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామన్నారు. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే ఆ విద్యార్థితో పాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురి అవుతుందన్నారు. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని కేటీఆర్ సూచించారు. స్థానిక చట్టాలతో పాటు ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. మంగళవారం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్ లో చదువుకుంటున్న విద్యార్థులతో కేటీఆర్ మాట్లాడారు. యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అమెరికా పోవాలన్నా, చదువుకోవాలన్నా ఎన్నో వ్యయ, ప్రయాసలకు గురయ్యే వాళ్ళమన్న కేటీఆర్, ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందు బాటులోకి వచ్చాయన్నారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేక మందికి అందు బాటులోకి వచ్చింద న్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సి న ప్రధాన లక్ష్యాల పైన దృష్టి పెట్టాలన్నారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 సంవత్సరాలు పూర్తి అవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలన్నారు.



కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో ఇండియా పోటీపడి రాణిం చాల్సి న అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రిస్కు తీసుకున్నప్పుడు మాత్రమే కలలు సాకారం అవుతాయి అనడానికి కెసిఆర్ జీవితమే సాక్ష్యమన్నారు. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని చెప్పారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కెసిఆర్ పై ప్రశంసల కురిపించారన్నారు. పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కేటీఆర్ కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేధోవలస (బ్రెయిన్ డ్రైన్) మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ అధికారంలో ఉన్నా బిఆర్ఎస్ నేతలదే హవా!

## మీనాక్షికి మొరపెట్టుకున్న పలు జిల్లాల కాంగ్రెస్ నేతలు

### పార్టీని బలోపేతం చేసేదిశగా కదులుతున్న అధిష్ఠానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 3:** రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ ముందుకు వెళ్తోంది. నియోజక వర్గ, మండల స్థాయిలో సమర్థ నాయకత్వాన్ని పునరుద్ధరణ చేసేందుకు పార్టీ కసరత్తు చేస్తోంది. ఇటీవల నాలుగైదు రోజుల పాటు రాష్ట్రంలోని 119 అసెంబ్లీల ఎమ్మెల్యేలు, పోటీ చేసిన నాయకుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్న రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ఒకట్రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి నివేదిక ఇస్తారని విశ్వసనీయంగా తెలుస్తోంది. రాష్ట్రంలోని చాలా నియోజక వర్గాల్లో అధికార పార్టీ నాయకుల కంటే బీఆర్ఎస్ నాయకులకే పనులు అవుతున్నాయని, మంత్రులు కూడా వారికే పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి వద్ద కొందరు నేతలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి దాదాపు ఏడాదిన్నర అయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఎన్నికల హామీలు అమలు చేస్తూనే ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేసుకుంటూ పోతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల ఉచిత పథకాలతో పాటు, పలు పథకాలకు రాయితీలు పెద్ద ఎత్తున ఇస్తున్నా, ఉద్యోగాలు భర్తీ చేస్తున్నా, నిరుద్యోగ యువతకు చేయూతనిచ్చేందుకు రాజీవ్ వికాస్ పథకం అందుబాటులోకి తీసుకొచ్చినా, సన్న బియ్యం ఇస్తుదన్నా, కులగణన పూర్తి చేసినా, 42శాతం బీసీ రిజర్వేషన్‌కు బిల్లు తీసుకొచ్చినా, స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేసి వృత్తిలో నైపుణ్యత పెంచుతున్నా, ఆశించిన స్థాయిలో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లడం లేదు. ప్రధానంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలకు, శ్రేణులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్న ఆందోళన వ్యక్తం చేశారని తెలుస్తోంది. మండల స్థాయిలో పోలీసులు కానీ, రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులుకాని, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కూడా పార్టీ ఎమ్మెల్యేలకు, నాయకులకు కూడా పనులు కావడం లేదని తెలుస్తోంది. ఒక్కో పనికి కనీసం ఆరేడు సార్లు కానీ, అధికారులకు చెబితే కానీ పలకడం లేదన్న వాదన వినిపిస్తోంది. ఒకవేళ పలికినా ఇవాళ, రేపు అంటూ మీనమేషాలు లెక్క పెడుతూ కాలయాపన చేస్తున్నారని భావన వ్యక్తమవుతోంది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లో అయితే పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయని, అక్కడ బీఆర్ఎస్ కార్యకర్తలు మొదటి శ్రేణి పౌరులుగా కొనసాగుతుండగా, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాత్రం ద్వితీయశ్రేణి పౌరులుగా నాయకులుగా కొనసాగించాల్సి వస్తోందని అనేక మార్లు పీసీసీ, సీఎంలకు ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయులు ఫిర్యాదు కూడా చేశారని సమాచారం. ఇందుకు తోడు బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ప్రతిపక్ష నాయకులు విమర్శనాస్త్రాలతో ప్రభుత్వ పథకాలపై వ్యతిరేకతనే ఎక్కువగా ప్రచారం జరుగుతోంది.రాష్ట వ్యవహారాల ఇంఛార్జిగా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు తీసుకున్న తరువాత పలువురు నాయకులతో కలిసిన సమయంలో ఇలాంటి అనేక అంశాలు ఆమె దృష్టికి వచ్చాయి. ఇదే సమయంలో కొన్ని నియోజక వర్గాల్లో నాయకులు బాహాటంగా విమర్శలు చేసుకుంటూ వస్తున్నారు.టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా ఈ భేటీలో లేకుండా జాగ్రత్త పడ్డారు. పీసీసీ అధ్యక్షుడు కూడా ఉంటే క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు ఆయా ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు చెప్పలేరని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులకే పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కనీసం అధికారులు కూడా పలకడం లేదని పలువురు పార్టీ నేతలు చెప్పారని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అయినా ఆలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్లు, మార్కెట్ యార్డ్ కమిటీలు ఏర్పాటు చేయలేదని, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు కూడా భర్తీ చేయకపోవడంతో పార్టీ కోసం కష్టపడి పని చేసిన తామంతా నిరుత్సాహంతో ఉన్నట్లు తెలిపారని తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో తాజా రాజకీయ పరిస్థితులతో పాటు పార్టీ బలాబలాలు, ఇతర పార్టీల స్థితిగతులు తెలియడంతో మొత్తం మీద రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులతో పాటు మంత్రుల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, నియోజకవర్గ, మండల స్థాయిలో పార్టీ బలోపేతం కావాలంటే ఏం చేయాలి, కార్పొరేషన్ పదవుల కోసం పార్టీ నాయకుల ఎదురు చూపులు తదితర అంశాలపై రాష్ట వ్యవహారాల ఇన్‌ఛార్జి ఓ నివేదిక ఎఐసిసికి ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# 10 నుంచి 17 వరకు అంగన్‌వాడీల వారోత్సవాలు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** అంగన్ వాడీల బలోపేతం కోసం వారోత్సవాలను నిర్వహించాలని రాష్ట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు మంగళవారం మహిళా సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నెల 10 నుంచి 17 వ రకు అమ్మమాట అంగన్‌వాడీ బాట పేరుతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మూడేళ్ళు దాటిన పిల్లలను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించేలా గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో వీటిని మహిళా శిశు సంక్షేమశాఖ నిర్వహించనుంది.జూన్ 10 అంగన్ వాగీ కేంద్రాల్లో పిల్లలతో పేరంట్స్ సెల్ఫీ, గ్రామ స్థాయలో ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం, జూన్ 11న మూడేళ్ళు పైబడిన చిన్నారులను గుర్తించి వారి నివాసాలను సందర్శించి అంగన్ వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని కేంద్రాల్లో చేర్పించేలా ప్రోత్సహించాలి.

అంగన్ వాడీ కేంద్రాల్లో ఐదేళ్ళు దాటిని పిల్లలకు గ్రాడ్యువేషన్ డే నిర్వహించి ప్రైమరి స్కూళ్ళలో చేర్పించాలి.జూన్ 12,13,16న పోషన్ కిచెన్ గార్డెన్లో అభివృద్ధి. అంగన్ వాడీ కేంద్రాల్లో అందుతన్న పోషకాహార వివరాలను హైలెట్ చేయాలి చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జూన్ 17 అంగన్ వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులు, గ్రామ పెద్దల సమక్షంలో సమాహిక అక్షరాభ్యాసం. అంగన్ వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు ప్రారంభమయ్యే లోపు స్వచ్ఛ అంగన్ వాడీ ప్రోగ్రాం కింద అంగన్ వాడీ కేంద్రాల్లో పారిశుద్య నిర్వహణ. జిల్లా సంక్షేమ అధికారులు ఆధ్వర్యంలో జూన్ 6న మందర్స్ కమిటీల, మహిళా స్వయం సహాయక బృందాలతో కలిసి అంగన్ వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలు తెలియ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి

## కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 3:** కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో ముగ్గురు యువకులు గల్లంతైన ఘటన చివరకు విషాదాం తమైంది. క్రికెట్ ఆడాక సరదాగా ఈత కొట్టేం దుకు వెళ్లి మృత దేహాలుగా బయటి కొచ్చారు. వీరి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ముగ్గురూ నవయవ్వన యువకులు కావడం, ఎదిగొచ్చిన బిడ్డలు విగతజీవులుగా మారడం చూసి కన్నవారు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎంతో భవిష్యత్తున్న యువకులు మృతి చెందడంతో వారి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.సోమవారం సాయంత్రం సోమార్‌పేటకు చెందిన హర్షవర్ధన్, ఎల్లారెడ్డి వాసి మధుకర్, తిమ్మారెడ్డికి చెందిన నవీన్ కొంతమంది యువకులతో కలిసి బ్యాక్‌వాటర్ సమీపంలో రెండు గంటల పాటు క్రికెట్ ఆడారు. అనంతరం వారి గ్రామాలకు వెళ్తున్న క్రమంలో పిప్రియాల్ వద్ద ఈత కొట్టేందుకు బ్యాక్‌వాటర్‌లోకి దిగారు. మిగతా యువకులు ఈ ముగ్గురిని చూస్తూ గట్టుపై ఉన్నారు. కొద్దిసేపటికి మరింత లోపలికి వెళ్లిన యువకులు నీటిలో మునిగి గల్లంతయ్యారు. వారిని గమనించిన స్నేహితులు గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడగా మంగళవారం తెల్లవారుజాము నుంచి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. గాలింపు చర్యల్లో ఉదయం మధుకర్ మృతదేహం లభ్యంకాగా మధ్యాహ్నం మరో ఇద్దరి మృతదేహాలను గజ ఈతగాళ్లు వెలికితీశారు. లభ్యమైన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కన్నబిడ్డలు విగతజీవులుగా మారడం చూసి తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మంచి భవిష్యత్తున్న యువకులు ప్రాణాలు కోల్పోవడంతో వారి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మాలిర్ జైలు నుంచి 200 మంది ఖైదీలు పరార్



**కరాచి, జూన్ 3:** పాకిస్థాన్‌లోని అతిపెద్దజైలు నుంచి భూకంపం వచ్చిందన్న భయాలతో సుమారు 200 మందికిపైగా ఖైదీలు జైలు గోడలనుంచి తప్పించుకుని పరారయ్యారు. వేలాది మంది ఖైదీలు తలుపులు బద్దలు కొట్టారు. తాళాలను సైతం బద్దలుకొట్టి తమ సెల్స్‌నుంచి బయటికి వచ్చి రణరంగం సృష్టించారు. కిటికీలు బద్దలుకొట్టి వారంతా బయటకు వెళ్లారని జైలు అధికారులు తెలిపారు. కరాచిలోని మాలిర్‌జైలులో ఈ సంఘటన సంభవించింది. మొత్తం పరారయినవారిలో 80 మందిని మళ్లీ పట్టుకున్నామని, మిగిలినవారికోసం గాలింపు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికీ 130 మంది జాడ తెలియాల్సి ఉంది. ఆపరేషన్‌లో ఒక ఖైదీ చనిపోగా మరో ఇద్దరు జైలు అధికారులు తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. అర్ధరాత్రి సమయంలో ఖైదీలు తమతమ గదులనుంచి పెద్దగా అరుస్తూ కేకలు వేసారని, భూకంపం వస్తోందని, ఈభవనం తమపై కూలిపోతుందని పెద్దగా కేకలువేసారన్నారు. అయితే వారిని సర్దుబాటు చేసేందుకు గాలిలోకి కాల్పులు జరిపామని, హెచ్చరిక కాల్పులుకూడాజరిపినట్లు తెలిపారు.అనేకమంది అప్పటికే తమ గదుల్లోకి వెళ్లారని, మరికొందరు ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని గేట్లను బద్దలుకొట్టి పరారయ్యారన్నారు.

మొత్తం 216 మంది ఈ అవకాశం తీసుకుని జైలునుంచి పారిపోయారన్నారు. వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేస్తున్నారని, ఇప్పటికే కొంతమందిని అరెస్టు చేసామన్నారు. సింధ్‌ప్రావిన్స్‌లోని మాలిర్‌జిల్లాలో ఈ జైలు నిర్మించారు. ప్రస్తుతం సామర్థ్యానికి మించి ఖైదీలతోనిండిపోయింది.

2200 మందిఖైదీలకు మాత్రమే పరిమితమైన ఈజైలులో ఇపుడు ఐదువేల మందికిపైగా ఖైదీలున్నారు. జైళ్లశాఖ మంత్రి ఆలిహాసన్ జర్దారి ఈ ఘటనపై విచానఖు ఆదేశించారు. ఆరోపణలు రుజువైతే అదికారులపై చర్యలు తప్పవన్నారు. ఇది ఎంతమాత్రం భద్రతా వైఫల్యం కాదని, ప్రకృతి వైపరీత్యం వల్లనే ఇదిజరిగిందన్నారు. జైలువద్ద సెక్యూరిటీ టీమ్‌లకుపై అలర్ట్‌పంపించామన్నారు. ఈఖైదీల కుటుంబాలు జైలు గేట్లవద్ద నిరసన ప్రదర్శనచేస్తున్నారు. ఇతర ఖైదీల కుటుంబసభ్యులుకూడా అసహనంతో ఉన్నందున ములాకాత్‌లను ప్రస్తుతం వాయిదావేసామని జైలు అధికారులు తెలిపారు.

# 'షష్టిపూర్తి' విజయోత్సవం

నటకిరీటి డా.రాజేంద్ర ప్రసాద్,అర్చన, రూపేశ్, ఆకాంక్ష ప్రధాన పాత్రల్లో మా ఆయి క్రియేషన్స్ బ్యానర్ మీద రూపేశ్ నిర్మించిన చిత్రం షష్టిపూర్తి. పవన్ ప్రభ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 30న విడుదలైంది. ప్రస్తుతం ఈ మూవీకి మంచి ఆదరణ లభిస్తోంది. థియేటర్లలో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుండటంతో కల్చరల్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, షష్టిపూర్తి అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. పెళ్లి పుస్తకం నుంచి షష్టిపూర్తి వరకు ఏ నటుడికి దక్కని సినిమా జర్నీ నాకు దక్కింది. మీడియా, ఆడియెన్స్ వల్లే మా షష్టిపూర్తి చిత్రం ఈ స్థాయి వరకు వచ్చింది. థియేటర్లో అందరూ చూసి ఏడ్చేస్తున్నారంటేనే మేం సక్సెస్ అయినట్టు. లేడీస్ టైలర్‌లో నేను చాలా అల్లరి చేశాను. ఆ నలుగురు చూసి నన్ను రఘురాం అని అన్నారు. అదే పాత్ర తాలుకా గొప్పదనం. మన కంటే మన పాత్రలే గుర్తుంటాయి అన్న ఎన్టీ రామారావు గారు చెబుతుంటారు. పవన్ ప్రభ నా మీద కథ రాసుకున్నారు. లేడీస్ టైలర్ తరువాత అర్చనను మళ్లీ ఇంత వరకు చూడలేదు. మాతో ఇలాంటి ఓ గొప్ప కథను, సినిమాను పవన్ ప్రభ చెప్పారు. కొడుకు కథ చెబుతూనే తల్లిదండ్రుల గురించి అద్భుతంగా చూపించారు. పవన్ కుమార్ అనే పేరుని అమ్మ చనిపోయాక ఆ పేరుని మార్చుకుని పవన్ ప్రభ అని పేరుగా పెట్టుకున్నారు. అమ్మ మీద అంత ప్రేమ ఉంది కాబట్టే ఇంత మంచి కథను రాసుకున్నారు.. అదే ఇప్పుడు కల్ట్ సినిమాగా మారింది. నాకు షష్టిపూర్తి చేసి తల్లిదండ్రుల్ని ఎలా చూసుకోవాలి.. ఎంతలా గౌరవించాలో, ప్రేమించాలో చూపించారు. ఇలాంటి చిత్రాలెన్నో ఇంకారావాలి. విజయ వాహినీ, ఏవీఎం స్టూడియో వంటి ఎన్నో గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడని చెబుతున్నాను. ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు అని అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ, షష్టిపూర్తిని ఇంతలా సపోర్ట్ చేస్తున్న ఆడియెన్స్, మీడియాకు థాంక్స్. ఈ మూవీని థియేటర్లో చూస్తేనే మంచి ఫీలింగ్ వస్తుంది.



# 'బద్మాషులు' ప్రిరిలీజ్ ఈవెంట్

శంకర్ చేగూరి దర్శకత్వంలో బి బాలకృష్ణ, రమా శంకర్ నిర్మించిన తాజా చిత్రం బద్మాషులు. ఈ చిత్రం జూన్ 6న రిలీజ్ అవుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ తాజాగా ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకులు తరుణ్ భాస్కర్, మాలిక్ రామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో చరణ్ అర్జున్ మాట్లాడుతూ, మహేష్ చింతలకి అవకాశం వచ్చినట్లే చిత్ర పరిశ్రమంలో ప్రతి ఒక్కరికి ఒక రోజు వస్తుంది. ఒక శుక్రవారం రోజు ప్రతి ఒక్కరు స్టార్లు అయ్యే అవకాశం ఉంటుంది. కాకపోతే దానికి కాస్త టైం పడుతుంది. బద్మాషులు చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ స్టార్లు కావాలని ఆశిస్తున్నా అని అన్నారు. ఈ చిత్ర ప్రిరిలీజ్ ఈవెంట్‌కి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ, చాలామంది కామెడీని చాలా తేలిగ్గా తీసిపారేస్తుంటారు. కానీ ఆ కామెడీ సన్నివేశాలు వెనుక ఎంత కష్టం, నిజాయితీ దాగుందనేది చూసే వాళ్లకి అర్థం కాదు. చాలా టెన్షన్ పడుతూ రాత్రి వేళల్లో ఆ సన్నివేశాలు రాసాను. మన టాలెంట్‌తో నిజాయితీగా ప్రయత్నిస్తే మన కష్టానికి వడ్డీతో సహా ప్రతిఫలం దక్కుతుంది. మానాన్నకి కోపం వచ్చినప్పుడు నన్ను కామన్‌గా తిట్టే పదం బద్మాష్. బద్మాషులు చిత్రం మంచి విజయం సాధించాలి. ఆరవ తేదీ ప్రతి ఒక్కరు ఈ చిత్రాన్ని చూడండి అని తరుణ్ భాస్కర్ అన్నారు. డైరెక్టర్ మాలిక్ రామ్ మాట్లాడుతూ, టిల్లు స్క్వేర్ రాకముందు డిజె టిల్లు అనేది చిన్న చిత్రం. ఈ నగరానికి ఏమైంది చిత్రానికి ముందు పెళ్లి చూపులు అనేది ఒక స్మాల్ బడ్జెట్ మూవీ. ఈ రోజున విజయం



సాధించే చిన్నబడ్జెట్ చిత్రాలే రేపు పెద్దబడ్జెట్ చిత్రాలకు నాంది పలుకుతాయి అన్నారు. బద్మాషులు చిత్ర డైరెక్టర్ శంకర్ చేకూరి మాట్లాడుతూ, తరుణ్ భాస్కర్ అన్న ఈ చెత్త ప్రిరిలీజ్‌కి వచ్చి బద్మాష్‌లో చిత్రాన్ని మరోస్థాయికి పెంచారు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు. బద్మాషులు మూవీ రెండు గంటల పాటు ఫన్ రైడ్‌గా సాగుతుంది.

# 16న 'రాజా సాబ్' టీజర్

రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ రాజా సాబ్ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 16న ఉదయం 10.52 నిమిషాలకు రాజా సాబ్ టీజర్ విడుదల చేయబోతున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ అనౌన్స్ మెంట్‌తో రెబల్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రభాస్ డబ్బులతో నిండి ఉన్న గదిలో ఫెరోషియస్‌గా కనిపించడం ఆసక్తి కలిగిస్తోంది. మరోవైపు రాజా సాబ్ రిలీజ్ డేట్, టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. రాజా సాబ్ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండటంతో ఈ సినిమా మీద అందరిలో క్యూరియాసిటీ ఏర్పడుతోంది. రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకులకు ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నారు డైరెక్టర్ మారుతి. నటీనటులు- ప్రభాస్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్, తదితరులు. టెక్నికల్ టీమ్-ఎడిటింగ్- కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ-కార్తీక్ పళని, మ్యూజిక్- తమన్, ఫైట్ మాస్టర్- రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమాన్, ప్రొడక్షన్ డిజైనర్- రాజీవన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ - ఎస్ కేఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- టీజీ కృతి ప్రసాద్, పీఆర్ఓ- జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ కాకా, కో ప్రొడ్యూసర్ - వివేక్ కూచిభొట్ల, ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్.






# 'కుబేర' ఆడియో లాంచ్

ధనుష్, నాగార్జున హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు తమిళ ద్విభాషా చిత్రం కుబేర ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అభిమానులు, మీడియా, చిత్ర పరిశ్రమ నుండి ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హీరోలు ధనుష్, నాగార్జున, హీరోయిన్ రష్మిక మందన్న, దర్శకుడు శేఖర్ కమ్ముల, మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు సునీల్ నారంగ్, జాన్వి నారంగ్, భరత్ నారంగ్, సిమ్రాన్ నారంగ్, సినిమాటోగ్రాఫర్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు. వారందరూ ఈ సినిమా గురించి తమ ఉత్సాహాన్ని పంచుకున్నారు. హీరోయిన్ రష్మిక మందన్న మాట్లాడుతూ, మీ ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. ఐ లవ్ యూ టూ. తన సినిమా వరల్డ్ లోకి నన్ను తీసుకొచ్చినందుకు శేఖర్ కమ్ముల గారికి కృతజ్ఞతలు. కుబేర నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిల్మ్. ధనుష్‌తో మళ్ళీ కలిసి పనిచేయాలని వుంది. ఈసారి పూర్తి స్థాయి రొమాంటిక్



చిత్రం చేయాలని వుంది అన్నారు. దేవి శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని పాటలు, పోయిరా మామా, ట్రాన్స్ ఆఫ్ కుబేరా పట్ల అభిమానులకు చూపిన ప్రేమకు కృతజ్ఞతలు. కుట్టి నుండి వెంగై వరకు, ఇప్పుడు కుబేరా వరకు ధనుష్‌తో తన సంగీత ప్రయాణాన్ని కొనసాగిస్తూ, మరొక విజయవంతమైన సహకారం కోసం తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అన్నారు. నిర్మాతలు పుష్కర్ రామ్మోహన్, సునీల్ నారంగ్ మాట్లాడుతూ, ఈ సినిమాకి అందరూ సపోర్ట్ చేశారు. ధనుష్ అద్భుతమైన వ్యక్తి. నాగార్జున ఇండియా మన్మథుడు. ఇలా అద్భుతమైన తారాగణం కలిసి చేసిన ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా మా టీం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. సినిమా జూన్ 20న చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాము అన్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. ధనుష్ అద్భుతమైన వ్యక్తి, నటుడు, దర్శకుడు, నిర్మాత, గాయకుడు, గీత రచయిత, అరుదైన ఆల్‌రౌండర్. కుబేరా ఒక అద్భుతమైన చిత్రం. ధనుష్, నాగార్జున పెర్ఫార్మెన్స్ మెస్మరైజింగ్‌గా వుంటుంది. కుబేర బ్రిలియంట్ ఫిల్మ్. ఆడియన్స్‌కి చాలా న్యూ ఎక్స్‌పీరియన్స్ వుంటుంది. మూవీ టీంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. హీరో నాగార్జున మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అడయార్‌లో పుట్టి, గిండి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకున్నాను. చెన్నై కుటుంబంలో వివాహం చేసుకుని, ఇక్కడే తన కెరీర్‌ను ప్రారంభించాను. చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా తనకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. కుబేర ఆడియన్స్‌కి ఖచ్చితంగా నచ్చుతుంది.

# 'చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి' టైటిల్ గ్లింప్స్

ఎమ్3 మీడియా పతాకంపై మహా మూవీస్ సౌజన్యంతో బిగ్ బాస్ ఫేమ్ అమరదీప్ చౌదరి, నటి సురేఖ వాణీ కూతురు సుప్రీతా నాయుడు హీరో హీరోయిన్‌గా మాల్యాద్రి రెడ్డి దర్శకత్వంలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెంబర్ 2 చిత్రం ఇది. అయితే ఈ చిత్రం చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి అనే టైటిల్ గ్లింప్స్‌ను ప్రేక్షకుల సమక్షంలో విడుదల చేశారు చిత్ర యూనిట్. ఈ సందర్భంగా చిత్ర విశేషాలు తెలియజేస్తూ, నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని మేము లిమిటెడ్ బడ్జెట్‌తో ప్రారంభించాము. కానీ మా హీరో హీరోయిన్ కి ఉన్న పాపులారిటీ వల్ల మా చిత్రానికి క్రేజ్ పెరిగింది. అందరికి సుపరిచితం అయినా నటి నటులు రాశి గారు, వినోద్ కుమార్, సురేఖ వాణి, రాజా రవీంద్ర ఇలా చాలా మంది పాపులర్ నటీనటులతో ఈ చిత్రాన్ని నిర్మించాము. షూటింగ్ అంత పూర్తయింది, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభం అయ్యాయి. చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి అనే మంచి టైటిల్‌తో త్వరలో మీ ముందుకు వస్తాము అని తెలిపారు. హీరోయిన్ సుప్రీతా నాయుడు మాట్లాడుతూ, సినిమా స్టార్టింగ్ టైంలో నాకు భయం వేసింది కానీ ఇప్పుడు కాన్ఫిడెంట్ వచ్చింది. మా డైరెక్టర్‌కి థాంక్స్ మా హీరో అమరదీప్ కి థాంక్స్, షూటింగ్ టైంలో చాలా సపోర్ట్ చేశారు. మా నిర్మాత నన్ను తన ఇంటి అమ్మాయిలా చూసుకున్నారు. టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేసాము. విజువల్స్ చాలా బాగున్నాయి అని తెలిపారు. నటి సురేఖ వాణి మాట్లాడుతూ, టైటిల్ చాలా బాగుంది. మంచి మంచి కామెంట్స్ వచ్చాయి. సినిమా చాలా బాగా రావాలి సూపర్ హిట్ కావాలి అని కోరుకున్నారు. హీరో అమరదీప్ చౌదరి మాట్లాడుతూ, టైటిల్ చాలా బాగుంది, నా మొదటి సినిమాకి ఇంత మంచి టైటిల్‌లో వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా జర్నీలో మహేంద్ర లాంటి మంచి ప్రొడ్యూసర్‌ని నేను ఎక్కడ చూడలేదు. సినిమాని నమ్మితే ఎంత ఆయన ఖర్చు పెడతారు. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చాక సినిమా ఎందుకు లేట్ అవుతుంది అని అడుగుతున్నారు, చక్కగా ప్లాన్ చేసుకుని మంచి సినిమాతో రావాలని అనుకున్నాను, అని కుదరడానికి ఇంత సమయం పట్టింది. చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి మంచి సినిమా. మంచి ప్లానింగ్‌తో ఈ సినిమాచేసాము. ప్రేక్షకులందరికీ నచ్చుతుందన్నారు.



# జులై 11న 'ఘాటి' విడుదల

క్వీన్ అనుష్క శెట్టి, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ ఘాటి గ్లింప్స్‌లో ఇంటెన్స్ వైలెంట్ క్యారెక్టర్‌లో అందరినీ ఆశ్చర్యపరిచారు. అనుష్క పుట్టినరోజున విడుదలైన గ్లింప్స్ అద్భుతమైన స్పందన వచ్చింది. దీని తర్వాత, తమిళ స్టార్ విక్రమ్ ప్రభు ఇంటెన్స్ అవతార్‌లో కనిపించిన క్యారెక్టర్ గ్లింప్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది సినిమాపై ఉన్న బజ్‌ను మరింత పెంచింది. రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మిస్తారు. మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ అప్‌డేట్ ఇచ్చారు. ఘాటి జూలై 11న రిలీజ్ కానుంది. మేకర్స్ త్వరలో ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేయనున్నారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో అనుష్క, విక్రమ్ ప్రభు నది గుండా సంచులు మోసుకుంటూ వెళుతున్న విజువల్స్ ఇంటెన్స్ జర్నీని సూచిస్తున్నాయి. ఘాటి అనుష్క శెట్టి, దర్శకుడు క్రిష్ సక్సెస్ ఫుల్ మూవీ వేదం తర్వాత కలిసిన చేస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తున్నారు. మనోజ్ రెడ్డి కాటసాని సినిమాటోగ్రఫీని అందిస్తుండగా, నాగవెల్లి విద్యాసాగర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి తోట తరణి ఆర్ట్ డైరెక్టర్ కాగా, చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్ స్వామి ఎడిటర్. సాయిమాధవ్ బుర్రా మాటలు రాశారు. ఈ చిత్రం హై బడ్జెట్‌తో, అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందుతోంది. ఘాటి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషల్లో విడుదల కానుంది.



తారాగణం: అనుష్క శెట్టి
సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, నిర్మాతలు: రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి, బ్యానర్: ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: మనోజ్ రెడ్డి కాటసాని ఆర్ట్ డైరెక్టర్: తోట తరణి సంగీతం: నాగవెల్లి విద్యా సాగర్ డైలాగ్స్: సాయి మాధవ్ బుర్రా కథ: చింతకింది శ్రీనివాసరావు ఎడిటర్: చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్ స్వామి యాక్షన్ కొరియోగ్రఫీ: రామ్ క్రిషన్, పీఆర్వో: వంశీ శేఖర్.

# 'చెన్నై లవ్ స్టోరీ' టైటిల్ రెడీ

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం, యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫోటో, బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన దర్శక నిర్మాత సాయి రాజేశ్, ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీకి చెన్నై లవ్ స్టోరీ టైటిల్ ఖరారు చేశారు. ఈ రోజు బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా ఈ సినిమా టైటిల్‌తో పాటు గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సాయి రాజేశ్, ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. తొలి ప్రేమేం తోపు కాదు, ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలువుతుందని చెబుతూ సాగిన గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. ఈ గ్లింప్స్‌లో హీరో కిరణ్ అబ్బవరం ఫ్రెష్ లుక్‌లో కనిపిస్తున్నారు. శ్రీ గౌరి ప్రియ స్క్రీన్ ప్రెజెన్స్ ఇంప్రెస్ చేసింది. సముద్రపు ఒడ్డున ఈ జంట ఫస్ట్ లవ్, బెస్ట్ లవ్ గురించి మాట్లాడుకున్న సంభాషణ ఆసక్తికరంగా, ఆలోచింపజేసేలా సాగింది. తొలి ప్రేమకు మరణం లేదు అనే బేబి సినిమాలోని ఫేమస్ డైలాగ్‌ను హీరోయిన్ చెబుతూ తొలిప్రేమే గొప్పదని అంటుంది. అందుకు హీరో స్పందిస్తూ తొలి ప్రేమేం తోపు కాదు, ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలువుతుంది.. అని సమాధానంచెబుతాడు. అంతం వరకు అనంతమై సాగే ఈ జీవితంలో తొలి ప్రేమ ఒక మజిలీ మాత్రమేనని, అదే తుది కాదనే కాన్సెప్ట్‌ను ఈ గ్లింప్స్ ద్వారా మేకర్స్ అందంగా తెలియజేశారు. ఈ గ్లింప్స్‌కు తొలి ప్రేమే తోపు కాదే తోపు కాదే.. అంటూ మెలొడీ బ్రహ్మ మణిశర్మ బ్యూటిఫుల్ బీజీఎం సాంగ్ కంపోజ్ చేశారు.



నటీనటులు-కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ, తదితరులు.
టెక్నికల్ టీమ్- కాస్ట్యూమ్ డిజైనర్-దేవి పర్చూరి ఆర్ట్-భాస్కర్ ముదావత్, ఎడిటర్-సంతోష్ నాయుడు డీవోపీ- విశ్వాస్ డేనియల్, లిరిక్స్- అనంత్ శ్రీరామ్ మ్యూజిక్ డైరెక్టర్- మణిశర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విశాల దాట్ల, లైన్ ప్రొడ్యూసర్: శ్యామ్ ప్రసాద్ మేక, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ కాకా, మార్కెటింగ్ హౌస్ ఫుల్, కో ప్రొడ్యూసర్: ధీరజ్ మొగిలినేని, ఇన్వెస్టర్స్: రమేష్ పెద్దింటి, శేఖర్ బాలబొమ్మ స్టోరీ: సాయి రాజేశ్ నిర్మాతలు: సాయి రాజేశ్, ఎస్ కేఎన్.

# 'అపాయవీడి హెచ్చరిక' తెలుగులో 'డేంజర్ బాయ్స్'

కన్నడలో అనూహ్య విజయం సాధించి వసూళ్ల వర్షం కురిపించిన అపాయవీడి హెచ్చరిక చిత్రం డేంజర్ బాయ్స్ పేరుతో తెలుగు ప్రేక్షకులను సైతం ఉర్రూతలూగించేందుకు సన్నద్ధమవుతోంది. ప్రముఖ దర్శకనిర్మాత శ్రీరంగం సతీష్ కుమార్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రిరిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ డేంజర్ బాయ్స్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేయగా, టీజర్‌ను ప్రముఖ దర్శకనిర్మాత డాక్టర్ లయన్ సాయి వెంకట్, పాటలను ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్యవర్ధన్ విడుదల చేశారు. ట్రైలర్‌ను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్ ఆవిష్కరించారు. ఈ వేడుక కోసం బెంగళూర్ నుంచి మొత్తం చిత్రబృందం హైదరాబాద్ రావడం విశేషం. దండుపాళ్యం, కేజీఎఫ్ కాంతారా చిత్రాల కోవలో... కన్నడలో అనూహ్య విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ సంచలనం సృష్టించడం ఖాయమని అతిథులు పేర్కొన్నారు. ఈ ట్రైలర్, సాంగ్స్ చూస్తుంటే... ఈ చిత్రం మరో మంజుమల్ బాయ్స్ అవుతుందనిపిస్తోందని వారు తెలిపారు. యశస్విని క్రియేషన్స్ గీతా ఫిలిమ్స్ పతాకలపై శ్రీరంగం సతీష్ కుమార్ సమర్పణలో... వి.జి.మంజునాథ్ పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రానికి రచన-దర్శకత్వం: అభిజిత్ తీర్థహళ్లి. వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హాసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహళ్లి ముఖ్య తారాగణంగా కన్నడలో విజయ దుందుభి మ్రోగించిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌కి సంగీత దర్శకుడు ఛాయాగ్రాహకుడు ఒక్కరే కావడం గమనార్హం. సునాద్ గౌతమ్ మ్యూజిక్, సినిమాటోగ్రఫీ డేంజర్ బాయ్స్ చిత్ర సంచలన విజయంలో సముచిత పాత్ర పోషించాయి. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు శ్రీరంగం సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. తెలుగులో కన్నడ కంటే పెద్ద విజయాన్ని అందుకోవడం ఖాయమని పేర్కొన్నారు.



# మేని ఛాయకు పంచదార!



ఆరోగ్యంగా ఉండాలంటే తీపికి.. అందులోనూ ప్రత్యేకించి పంచదారకు దూరంగా ఉండాలన్నది తెలిసిందే. కానీ ఆరోగ్యానికి చెరుపు చేసే పంచదార సౌందర్య పరిరక్షణలో మాత్రం కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు.

మరి అది ఎలాగో చూద్దాం రండి..

**లేలేత అధరాలకు....**

సాధారణంగానే పెదవుల మీద కొద్దిగా చక్కెర రాస్తే మృతకణాలు తొలగిపోయి మృదువుగా మారతాయి. కొద్దిగా చక్కెర తీసుకుని అందులో పాలు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో రోజూ రాత్రి పూట పడుకొనే ముందు పెదవులకు మెల్లగా మర్దన చేసుకుంటే గులాబీల్లాంటి లేలేత అధరాలు సొంతమవుతాయి. అయితే ఈ చిట్కా



ఎప్పుడో ఓసారి కాకుండా రెండు లేదా మూడు రోజులకోసారి పాటిస్తేనే సత్ఫలితాలు పొందవచ్చు.

**ఎసెన్షియల్ ఆయిల్‌తో..**

చర్మం పొడిబారి నిర్జీవంగా మారినప్పుడు చక్కెరని ఉపయోగించి తిరిగి దాన్ని సాధారణ స్థితికి తీసుకురావచ్చు. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో మీకు నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్ కొన్ని చుక్కలు వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. తర్వాత చల్లని నీటితో ముఖం శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మళ్లీ కొత్త కళను సంతరించుకుంటుంది.

**వృద్ధాప్య ఛాయలు రానీయకుండా...**

చర్మం ముడతలు పడటం, సన్నని గీతలు కనిపించడం. వంటి లక్షణాలు ద్వారానే వయసు పైబుతోందన్న విషయం పైకి తెలుస్తుంది. చక్కెరని ఉపయోగించడం వల్ల చర్మం ముడతలు పడకుండా కాపాడుకోవచ్చు. అలాగే చక్కెర సన్నని గీతలు కూడా కనిపించ కుండా చేస్తుంది. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో నిమ్మరసం వేసి ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత తడి గుడ్డతో తుడుచుకోవాలి. ఇది సూర్యరశ్మిలో ఎక్కువ సమయం ఉండటం వల్ల ఎదురయ్యే ట్యానింగ్, పిగ్మెంటేషన్ వంటి సమస్యలకు కూడా చక్కని పరిష్కారంగా ఉపయోగపడుతుంది.

**మేని ఛాయ కోసం...**

చర్మం రంగుని పెంచుకోవాలనుకునేవారు కొద్దిగా గంధం తీసుకుని అందులో రోజ్‌వాటర్, చక్కెర చెంచా చొప్పున వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. □

# తల్లుల ప్రోత్సాహంతో దేశ రక్షణలో..

బిడ్డకు ఏ చిన్న దెబ్బ తగిలినా తల్లడిల్లిపోతుంది తల్లి హృదయం. అందుకే వాళ్లు పెరిగి పెద్దైనా, ప్రయోజకులైనా వాళ్లనో కంట కనిపెట్టుకొని ఉంటుంది. అలాంటిది తమ బిడ్డల్ని దేశ రక్షణ కోసం పంపించడమంటే ఎంతో ధైర్యం కావాలి. అలాంటి ధైర్యసాహసాలకు మారుపేరుగా నిలుస్తున్నారీ అమ్మలు. తమ కూతుళ్లు, కొడుకుల్ని అత్యంత సాహసోపేతమైన రక్షణ రంగంలో ప్రోత్సహించి ఆదర్శంగా నిలిచారు. వీళ్లలో కొందరు అమ్మల అడుగుజాడల్లో నడుస్తూ త్రివిధ దళాల్లో అడుగుపెడితే.. మరికొందరు తమ తల్లుల ప్రోత్సాహంతో దేశ రక్షణలో భాగమయ్యారు. అలాంటి బ్రేవ్ మదర్స్ గురించి తెలుసుకుందాం..

**ముగ్గురినీ యుద్ధభూమికి పంపి..! ..**

త్రివిధ దళాల్లో చేరడమంటే ప్రాణాల్ని పణంగా పెట్టడమే! ఇలాంటి వృత్తిలోకి ఇంట్లో నుంచి ఒకరిని పంపడమే గొప్ప విషయం అనుకుంటే.. తన ముగ్గురు కొడుకుల్నీ భారత ఆర్మీలోకి పంపిన



మాతృమూర్తి జమునదేవి. ఉత్తరాఖండ్ లోని కరౌలీ అనే చిన్న గ్రామం ఆమెది. సైన్యంలో చేరాలని, దేశ సేవ చేయడం చిన్నతనం నుంచే కలలు కనే తన కొడుకుల ఆసక్తిని గుర్తించిందామె. వారిని ఆ దిశగా ప్రోత్సహించడమే కాదు.. దేశ సేవలోని గొప్పతనాన్ని వారికి పాఠాలుగా చెబుతూ వారిని మెరికల్లా తయారుచేసింది.. ఇలా తన దేశభక్తిని చాటుకున్న ఆమె కొడుకులు ఆ రాష్ట్రంలోని ఆయా రెజిమెంట్లలో సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారు. 'వీళ్లు నా ఆణిముత్యాలు.. తమ జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారు. వీళ్లు కేవలం నా కొడుకులే కాదు...మాత ముద్దుబిడ్డలు కూడా!

**తల్లీ కొడుకులు ఒకే చోట..**

తల్లీకొడుకులు/తల్లీకూతుళ్లు త్రివిధ దళాల్లో చేరడమే అరుదనుకుంటే.. ఒకే చోట ట్రైనింగ్ పూర్తిచేసుకొని అక్కడే బాధ్యతలు స్వీకరించడం మనమెప్పుడూ చూస్తుండడం. అయితే మాజీ మేజర్ స్మితాచతుర్వేది, ఆమె కొడుకు లెఫ్టినెంట్ రజత్ రంజన్ కిరణ్ విషయంలో ఇది సాకారమైంది.. స్మిత 1995లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసి సైన్యంలో చేరారు. కొన్నేళ్ల క్రితం మేజర్‌గా పదవీ విరమణ చేశారు. ఆమెనే స్ఫూర్తిగా తీసుకున్న ఆమె



కొడుకు రజత్ కూడా.. భారత సైన్యంలో చేరి దేశ సేవ చేయాలని సంకల్పించాడు. ఈ మక్కువతోనే దీనికి సంబంధించిన పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాడు. 2022లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలోనే రజత్ కూడా శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరాడు. ఇలా 27 ఏళ్ల ఒకే వ్యవధిలో తల్లీ కొడుకులు ఒకే చోట, ఒకే తరహాలో శిక్షణ పూర్తిచేసుకొని బాధ్యతలు స్వీకరించడం..దీనికి సంబంధించి రక్షణ శాఖ ట్వీట్ చేయడంతో అప్పట్లో ఈ తల్లీకొడుకులు వార్తల్లో నిలిచారు. తన స్ఫూర్తితో తన కొడుకు కూడా ఆర్మీలోకి రావడం, దేశసేవలో సంతోషంగా ఉందంటూ మురిసిపోతున్నారు మాజీ మేజర్ స్మిత.

**భర్తపోయినా కొడుకుని పంపి !** సాధారణంగా ఇంట్లో కుటుంబ సభ్యులైనా సైన్యంలో చేరి మరణిస్తే.. మరో వ్యక్తిని సైన్యంలోకి పంపే ధైర్యం చేయరు. కానీ రాజస్థాన్‌లోని కోటాకు చెందిన బబితాశర్మ ఈ ధైర్యం చేశారు. ఆమె భర్త సుభాష్‌శర్మ ఆర్మీలో సేవలందించారు. 1996లో బీఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించే సమయంలో వీరమరణ పొందారాయన. అప్పుడు వీళ్ల బాబు క్షితిజ్ శర్మ వయసు తొమ్మిది నెలలు. అయితే తన భర్త పోయినా బబిత అధైర్యపడలేదు. తన కొడుకును పెంచి పెద్ద



చేసింది. ఉన్నత చదువు చెప్పించింది. అతడినీ సైన్యంలో పంపించాలను కున్న బబిత.. ఆ దిశగానే అతడిని తయారు చేసింది. 2014లో నిర్వహించిన ఎన్డీఏ పరీక్షలో ఆలిండియా 13వ ర్యాంకు క్షి తిజ్.. 2017లో ఆర్మీలో లెఫ్టినెంట్‌గా విధుల్లో చేరాడు. నా భర్త దేశసేవలో వీరమరణం పొందాడు.. అంటే తను అమరుడయ్యాడు. అందుకే నన్ను నేను వితంతువుగా ఎప్పుడూ భావించలేదు. దేశసేవలో తరించాలనుకున్న నాభర్త సజీవంగా ఉంచాలన్న ఉద్దేశంతో నా కొడుకును ఆర్మీలోకి పంపాలనుకున్నా. నా ఆశయాన్నీ నిజం చేసిన తనలోనే నా భర్తను చూస్తున్నా.. అంటూ ఎమోషనలయ్యారు బబిత.



**పాలమ్మి కూతురిని ప్రోత్సహించి !..**

నాలుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయిని పెంచి పోషించాలంటే. అదీ భర్త అండ లేకుండా ఏం కష్టమో మాటల్లో చెప్పలేం. హిమాచల్‌దేశం లోని మండీకి చెందిన ద్రుమతీ దేవిదీ ఇదే ఆరిస్థితి. 2017లో భర్తను కోల్పోయిన ఆమె.. ఒంటరి తల్లిగానే ఐదుగురు పిల్లల్ని పెంచింది. పాలమ్ముతూ, కూలి పనులు చేస్తూ వాళ్లను చదివించింది. అయితే ఆమె నలుగురు కూతుళ్లలో చిన్న కూతురు కరిష్మా ఠాకూర్‌కి భారత సైన్యంలో చేరాలన్నది చిన్ననాటి కల. ఇలా తన కూతురి ఇష్టాన్ని తెలుసుకున్న ద్రుమతి ఆమెను ఇదే దిశగా ప్రోత్సహించింది. ఈ క్రమంలోనే మండీలోని ప్రభుత్వ కళాశాల లో బీఏ చదువుతున్నప్పుడే ఎన్‌సీసీలో చేరింది కరిష్మ. వాళ్ల కాలేజీ నుంచి ఎన్‌సిసిలో చేరిన మొదటి విద్యార్థి మా అమ్మాయే! అటు ఆర్మీలో చేరాలని కలతో పాటు పోలీసాఫీసర్ కావాలన్న లక్ష్యాన్నీ పెట్టుకుంది తను. ఈ పరీక్షలకు సిద్ధమవడానికే 20 కిలోమీటర్లు ప్రయాణించేది. ఉదయం 7 గంటలకు ఇంట్లో నుంచి వెళ్తే తిరిగొచ్చే సరికి రాత్రి 7 అవుతుంది. ఏదైతేనేం.. ఆర్మీ రిక్రూట్‌మెంట్ పరీక్ష రాసి అందులో ఉతీర్ణత సాధించింది. గతేడాదే శిక్షణ పూర్తిచేసుకున్న నా కూతురు ఆర్మీలో లెఫ్టినెంట్‌గా ఉద్యోగం సంపాదించింది. ఓ తల్లిగా ఇంతకంటే గర్వించదగ్గ విషయం ఇంకేముంటుంది అంటూ ఎమోషనల్ అయింది. □

**చెలి చిట్కా**

డైనింగ్ టేబుల్ మధ్యలో పుదీనా ఆకును ఉంచితే ఆ వాసనకు ఈగలు, దోమలు దగ్గరకు రావు. □

# వెండి వస్తువులు కొత్తగా..

వర్షాకాలంలో వెండి వస్తువులు నల్లగా మారే అవకాశాలు ఎక్కువ. ఇందుకు కారణం గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటమే. ఇలా గాల్లోని తేమతో జరిగే రసాయనిక చర్య వల్ల వెండి నల్లగా మారిపోతుంది. ఫలితంగా అది మెరుపుని కోల్పోతుంది అందుకే వెండి వస్తువులను వీలైనంత వరకు గాలి తేమ తగలని ప్రదేశంలో భద్రపరచాలంటారు. అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఒక్కోసారి ఇవి నల్లగా మారి మెరుపు కోల్పోతుంటాయి. ఇలాంటప్పుడు కొన్ని ఇంటి చిట్కాలతో తిరిగి వాటిని మెరిపించవచ్చుంటున్నారు నిపుణులు.



**వేడి నీళ్లతో...** వెండి నగలు, వస్తువులపై బాగా మురికి పేరుకు పోయినప్పుడు వేడి నీళ్లతో దాన్ని సులభంగా శుభ్రం చేయచ్చు. ఇందుకోసం రెండు కప్పుల వేడి నీళ్లలో కొద్దిగా డిటర్జెంట్ పౌడర్‌ని కలపాలి. ఆ తర్వాత శుభ్రం చేయాలనుకుంటున్న వెండి వస్తువుల్ని అందులో కొద్దిగా కాసేపు ఉంచాలి. అనంతరం బయటకు తీసి, మెత్తని బ్రష్‌తో సన్నితంగా రుద్దాలి. ఆ తర్వాత పొడిగా ఉన్న మెత్తని వస్త్రంతో తుడిచేస్తే ఫలితం ఉంటుంది.

**ఉప్పు నీళ్లతో..** కాస్త నల్లగా మారిన వెండి వస్తువుల్ని ఉప్పు నీళ్లతో సులభంగా శుభ్రం చేసుకోచ్చు. కొన్ని నీళ్లు తీసుకని అందులో కొద్దగా ఉప్పు కలపాలి. దానిలో నల్లగా మారిన వెండి వస్తువుల్ని కాసేపు ఉంచాలి. ఆ తర్వాత మెత్తటి బ్రష్‌తో రుద్దిదతే నలుపు పూర్తిగా వదిలిపోయి పూర్వపు మెరుపును సంతరించుకుంటాయి.

**టూత్‌పేస్ట్‌తో...** టూత్‌పేస్ట్‌లో ఉండే క్యాల్షియం వెండి వస్తువులను ధగధగలాలా చేస్తుంది. ఈ క్రమంలో కొద్దిగా పేస్ట్‌ని తీసుకుని దాన్ని వెండి వస్తువుకు పల్చని పొరలా పూయలి. టూత్‌పేస్ట్ పూర్తిగా ఆరిపోయే దాకా ఆగాలి. ఆ తర్వాత టిష్యూ పేపర్‌తో తుడిచి నీటితో శుభ్రం చేసేయాలి. ఇలా చేస్తే వాటి మెరుపు తిరిగొస్తుంది. ఇంకా వెండి వస్తువుల నలుపు పూర్తిగా వదలకపోతే ఇది పద్ధతిని మరోసారి పాలో అయితే సరి. □

# మట్టిలో ఆడనివ్వండి !

పిల్లలు మట్టిలో ఆడుతుంటే.. వద్దని చెప్పేస్తాం. చేతులు మురికి చేసుకుంటున్నారని కానీ, ఇది వారిలో వ్యాధినిరోధక శక్తిని పెంచడమే కాదు... మరెన్నో ఆరోగ్యకర ప్రయోగం అందిస్తుందని తెలుసా?



2024లో ఓ అమెరికన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం.. మట్టిలో ఉండే 'మైకోబ్యాక్టీరియం వాక్సీ' అనే సూక్ష్మజీవులు.. చిన్నారుల శరీరంలోకి ప్రవేశించి రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయని వెల్లడిస్తోంది. అంతేకాదు, ఇవి సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక ఆనందాన్నీ పెంచుతాయట. అలర్జీలు, ఆస్తమా వంటి వ్యాధుల ప్రమాదాన్నీ తగ్గిస్తాయి. ఇక, మట్టి టెక్స్చర్, చల్లదనం, వాసన.. వంటివి ఇంద్రియజ్ఞానాన్ని ఉత్తేజపరుస్తాయి. ఫలితంగా వారి నాడీ వ్యవస్థ బలోపేతం అవుతుంది. సులువుగా దేన్నైనా గ్రహించగల శక్తీ ఏర్పడుతుందట. అలానే, మట్టితో ఆటలాడుతూ తయారచేసే ఇళ్లు, జంతువులు.. వంటి బొమ్మ రూపాలు వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. దీంతో స్క్రీన్ టైమ్ కూడా తగ్గి శారీరకంగానూ చురుగ్గా ఉంటారట. మరి ఇప్పుడైనా వారిని మట్టిలో ఆడనిస్తారా? □

# నిద్రలేమిని తరిమేయాలంటే..

సగ్గు బియ్యంతో కిచిడీ, పాయసం ఏది చేసినా సూపర్‌గా ఉంటుంది. పల్చగా జావ కాచి మజ్జిగ కలిపి తాగితే రుచి, బలం కూడా. కర్రపెండలతో తయారయ్యే సగ్గుబియ్యంలో ఏమేం సుగుణాలున్నాయో చూదామా..

- తెల్లటి పూసల్లా ఆకట్టుకునే సగ్గుబియ్యం ప్రొటీన్లు, పీచు, క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్లతో మంచి పోషకాహారం.
- తక్షణ శక్తినిస్తుంది కనుక ఉపవాసం విరమించాక కిచిడీ లేదా పాయసం చేసి తింటారు.
- వేడి తత్వం వల్ల గోధుమలు సరిపడని వాళ్లకి ఇది మంచి ప్రత్యామ్నాయం.
- ఇవి రక్తపోటును, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తాయి. గుండెజబ్బులను అరికడ తాయి.
- ఇన్సోమ్నియాను పోగొట్టి హాయిగా నిద్రపట్టేలా చేస్తుంది.
- మెదడుకు మేలు చేస్తుంది. మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యల నుంచి ఉపశ మనం పొందుతుంది.
- చర్మ సంరక్షణకు సహాయపడుతుంది. రక్త హీనత సమస్య ఉత్పన్నం కాదు. నరాల వ్యవస్థ మెరుగుపడు తుంది. చుండును పోగొడతాయి.



- అరుగుదలను మెరుగుపరుస్తాయి. కడుపుబ్బరాన్ని తగ్గిస్తాయి.
- ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతాయి.
- సన్నగా ఉన్నాం.. కొంచెం ఒళ్లు రావాలి అనుకునే వాళ్లకి సగ్గుబియ్యం తినటం వల్ల ప్రయోజనం ఉంటుంది.

జుట్టు రాలదు.

- చుంద్రును పోగొడ తాయి.జుట్టు రాలదు.
- గర్భిణీలు సగ్గు బియ్యాన్ని ఆహారంలో చేర్చుకోవటం వల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది.
- సగ్గుబియ్యం పొడిని పాలలో కలిపి ఫేస్‌ప్యాక్ వేసు కుంటే ముఖంలో ముడతలు రావు. □

# వంట సులువు

వంట చేయడం పెద్ద ప్రహసనం ఏమీ కాదు.. కూరగాయలు తరగటమే కాస్త కష్టమైన వ్యవహారం. ఆ పనిని తేలిక చేస్తుంది నాన్ ఎలక్ట్రికల్ డబుల్ బ్లేడ్ వెజిటబుల్ చాపర్. కోలగా టిఫిన్ డబ్బాలా కనిపించే ఈ సాధనంలో రెండు బ్లేడులు ఉండటాన కాయ గూరల్ని వేగంగా తరిగేస్తుంది. అప్పుడిక వంట సులువేగా మరి. □



# మహా భారతం

సోమకుడనే రాజర్షి ఉంటాడు. ఆయనకు నూరుమంది భార్యలు. కానీ ఒకే ఒక పుత్రుడు. అతనిపేరు జంతుడు. తల్లులందరూ అతన్ని అల్లారు ముద్దుగా పెంచారు. ఒక రోజు ఆ పిల్ల వాని తోడమీద చీమకుట్టింది. వాడు గుక్కపెట్టి ఏడుస్తుంటే తల్లులందరూ తల్లడిల్లి పోయారు. సోమకుని దుఃఖానికి అంతులేదు. మంత్రులతో, ఋత్విజులతో తన బాధను చెప్పుకొని సలహాను కోరాడు ఋత్విజులు రాజుతో, మహారాజా! నీ భార్యలు నూరుమంది సంతానవతులు కావటానికి ఒక యజ్ఞం చేపిస్తాం. ఆ యజ్ఞానికి నియమం నీ ఏకైక పుత్రుడు జంతుడిని యజ్ఞపశువుగా చేసి అతడి కడుపులోని వపను హోమం చేసి ఆ పొగను రాణులందరూ వాసన చూడాలి, అన్నారు. ఆ రాజు అంగీకరించి ఆ యజ్ఞాన్ని జరిపించాడు. నూరుగురు భార్యలు పుత్రుల్ని కన్నారు. వారు పెద్దవారై శౌర్యప్రతాపాలలో తండ్రిని మించిన వారయ్యారు. (అరణ్య పర్వము తృతీయా శ్వాసము (పుట 293) శ్రీమందాంధ్ర భారతము- రామకృష్ణమఠం). ఈ కథను రోమశమహర్షి ధర్మరాజుకు చెబుతాడు). మహాభారతములో ఇలా ఉంది కదా అని ఈనాడు ఎవరైనా అలాంటి యజ్ఞాలను చేపిస్తామంటే ఎవరూ ఒప్పుకో రాదు. అలాంటి మాటల్ని నమ్మి బాగా చదువుకొన్న తల్లితండ్రులు తమ ఇద్దరు కుమార్తెలను చంపుకొన్న ఘటన మదనపల్లెలో జరిగినట్టు పత్రికలు చెబుతున్నాయి. అలాంటి బలులను ఇచ్చి పిల్లలు కల్గని స్త్రీలకు పిల్లలు కలిగేట్టు చేసే సామర్థ్యం ఆనాటి ఋత్విజులకు ఉండిండవచ్చు. పైగా ఆ యజ్ఞాన్ని జరిపించిన ఆ ఋత్విజుడు నరకానికి పోయినట్లు అదే భారతంలోనే స్పష్టంగా ఉంది నరకాగ్నిలోపడి మలమలమాడి పోయినట్టూ ఉంది. అలాంటి సలహాలు ఎవ్వరూ ఇవ్వరాదు, ఎవ్వరూ పాటించరాదు. రామాయణ, భారత, భాగవతాలనుండి అలాంటి వాటిని కాదు తెలివైన వారు గ్రహించాల్సి నది. మన జీవితాలు బాగుపడటానికి ఏనాటికైనా ఉపయో కరమైన విషయాలు ఎన్నెన్నో ఉన్నాయి. భారతంలో వాటిని గ్రహించి మనం బాగుపడి, ఇతరులను బాగుపరచాలి. భారత రామాయణాలకు అర్హులైన వారసులం అనిపించుకోవాలి మూఢ విశ్వాసం కారాదు.

- రాచమడుగు శ్రీనివాస్

ఆధ్యాత్మికం

# చేపల ఫ్రై రుచిగా..

- ముందుగా చేప ముక్కలను 20 నిమిషాలు పాలలో నానబెట్టా, తర్వాత పాలు తీసేయాలి. ఇలా చేయడం వల్ల నీచు వాసన తగ్గడమే కాకుండా అదనపు రుచి వస్తుంది.
- చేపముక్కలకు మసాలా పట్టించేటప్పుడు కొద్దిగా శనగపిండి లేదా బియ్యప్పిండిని జోడిస్తే.. ఫ్రై కరకలడుతుంది.
- ఉల్లిపాయల్లో తగినంత తేమ ఉంటుంది కనుక మసాలా పేస్ట్‌ను గ్రైండ్ చేసేందుకు నీళ్ల అవసరం లేదు. దానికి బదులు చెంచా నిమ్మరసం ఉపయోగించవచ్చు.
- ఉల్లి, అల్లం, వెల్లుల్లి పేస్టు, పసుపు, కారం ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, ఉప్పు కలిపి ముద్దలా చేయాలి. చేపముక్కలకి ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. 4.ఫిష్ ఫ్రై యథాతథంగా చేపలతో చేయొద్దు, చేపలను ముక్కలుగా కోసి చేస్తేనే భాగుంటుంది. దీనికి ఎక్కువ నూనె అవసరం లేదు.
- నూనె మరీ వేడిగా ఉంటే నానబెట్టిన చేప ముక్కలు పాత్రకు అంటుకుంటాయి. తగినంత సెగలో వేయించాలి.



- ఎక్కువ మోతాదులో చేయాల్సివస్తే అనీ ఒకసారే వద్దు. కొన్ని కొన్ని ముక్కల చొప్పున వేయించండి. ఎక్కువ మొత్తంలో ముక్కలు వేస్తే నూనె ఎక్కువ పీల్చుకుంటుంది. పైగా ముక్కలు సరిగా వేగవు.
- చేపముక్కలను రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వహ్వా అనిపించే రుచి రావాలంటే పావుగంట పడుతుంది. □

# పెద్దవారిని పలకరిస్తున్నారా !

ఇంట్లో నానమ్మను ఉపయోగపడని సామానుగా పోలుస్తూ.. పిల్లలు హేళన చేస్తుంటారు. అలాగే భావిస్తూ వాళ్లకు పలక రింపు కరవైతే ఇంటిల్లిపాదీ మధ్య ఉంటూనే వృద్ధులు ఒంటరి తనాన్ని అనుభవిస్తారు. గతకాలానికి సంబంధించిన వివేసాలను మనకు అందించే వారధుల్లాంటి పెద్ద వాళ్లను సంరక్షించాలి. అప్పుడే మరింత కాలం వాళ్లు సంతోషంగా జీవిస్తారు. ఏదైనా ప్రత్యేకదినం లేదా నూతన సంవత్సరం అంటూ జీవితంలో తీర్మానాల పట్టిక తయారు చేస్తుంటాం. కెరియర్, ఆరోగ్యం కోసం ఇకపై ఎలా ఉండాలో ప్రణాళికలు వేసుకుంటాం. అలాగే ఇంట్లో వృద్ధుల సంరక్షణ కోసంకూడా మనకు మనం కొన్ని తీర్మానాలు చేసుకోవాలి. ఇంటిల్లిపాది ఉండగా, ఎవరో ఒకరే కాకుండా ప్రతి ఒక్కరూ



వాళ్లతో ఆత్మీయంగా ఉండాలి. ముఖకవళికలను బట్టి వారి మనసులో ఏముందో గుర్తించడం పిల్లలకూ నేర్పించాలి. శారీరక, మానసికారోగ్యానికి సంబంధించి వారిలో కలిగే చిన్న మార్పును కూడా కనిపెట్టాలి. రోజులో వాళ్ల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని తీర్మానం చేసుకుంటే, ఆ సంభాషణలో వారి మనసు అర్థమవుతుంది. పలకరించి కాసేపు మాట్లాడితే చాలు. వారి మనసులో గూడుకట్టుకున్న ఒంటరితనం క్షణాల్లో దూరమవుతుంది.

**అనుభవాలను చెప్పిస్తే..** రోజు వారి నుంచి ఒక జీవితానుభవాన్ని అడిగి తెలుసుకోవాని మనకు మనమే తీర్మానం చేసుకోవాలి. కనీసం వారికి తెలిసిన వ్యక్తుల గురించి వాట్లాడమనడం లేదా ఏదైనా పౌరాణికగాథను చెప్పమనడం.. వంటివన్నీ వారిని మానసికంగా ఉత్తేజితులను చేస్తాయి. ఉత్సాహంగా గతకాలాన్ని నెమరువేసుకుంటారు. అప్పటి అనుభవాలను పంచుకుంటారు. అది వారిని సంతోషంగా ఉంచి ఆరోగ్యాన్ని పెంచుతుంది.

**కాసేపు నడిస్తే...** ఇంటి వరండా లేదా గార్డెన్‌లో పది నిమిషాలు వారిని నడిపించాలనే తీర్మానం తీసుకోవడం కూడా మంచిది. అది వారికి వ్యాయామం అవుతుంది. చెట్ల మధ్య నడిచేటప్పుడు వాళ్ల మనసంతా తేలికగా మారుతుంది. గతంలో వారు చేపట్టిన బాధ్యతలు, పిల్లల పెంపకంలో వాళ్లు తీసుకున్న జాగ్రత్తలను ప్రశంసిస్తూ, ప్రస్తుతకాలంలో వారు గుర్తించిన మార్పులను చెప్పమనాలి. ఇప్పటి పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు సలహాలు, సూచనలూ తీసుకోవాలి. ఇవన్నీ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి. తామెందుకూ పనికిరావడంలేనే ఆత్మన్యూనత ఉంటే దాన్నుంచి బయటపడతారు.

**స్నేహం చేయాలి..** వాళ్ళను స్నేహితులుగా స్వీకరించాలి. ప్రేమించాలి. కెరియర్ లేదా నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను వారితో పంచుకోవచ్చు. సమస్య వివరించి పరిష్కారాన్ని చెప్పమంటే చాలు. అనుభవంతో వాళ్లందించే సలహాలూ ఎంతో ఉపయోగ పడతాయి. జీవితంలో లక్ష్యాలను చేరుకునేలా చేస్తాయి. వారిని అనుభవాలు పాఠాలై ముందుకు నడిపిస్తాయి. వారి నుంచి దొరికే నిస్వార్థమైన ప్రేమతో మనకూ కష్టం వస్తే చెప్పడానికి ఒకరున్నారనే భరోసావస్తుంది. □

# మహిళల వన్డే వరల్డ్ కప్ ఖరారు

## సెప్టెంబరు 30 నుండి ప్రారంభం

## భారత్, శ్రీలంకలో పాల్గొననున్న 8 జట్లు

**న్యూఢిల్లీ:** భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్న మహిళల వన్డే ప్రపంచ కప్ ఖరారైంది. ఈ మేరకు దీనికి సంబంధించిన తేదీలు, వేదికలను ఐసీసీ ప్రకటించింది. ఈ గ్లోబల్ టోర్నమెంట్ 12 ఏళ్ల తర్వాత ఇండియాలో నిర్వహించబడుతోంది. వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ నవంబర్ 2న జరగనుంది. ఈ మ్యాచ్‌లు భారత్, శ్రీలంకలోని ఐదు నగరాల్లో జరుగుతాయి. వాటిలో బెంగళూరులోని ఎం.చిన్నస్వామి, గౌహతిలోని ఏసీఏ, ఇండోర్‌లోని హోల్కర్, విశాఖపట్నంలోని ఏసీఏవీడీసీఏ, కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియాలు ఉన్నాయి. ఈ వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ నవంబర్ 2న జరగనుంది. ఇక



ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 30న బెంగళూరులో జరిగే మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. భారత జట్టు ప్రారంభ మ్యాచ్‌లో ఆడనుంది. మొదటి సెమీఫైనల్ మ్యాచ్ అక్టోబర్ 29న గౌహతి లేదా కొలంబోలో జరుగుతుంది. రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ అక్టోబర్ 30న బెంగళూరులో జరుగుతుంది. ఫైనల్‌కు చేరుకునే రెండు జట్లకు సన్నాహాలకు రెండు రోజుల సమయం లభిస్తుంది. మహిళల వన్డే ప్రపంచ కప్ టైటిల్ మ్యాచ్ నవంబర్ 2న బెంగళూరు లేదా కొలంబోలో జరగనుంది. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలకు చెందిన 8 జట్లు మహిళల వన్డే ప్రపంచ కప్‌లో పాల్గొననున్నాయి. ఆస్ట్రేలియా ఈ టోర్నమెంట్‌లోకి డిఫెండింగ్ ఛాంపియన్‌గా ప్రవేశించనుంది. కాగా 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన చివరి ప్రపంచ కప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఆస్ట్రేలియా ఏడుసార్లు టైటిల్‌ను గెలుచుకుంది. టోర్నమెంట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది.

# అర్జున్‌పై గుకేష్ తొలి క్లాసికల్ విక్టరీ


## మహిళల ఈవెంట్‌లో హంపి ఓటమి

**న్యూఢిల్లీ:** నార్వే చెస్ టోర్నమెంట్‌లో 7వ రౌండ్ తర్వాత, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ అద్భుతమైన ఆటతీరుతో క్లాసికల్ చెస్‌లో తొలిసారిగా భారత్‌కే చెందిననగ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్‌ని ఓడించాడు. తెల్ల పావులతో ఆడుతూ, గుకేష్ మూడు గంటలకు పైగా వెనుకబడి ఉన్నా కానీ ఒత్తిడిలో కూడా గట్టిగా నిలబడ్డాడు. అర్జున్ తడబడినప్పుడు గుకేష్ ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. 19 ఏళ్ల దొమ్మరాజు ఇప్పుడు



11.5 పాయింట్లతో డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ (11)ను అధిగమించాడు. దీంతో అర్జునన్ 7.5 పాయింట్లతో ఐదవ స్థానానికి పడిపోయాడు. ఇక ఫాబియానో కరువానా 6.5 పాయింట్లతో దిగువన ఉన్న వీ యిని ఓడించి 12.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. నకమురా 8.5 పాయింట్లతో నాల్గవ స్థానంలో ఉన్నాడు. ఇక మహిళల విభాగంలో జు వెంజున్ 11.5 పాయింట్లతో ముందంజలో ఉంది. అన్నా ముజిచుక్ (11) ఆర్మగెడాన్‌లో భారత్‌కు చెందిన కోనేరు హంపి (10.5)ను ఓడించింది. ఆర్. వైశాలి టైమ్ ట్రబుల్‌లో చైనాకు చెందిన లీ టింగ్జీ చేతిలో ఓడిపోయింది.

**మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించడంపై గుకేష్:** 100కి 99 సార్లు, నేను ఓడిపోయేవాడిని. గుకేష్ వరుసగా సాధించిన రెండో క్లాసికల్ విజయం టైబ్రేక్ అవసరం లేదు మరియు ఎరిగైసి చేతిలో రౌండ్ 2లో ఓడిపోయినందుకు ప్రతీకారం తీర్చుకోవడం ఇది. రౌండ్ 6లో కార్ల్‌సెన్‌పై తిరిగి విజయం సాధించిన తర్వాత కూడా ఈ విజయం జరిగింది.



## ఇండోనేసియా ఓపెన్‌లో..


# సింధు విజయం

## మాళవిక, అనుపమ, రక్షిత, లక్ష్య, ప్రణయ్ ఔట్

ఆట

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్-2025 మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో మహిళల విభాగంలో భారత్ షట్లర్ పివి సింధు విజయం సాధించగా, మరో భారత షట్లర్ మాళవిక బన్సోడ్ తప్పుకుంది. అలాగే పురుషుల ఈవెంట్‌లో లక్ష్యసేన్, ప్రణయ్, అనుపమ ఉపాధ్యాయ్, రక్షిత రామరాజ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మంగళవారం జరిగిన ఇండోనేషియా ఓపెన్‌లో రౌండ్ ఆఫ్ 32లో జపాన్‌కు చెందిన నోజోమి ఒకుహారాపై జరిగిన మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సింధు విజయం సాధించగా, లక్ష్య సేన్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గంటా 19 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ పోరులో సింధు 22-20, 21-23, 21-15 తేడాతో గెలిచింది. తొలి గేమ్‌ను కైవసం చేసుకున్న తర్వాత, వరుస గేమ్‌లలో మ్యాచ్‌ను ముగించే దిశగా దూసుకుపోయింది, కానీ ఒకుహారా తిరిగి పోరాడి నిర్ణయాత్మక స్థానాన్ని సంపాదించుకుంది. మూడవ గేమ్‌లో ఎక్కువ భాగం సింధు స్థిరమైన ఆధిక్యాన్ని కొనసాగించింది, బిడబ్ల్యూఎఫ్ సూపర్ 1000 ఈవెంట్‌లో రెండవ రౌండ్‌లో స్థానం సంపాదించడానికి తనకు మరియు ఒకుహారాకు మధ్య తగినంత దూరం ఉంచింది. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష్య ఈ సీజన్‌లో తన ఐదవ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు, చైనాకు చెందిన షి యు క్వి చేతిలో 11-21, 22-20, 15-21 తేడాతో ఓడిపోయాడు. మరో భారత్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా ఇండోనేషియాకు చెందిన అల్వి ఫర్హాన్ చేతిలో 17-21, 18-21 తేడాతో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్‌లో, దక్షిణ కొరియాకు చెందిన కిమ్ గా యున్ చేతిలో వరుస గేమ్‌లలో ఓటమి పాలైన తర్వాత అనుపమ ఉపాధ్యాయ నిష్క్రమించింది. స్థానిక క్రీడాకారిణి పుత్రి కుసుమ వార్దానీతో రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో 23 ఏళ్ల మాళవిక 21-16, 16-15 ఆధిక్యంలో ఉండగా, ఆమెమోకాలికి గాయం అయింది. దీంతోటై ప్రారంభమైన 54నిమిషాల నుండి ఆమె వైదొలగాల్సి వచ్చింది. కోర్టు వెనుక నుండి కొట్టిన షాట్‌ను తిరిగి కొట్టడానికి ప్రయత్నిస్తుండగా ఎడమకాలుజారి మాళవిక కిందపడి గాయం కావడంతో ఆటను కొనసాగించలేకపోయింది. అలాగే థాయిలాండ్‌కుచెందిన సుపానిడా కటేథాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, రక్షితరామ్‌రాజ్‌కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది. భారత క్రీడాకారిణి21-14, 15-21, 12-21 తేడాతో ఓడిపోయింది.

# బౌలర్లకు గుడ్ న్యూస్



## సింగిల్‌నఇన్నింగ్స్‌లో రెండు బంతులు

## బౌండరీ లైన్ వద్ద అందుకునే క్యాచ్‌లు

## క్రికెట్ కౌన్సిల్ న్యూ రూల్స్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ త్వరలోనే కొత్త నిబంధనలు తీసుకురాబోతోంది. ఇది బౌలర్లకు నిజంగా పండగలాంటి వార్తే అని చెప్పవచ్చు. వన్డే క్రికెట్లో గత కొన్ని సంవత్సరాలుగా రెండు బాల్స్ నిబంధన అమలు అవుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ రూల్ బౌలర్లకు పెద్దగా అనుకూలంగా లేదని బ్యాటర్లకు ఉపకరిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో క్రికెట్ నిబంధనల్లో పలు కీలక మార్పులను తీసుకురావాలని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న మూడు రూల్స్ సవరించాలని ఐసీసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బౌలింగ్ జట్టు సింగిల్ ఇన్నింగ్స్ లో రెండు బంతులు వాడటం, బౌండరీ లైన్ దగ్గర అందుకునే క్యాచులు, కంకషన్ సబ్ స్టిట్యూట్ వాడకం వంటి నిబంధనల్లో మార్పులు చేయనుంది. రెడ్ అండ్ వైట్ బాల్ రెండూ ఫార్మట్లలోనూ ఈ మార్పులు జరుగుతాయి. టెస్టుల్లో జూన్ నుంచే, వన్డే ఫార్మాట్లో జులై నుంచి అమలు కానున్నాయి. ప్రస్తుతం వన్డేల్లో బౌలింగ్ జట్లు రెండు బంతులు వాడుతున్నాయి. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచి 50వ ఓవర్ వరకు రెండు బంతులు వాడుతూ బౌలింగ్ చేస్తున్నాయి. అయితే ఇప్పుడు ఈ నిబంధన మారుతుంది. ఇకపై ఈ రూల్ 35 ఓవర్ల వరకే ఉంటుంది. అంటే 34 ఓవర్లు ముగిసే వరకు ఇరు జట్లు రెండు బంతులను వాడుకుని బౌలింగ్ చేస్తారు. కానీ35వ ఓవర్ తర్వాత 50వ ఓవర్ వరకు ఏదైనా ఒకటే బంతితో బౌలింగ్ చేయాలి. ఒకవేళ వర్షం వల్ల లేదా ఇతర కారణాల వల్ల మ్యాచ్ 35 ఓవర్లకు కుదించినట్లయితే ఇరు జట్లు కేవలం ఒక బంతితోనే బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ మార్పు జులై 2న జరగనున్న శ్రీలంక బంగ్లాదేశ్ మ్యాచ్ నుంచే అమలు కానుంది. ఈ మార్పు వన్డే ఫార్మాట్ పై ప్రభావం చూపే అవకాశం కూడా ఉంది. అలాగే క్రికెట్లో మరోకీలకమైన కంకషన్ సబ్ స్టిట్యూట్ రూల్ ను కూడా ఐసీసీ సవరించింది. మ్యాచ్ ప్రారంభం అవ్వకముందే ఇరు జట్లు ఐదేసీ సబ్ స్టిట్యూట్ ప్లేయర్ల జాబితా ఇవ్వాల్సి ఉంటుంది. దీనిలో ఒక వికెట్ కీపర్, ఒక్కో బ్యాటర్, పేస్ బౌలర్, స్పిన్నర్, ఆల్‌రౌండర్ ఉండాల్సిందే. మ్యాచ్ ఆడుతుండగాప్లేయర్ గాయపడి మైదానాన్ని వీడితే ఇంకో ఆటగాడిని అతని స్థానంలో కంకషన్ గా తీసుకుంటారు. ఇలా కంకషన్ గా వచ్చిన ప్లేయర్ బౌలింగ్ లేదా బ్యాటింగ్ చేయవచ్చు. ఇక ఈ కొత్త నిబంధనలు జూన్ 11 నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రారంభం కానుంది. లార్డ్స్ వేదికగా ఈ ప్రతిష్టాత్మక మ్యాచులో ఆస్ట్రేలియా సౌతాఫ్రికా తలపడనున్నాయి. అయితే ఈ మ్యాచులో నిబంధనలు మార్పులేవి ఉండటం లేదు. తాజా డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్లో ఈ సవరించిన నిబంధన అమలు చేయనున్నారు అలాగే రివ్యూ, బౌండరీ లైన్ వద్ద క్యాచ్స్ అంశాల్లోనూ మార్పులు చేయనున్నట్లు సమాచారం.

# క్వార్టర్ ఫైనల్స్‌కు సిన్నర్



**న్యూఢిల్లీ:** రోలాండ్ గారోస్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ జానిక్ సిన్నర్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. పారిస్‌లో మంగళవారం జరిగిన ఈ టోర్నీలో 17వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్‌ను 6-1, 6-3, 6-4 తేడాతో టాప్ సీడ్ జానిక్ సిన్నర్ ఓడించాడు. దీంతో తన కెరీర్‌లో 11వ గ్రాండ్ స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు, రోలాండ్ గారోస్‌లో మూడవ స్థానానికి చేరుకున్నాడు. గ్రాండ్ స్లామ్ టోర్నమెంట్‌లో సిన్నర్ వరుసగా 18వ మ్యాచ్ విజయం ఇది. సిన్నర్ ఇప్పటివరకు పారిస్‌లో 12 సెట్లలో కేవలం 30 ఆటలను మాత్రమే కోల్పోయాడు. గ్రాండ్ స్లామ్ ఈవెంట్లలో తన విజయ పరంపరను విస్తరించడం ద్వారా, ప్రపంచ నంబర్ 1 ఓపెన్ యుగంలో తొమ్మిదవ అజేయ స్థానం కోసం ఆండ్రీ అగస్సీ, బోరిస్ బెకర్, మాట్స్ విలాండర్‌లను సమం చేశాడు. మరో నాలుగు విజయాలు సాధిస్తే అతనికి తొలి రోలాండ్‌గారోస్ టైటిల్ మాత్రమే కాకుండా, ఆ అద్భుతమైన జాబితాలో ఏడవ స్థానాన్ని సాధించిన ఏకైక వ్యక్తిగా కూడా నిలవనున్నాడు. కాగా 2022 తర్వాత తొలిసారిగా తన సొంత మూడో రోలాండ్ గారోస్ క్వార్టర్ ఫైనల్ కోసం బిడ్డింగ్ చేస్తున్న రుబ్లెవ్ మ్యాచ్ అంతటా ఫస్ట్‌స్ట్రైక్‌ను కొనసాగించాడు. కానీ ఇటాలియన్ ఆటగాడు అరగంటలో మొదటి సెట్‌ను ముగించడంతో సిన్నర్ సొంత స్ట్రైక్‌ల ద్వారా పూర్తిగా అవుట్ అయ్యాడు. అయితే సిన్నర్ మూడు సెట్లలో 25 విన్నర్లను కొట్టాడు. రెండు గంటల మ్యాచ్‌లో ఎప్పుడూ సర్వీస్‌ను కోల్పోలేదు. చివరి రెండు సెట్లలో కలిపి ఒకే ఒక బ్రేక్ పాయింట్‌ను మాత్రమే ఎదుర్కొన్నాడు. అది మూడవ సెట్‌లో 2-2తో వచ్చింది, కానీ రుబ్లెవ్ రెండవ సర్వ్‌లో బ్యాక్‌హ్యాండ్ రిటర్న్‌తో కోర్టును కనుగొనలేకపోయాడు. మ్యాచ్‌లో 17వ సీడ్ ఆటగాడు చేసిన 39 అన్‌ఫోర్స్డ్ ఎర్రర్‌లలో ఇది ఒకటి. కాగా ర్యాంకింగ్స్‌లో వరుసగా 52వ వారం నంబర్ 1గా నిలిచిన సిన్నర్, తదుపరి ఎటిపి హెడ్2హెడ్ సిరీస్‌లో 3-1తో ఆధిక్యంలో ఉన్న అలెగ్జాండర్ బుబ్లిక్‌తో తలపడనున్నాడు. ప్రపంచ నంబర్ 62 బుబ్లిక్ గతంలో ఐదవ సీడ్ జాక్ డ్రేపర్‌ను ఓడించి చరిత్రలో సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న తొలి కజకిస్తానీ వ్యక్తిగా నిలిచాడు.

# నష్టాలను వీడని స్టాక్ సూచీలు

**ముంబై, జూన్ 3:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఆరంభంలోనే తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. దీంతో ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు,చివరకు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,492.50 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచి ఇంట్రాడేలో 81,774.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రధాన షేర్లలో అమ్మకాలతో డీలా పడిన సూచి 80,575.09 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 636 పాయింట్ల నష్టంతో 80,737 వద్ద ముగిసింది. నిఫ్టీ 174 పాయింట్ల నష్టంతో 24,542.50 వద్ద ముగిసింది. అదానీ పోర్ట్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, బజాజ్‌ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎంఅండ్ఎం షేరు మాత్రమే లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.56 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,355 డాలర్ల వద్ద కొనసాగింది. ఆల్‌టైం గరిష్ఠానికి బ్యాంక్ నిఫ్టీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రధాన షేర్లు రాణించడంతో బ్యాంక్ నిఫ్టీ ఆల్‌టైం గరిష్ఠాన్ని తాకింది. ఓ సమయంలో 56,161.40 వద్ద తాజా రికార్డును నెలకొల్పింది. తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో నష్టాల్లోకి జారుకుంది. కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు గత రెండు ట్రేడింగ్ సెషన్ల నుంచి వరుసగా అమ్మకాలకు దిగారు. సోమవారం రూ.2,589 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇది స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి పెంచింది. అంతర్జాతీయ మార్కెట్లలో



బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 0.57 శాతం పెరిగి 65 డాలర్లకు చేరింది. ఒపెక్+ దేశాల నుంచి ఊహించిన దానికంటే తక్కువ ఉత్పత్తి నమోదు కావడం, రష్యాఉక్రెయిన్ యుద్ధ ఆందోళనలు.. వంటివి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి.

# భారత్‌తో త్వరలో ట్రేడ్ డీల్.. అమెరికా మంత్రి

**వాషింగ్టన్, జూన్ 3:** భారత్‌లో ట్రేడ్ డీల్ మరెంతో దూరంలో లేదని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక నాయకత్వ సదస్సులో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయని పేర్కొన్నారు. ఇరు దేశాల చర్చలు చివరిదశకు చేరిన వేళ ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇవి సుదీర్ఘకాలంగా జరుగుతున్న చర్చలను ముందుకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. సమీప భవిష్యత్తులోనే భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాన్ని మీరు ఆశించవచ్చు. భారత్ సరైన వ్యక్తిని ఎంపిక చేసి పంపిస్తే, మా నుంచి చర్చలకు తగిన వ్యక్తిని పంపిస్తాం. అమెరికాతో ముందు ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకొన్న దేశాలకు మెరుగైన డీల్ లభిస్తుంది. జులై 4 నుంచి 9లోపు వచ్చే వారికి ఆ అవకాశం అందుకోవచ్చు అని లుట్నిక్ తెలిపారు. భారత్ కూడా ఈ వాణిజ్య ఒప్పందంపై ఆశాభావంగా ఉంది. ఇప్పటికే ప్రతిపాదిత ఒప్పందంపై న్యూఢిల్లీ చురుగ్గా పనిచేస్తోంది. దీనిపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్



మాట్లాడుతూ, ఇరు దేశాలు కలిసి పని చేయడంపై ఓ అభిప్రాయానికి వచ్చాయి. పరస్పరం మార్కెట్లలోకి ఇరుదేశాల వ్యాపారాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మేము ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై పనిచేస్తున్నాం అని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా నుంచి వచ్చిన ఓ బృందం న్యూఢిల్లీలో పర్యటిస్తోంది. ఈ క్రమంలో చర్చలను ముందుకు తీసుకెళ్లి, జూన్ చివరికి వీటిని ఒకొలిక్కి తేనున్నాయి. 26శాతం ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు కోసం భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

# 300 మందికి మైక్రోసాఫ్ట్ ఉద్వాసన

**ముంబై, జూన్ 3:** ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ మైక్రోసాఫ్ట్ తాజాగా 300 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించినట్లు కొన్ని నివేదికలు తెలిపాయి. మే నెలలో దాదాపు 6వేల మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలిపిన కొన్ని రోజుల్లోనే ఇలా మరో 300 మంది ఉద్యోగాలు కట్ చేయడం ఆందోళన కలిగిస్తుంది. ఈ తొలగింపులు సంస్థ విస్తృత సంస్థాగత పునర్నిర్మాణానికి అనుగుణంగా ఉన్నాయని కంపెనీ తెలిపినట్లు తెలిసింది. ఈ లేఆఫ్స్ ద్వారా కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, దీర్ఘకాల ప్రాధాన్యతలపై వనరులను కేంద్రీ కరించడం లక్ష్యంగా పెట్టుకు న్నట్లు పేర్కొంది. ఇటీవల టౌన్ హాల్‌లో మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల ఉద్యోగుల తొలగింపులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ లేఆఫ్స్ పనితీరుకు సంబంధించినవి కావని, వ్యూహాత్మక మార్పులో భాగంగా ఉన్నాయని ఆయన తెలిపారు. కృత్రిమ మేథ సామర్థ్యాలను మైక్రోసాఫ్ట్ వేగంగా విస్తరిస్తోంది. దాంతో ఎఐ మౌలిక సదుపాయాలు, దానిఅభివృద్ధి కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వివిధ ప్రాజెక్ట్‌ల్లో దాదాపు 30శాతం కోడ్ రాయడానికి సహాయపడుతుందని సత్య నాదెళ్ల తెలిపారు. ఇది ఆటోమేషన్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్‌పై అధికంగా ఆధారపడడాన్ని సూచిస్తుందని




పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ తాజాగా ప్రకటించిన లేఆఫ్స్‌లో ఏ కేటగిరీ ఉద్యోగులను తొలగించిందో పేర్కొనకపోయినప్పటికీ, క్రితం తొలగింపులో ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లను లక్ష్యంగా చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడంలో ఎఐ అసిస్టెడ్ కోడింగ్ టూల్స్‌ను మైక్రోసాఫ్ట్, మెటా ప్లాట్‌ఫామ్స్‌తో సహా ఇతర సంస్థలు ఎంచుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంతర్గతంగా సంస్థల్లో తక్కువ మంది సిబ్బంది నియామకానికి కారణమవుతుందని సేల్స్‌ఫోర్స్ గత వారం తెలిపింది.

# ఐదేళ్లలో 50 ఎయిర్‌పోర్టులు

**న్యూఢిల్లీ, జూన్ 3:** దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేసి మొత్తం ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను 212కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం (ఐఎటిఎ) వార్షిక సమావేశంలో ఈ మేరకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఈ విస్తరణలో ఉడాన్ పథకం కీలకంగా వ్యవహరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. దేశం అంతటా ప్రజలకు మరింత చౌకగా, అందుబాటు ప్రాంతాల్లో విమానప్రయాణం చేసేలా ఉడాన్ పథకం సంస్కరణలు తీసుకొస్తోంది. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి 619 కొత్త మార్గాలను నెట్‌వర్క్‌లో జోడించింది. ఇది చిన్న



పట్టణాలు, నగరాలకు ప్రత్యక్ష విమాన కనెక్టివిటీని పొందేందుకు దోహదపడుతుంది. విమానాశ్రయాల సంఖ్యను విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి చెప్పారు. ప్యాసింజర్ కనెక్టివిటీకి మించి భారత్ గ్లోబల్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్హాల్ (ఎంఆర్‌ఒ) హబ్‌గా కూడా నిలదొక్కుకుంటోంది. 2031 నాటికి ఎంఆర్‌ఒ విభాగం 4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయ, అంతర్జాతీయ విమానాల నిర్వహణ అవసరాలను తీర్చే ప్రపంచ స్థాయి సౌకర్యాలను సృష్టించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

## వాణిజ్యం

# పెరగనున్న ఉల్లి, టమాటా ధరలు!

**ముంబై, జూన్ 3:** ప్రస్తుతం కాస్త చౌకగా లభిస్తున్న ఉల్లిపాయ, టమాటాలు మరికొన్ని రోజుల్లో భారీగా ధర పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా ఉల్లిపాయ, టమోటా పంటలు దెబ్బతిన్నాయి. దీని కారణంగా టమాటాలు, ఉల్లిపాయల సరఫరా తగ్గింది. దీని ప్రభావం ధరలలో కనిపిస్తుంది. జూన్‌లోనే టమోటా ధర రిటైల్‌లో రూ.24 నుండి రూ.30కి పెరిగింది. ఇది రాబోయే రెండు వారాల్లో రెట్టింపు అవుతుందని, నెలలో రూ.80 నుండి రూ.100కి చేరుకుంటుందని అంచనా. మరోవైపు, ఉల్లిపాయల ధరలు కూడా కిలోకు రూ.6 పెరిగాయి.రాబోయే ఒక నెలలో ఉల్లిపాయ ధర రూ.50కి చేరుకోవచ్చు. నిజానికి మే నెల రెండవ పక్షం రోజుల్లో మహారాష్ట్రలో ఉల్లిపాయ ధరలలో 20 శాతం పెరుగుదల కనిపించింది. దీని ప్రభావం దేశంలోని ఇతర మార్కెట్లలో లేదా దేశ రాజధాని ఢిల్లీలో కనిపిస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఉల్లిపాయ, టమాటా రెండింటి పంట చాలా దారుణంగా ఉంది. భారీ వర్షాల ప్రభావం సరఫరాపై కూడా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో, ఉల్లిపాయ, టమాటా ధరలు మరింత పెరగవచ్చు. ఢిల్లీలో ఉల్లిపాయ, టమాటా ధరలు ఎంత పెరిగాయి. గత రెండు రోజుల్లో అంటే జూన్ 1, 2 తేదీలలో ఉల్లిపాయ, టమాటా ధరలు 40 నుండి 50 శాతం పెరిగాయి. మే 31న దేశ రాజధాని ఢిల్లీలో ఉల్లిపాయ రిటైల్ ధర కిలోకు రూ. 20 ఉండగా, జూన్ 2న అది కిలోకు రూ. 30కి పెరిగింది. మరోవైపు, గత



నెల చివరి రోజున టమాటా రిటైల్ ధర కిలోకు రూ.20గా ఉండగా, అది ఇప్పుడు కిలోకు రూ.35కి పెరిగింది.

# తగ్గనున్న వంట నూనెల ధరలు!

**న్యూఢిల్లీ, జూన్ 3:** ముడి వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు వారాల్లో రిటైల్ స్థాయిలో వంట నూనెల ధరలు 5-6శాతం తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో దాదాపు 17శాతం పెరిగిన వంట నూనె ధరలు ఎట్టకేలకు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఇది సుంకాల మధ్య వ్యత్యాసం 12.5శాతం నుంచి 22.5 శాతానికి పెరగడం వల్ల కంపెనీలు ముడినూనెను దిగుమతి చేసుకుని దేశీయంగా శుద్ధి చేయడం చాలా ఖర్చుతో కూడుకుంది. అయితే తాజాగా 10 శాతం సుంకం తగ్గింపు నిర్ణయం ఈ విభాగంలోని వ్యాపా



సింగిల్ డిజిట్‌కు చేరుకుంటుందని భావిస్తున్నట్లు నిపుణులు వెల్లడించారు. తగ్గిన సుంకాలవల్ల కలిగే ప్రయోజనం మరో 15 రోజుల్లో రిటైల్ ధరల్లో ప్రతిఫలిస్తుందని భావిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లు ఇప్పటికే ధరలు తగ్గుముఖం పట్టే సంకేతాలను చూపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు తెలియచేస్తున్నాయి. ధరలదిద్దుబాటు కేవలం దిగుమతి చేసుకునే నూనెలకే పరిమితం కాదని కూడా తెలిపాయి. దిగుమతులపై ఆధారపడని ఆవనూనె కూడా వంటనూనెలపై కూడా 3-4శాతం తగ్గు దలను చూడవచ్చని తెలిపాయి. ముడి వంట నూనె, రిఫైన్డ్ ఆయిల్ రాలకు బూస్ట్‌గా నిలుస్తుందని కూడా తెలిపాయి. ప్రభుత్వ నిర్ణయంతో వంట నూనెల దేశీయ రిటైల్ ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.